
స్వభాను భారతి సంపుటము-20
చైత్రము - ఏప్రిల్ - 1943 - సంచిక - 4



సంపుటము 20
సంచిక 4

భారతి

స్వభాను చైత్రము
1943 ఏప్రిల్

# 'స్వభానువా! స్వాగతంబు'

= శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి =

కఱవు తీఱంగఁ బండిన కఱవుచేత
భారతీయులు కటకటం బడుట చూచి
కాలనాథుండు తత్ప్రతీకార మరయ
నంపినట్టి స్వభానువా! స్వాగతంబు.

తన్నుఁ దాఁ గనకున్కి బంధనము తగులుఁ
దన్నుఁ దాఁ గనుచున్కి బంధనము వదలు
నని మహాకాలుఁ డాత్మరూపానుభూతి
మహిమ దెల్ప స్వభానువై మనకుఁ దోఁచె.

# శాకుంతలములోని కాలవిచారణ

= శ్రీ డా॥ సి. కున్హన్‌రాజా =

శాకుంతలనాటకమందలి సన్నివేశములు జరుగుటకెంత కాలము కావలసివచ్చినదో ఈవ్యాసమున వివరించెదను. కాళే, జాక్సన్, విల్సన్ మొదలగువారీ విచారణ చేసినారు. కాని సరియైన కాలములను వారు గుర్తించలేదు. ప్రథమాంకమున అవివాహిత శకుంతల. సప్తమాంకమున సుమారైదేండ్ల కుమారుడు కన్పడుచున్నాడు. ఈ కాలవ్యవధి నేదో యొక విధముగ ముడిపెట్ట వారందరును యత్నించినారు.

అసలు నాటకమున రెండు విధములగు కాలములు కలవు. నాటకమందలి కాలము ప్రథమము. రంగముల మధ్య విశేష కాలవ్యవధి యున్నయెడల ఒక్కొక్క రంగమైనతర్వాత మన కనేక భావములు కలుగును. వాని నేకత్ర సమ్మేళన చేయవలెను. కాని కావ్యమునగాని, నాటకమునగాని వివిధవిషయములు విడదీయబడనంతటి సన్నిహితసంబంధము కలిగియుండవలెను. కావున నీ సన్నిహితత్వమును కనబరచు సందర్భములు నాటకమందలి కాలమును సూచించును.

కథయందలి కాలము ద్వితీయము. వాస్తవముగ కథ జీవితములో నెంత కాలమును ప్రవర్తించుచున్నదో తెలుపు కాల మిది. ఈ కాలద్వైవిధ్యములో నొక కాలము సత్యమని విమర్శించినయెడల కవి జూపిన శిల్పమును గుర్తెరుగనట్లు పలుకుట యగును. ప్రేక్షకులకు, పాఠకులకు నాటకమందలి కాలము Effect of the continuity of action (విశేష కాలవ్యవధి లేకయే నాటకము జరుగుచున్నదను నమ్మకము)ను గనబరచును.

కాళిదాసమహాకవి శాకుంతలములో నీ రెండు విధముల కాలములను మహత్తరశక్తితో నల్లినాడు. ఒకదాని నొకటి పెనవేసికొన్నట్లివి కనబడును. రెండు రకముల కాలము లున్నట్లు మనకు తెలియకుండు రీతిగ తన శిల్పనైపుణ్యమును చూపినాడు. అతి జాగ్రతతో, అనాయాసముగ, ఒకదానిని విడచి యొక టుండనట్లు, ప్రయత్నించినగాని మనకు తెలియనట్లు అల్లుటలో లోకోత్తరమగు ప్రతిభను కన్పరచినాడు.

శాకుంతలనాటక మపరాహ్ణకాలమున ప్రారంభమగుచున్నది. వేటాడుచున్న దుష్యంతుడు లేడిని తరుముకొనివచ్చుచు, అలసిపోయి, ఓర్పును కోలుపోయినాడు. బాణప్రయోగము చేయబోవుచుండ ఋషికుమారులచే వారితుడై, వారిచే నాశ్రమమున కాహ్వానింపబడినాడు. తర్వాత శకుంతల, ప్రియంవద, అనసూయలతో సంభాషణ కలదు. రాజా నిష్క్రమించుసరికి సూర్యాస్తమయ మగుచున్నది.

ప్రాతఃకాలమున జపతపాదివిధులచే తీరికలేకపోవుటచే సమిదాహరణకు ఋషికుమారు లపరాహ్ణమున నేగెదరు. కావుననే "సమిదాహరణాయ ప్రస్థితా వయం" అని ప్రథమాంకమునను, "యావ దిమాన్ వేదిసంస్తరణార్థం దర్భా నృత్విగ్భ్య ఉపాహరామి" అని తృతీయాంకమునను గలదు. మాధ్యాహ్నికవిధులు ముగిసినతర్వాత విశ్రాంతి నందుచున్నవా రగుటచే

దర్భలు వారు అరణ్యమునుంచి సేకరించిన వని గ్రహింపవచ్చును.

"పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మాస్వపీతేషు యా" అను చతుర్థాంకమందలి వాక్యము పాదులకు ప్రాతఃకాలమున నీరుపోయు నాచారమును తెలుపదు. పాదులకు నీరుపోసినతర్వాతనే శకుంతల తన దాహమును తీర్చుకొను నని ఈవాక్యమందలి యభిప్రాయము. సామాన్యముగ నీపిపాస అపరాహ్ణకాలోచితము.

సూర్యు డాకాశమున చాల ఎత్తుగ నుండుటచే, తరుచ్ఛాయలో కూర్చొనెద మని ప్రియంవద యనుచున్నది. ఇదియూ నపరాహ్ణకాలమునకు సంబంధించినదే.

"తురగఖురహత స్తథాహి రేణు
ర్విటపవిషక్తజలార్ద్రవల్కలేషు,
పతతి పరిణతారుణప్రకాశః
శలభసమూహ ఇవాశ్రమద్రుమేషు"

అను శ్లోకమందలి 'పరిణతారుణప్రకాశః' అను పదము "పరిణతః సాయంకాలీనో యోఽరుణః సూర్యః తద్వత్ప్రకాశః స్ఫుటః. తద్వర్ణ ఇత్యర్థః" అని వ్యాఖ్య చేయబడినది. అనగా 'సాయంకాలసూర్యుని కాంతి వంటి కాంతి గలిగిన' అని యర్థము. ఈశబ్దము సాయంకాలమందలి సన్నివేశమం దుపయుక్తమైనచో చాల ఔచిత్యమును గలిగియుండును. పైగా రాజు కూడ వేటయొక్క యవసాన సమయమున ప్రవేశించుచున్నాడు. కావున ప్రథమాంకము అపరాహ్ణమున ప్రారంభమగుచున్నది.

ఈ నాటకమున కాలవిచారణ కుపయోగకరములైన వాక్యములు ప్రథమమున వైఖానసులచే, "ఇదానీమేవ దుహితరం శకుంతలా మతిథిసత్కారాయ నియుజ్య దైవ మస్యాః ప్రతికూలం శమయితుం సోమతీర్థం గతః" అని పల్కబడినవి. కావున సోమతీర్థమునకై కణ్వు డాశ్రమమును వీడినవెంటనే కథ ప్రారంభమగుచున్నది. ఈ విషయమువలన ప్రథమద్వితీయాంకముల మధ్యకాలము గూడ తేలుచున్నది. ద్వితీయాంక ప్రారంభమున విదూషకుడు, "హ్యఃకిలాస్మాస్వవహీనేషు తత్రభవతో మృగయానుసారేణాశ్రమపదం ప్రవిష్టస్య తాపసకన్యకా శకుంతలా మమాధన్యతయా దర్శితా" అని పలుకుచున్నాడు. "నిన్ననే శకుంతల చూడబడిన" దని యభిప్రాయము. కావున నీ రెండంకములకు మధ్య ఒకరాత్రి గడచినది. ద్వితీయాంకము మర్నాటి ఉదయమున జరుగుచున్నది. రాజు వేటకై బయలుదేర బోవుచున్నాడు.

ఈ విధముగ స్పష్టముగ చెప్పబడిన కాలము తర్వాతివాక్యముల బరిశీలింప సందేహింపబడవలసి వచ్చుచున్నది. ద్వితీయాంకాంతమందు "తత్రభవతః కణ్వస్యాసాన్నిధ్యా ద్రక్షాంసి న ఇష్టివిఘ్న ముత్పాదయంతి" అని ఋషికుమారు లనుచున్నారు. రాజు ఆశ్రమమును ప్రవేశించినప్పు డిట్టి ఇష్టి జరుగుచున్నట్లే ప్రసక్తి గానరాదు. రాజు నాహ్వానించిన ఋషుల వాక్యములను పరిశీలింపుడు.

"ఏష ఖలు కణ్వస్య కులపతే రనుమాలినీతీర మాశ్రమో దృశ్యతే. నచే దన్యకార్యాతిపాతః ప్రవిశ్య ప్రతిగృహ్యతా మాతిథేయః సత్కారః. అపిచ-

రమ్యా స్తపోధనానా
ముపగత విఘ్నాః క్రియాః సమవలోక్య
జ్ఞాస్యసి కియద్భుజో మే
రక్షతి మౌర్వీకిణాంక ఇతి"

అని కలదు. ఇట ఇష్టిగాని, రాక్షసులవలని భయముగాని సూచింపబడలేదు. చతుర్థాంకమందలి విష్కంభకమున "అద్య స రాజర్షిః ఇష్టిం పరిసమాప్య" అని అనసూయ చెప్పుచున్నది. వీనివలన ఈ ఇష్టి అతిముఖ్యమైన దని తెలియుచున్నది. ఇది "తత్కతిపయరాత్రం సారథి ద్వితీయేన భవతా సనాథీక్రియతా మాశ్రమ ఇతి" అను వాక్యమువలన చాల రోజుల నాక్రమించినదని తెలియగలదు. కణ్వుడున్నచో నీరాక్షసభయమే లేదని "తత్రభవతః కణ్వస్య మహర్షే రసాన్నిధ్యా ద్రక్షాంసి న ఇష్టివిఘ్న ముత్పాదయంతి" అను వాక్యములు చెప్పుచున్నవి.

కావున నాటకమున ప్రథమద్వితీయాంకముల మధ్యకాలము ఒక రాత్రియే యని స్పష్టముగ చెప్పబడినను, ఈనాటకము చిత్రించిన కథాక్రమములో

నింతకన్న విశేషకాలము జరిగిపోయిన దని యంగీకరింపక తప్పదు.

తృతీయాంకము మధ్యాహ్నకాలమున ప్రారంభ మైనట్లు "క్వనుఖలు సంస్థితే కర్మణి సదస్యైరను జ్ఞాతః ఖిన్న మాత్మానం వినోదయామి" అను వాక్యములు తెలుపుచున్నవి. ద్వితీయతృతీయాంకముల మధ్య కొలదిదినములు గడచిన వని చెప్పుట కనేక వాక్యములు గలవు. "కింనుఖలు మే ప్రియాదర్శనాదృతే శరణ మన్యత్" అను రాజవాక్యమువలన కొలదిరోజులు రాజు శకుంతలను జూచుచు గడపినా డని తెలును. అనగా నాశ్రమమున కొలదిదినములు రాజుండె ననియు, మధ్యాహ్నకాలములలో శకుంతలవద్ద కరిగెడు వాడనియు అర్థము. పైగా—

"తస్య రాజర్షేః ప్రథమదర్శనా దారభ్య"
"అనుదివసం ఖలు పరిహీయసేఽంగైః"
"దృష్టో వివృత్య బహుశోఽప్యనయా సతృష్ణం"
"నిశినిశి భుజన్యస్తాపాంగప్రసారిభి రశ్రుభిః"

"యతః ప్రభృతి మమ దర్శనపథ మాగతః స తపోవనరక్షితా రాజర్షిః"

అను వాక్యములవలన చాలకాలము గడిచి నట్లు తెలియవచ్చుచున్నది. తృతీయాంకమధ్యమున విశేషకాలము గడువ లేదని "కస్యేద ముశీరానులేపనం మృణాలవంతి చ నలినీపత్రాణి", "అహమపి తావ ద్వైతానికం శాంత్యుదక మస్యై గౌతమీహస్తే విసర్జయిష్యామి" అను వాక్యములవలనను, ఉశీరానులేపనము నలినీపత్రములు తర్వాతగూడ కనవచ్చుటవలనను అంకాంతమున గౌతమి శాంత్యుదకమును తీసికొనివచ్చుటవలనను తెలియుచున్నది. కావున నీకాలవ్యవధి ద్వితీయతృతీయాంకముల మధ్య అయియుండవలెను. ద్వితీయాంకముచివర నాశ్రమమునకై రాజు బయలుదేరినాడు. తృతీయాంక మాశ్రమముతో ప్రారంభమగుచున్నది.

కాలవ్యవధి గల దను సూచన లెట్లున్నవో, అదేవిధమున నీరెండంకముల మధ్య విశేషకాలము గతించలేదనియూ, ఒకదానితర్వాత నొకటిగా జరిగిన విషయము లీయంకముల గలవనియూ చెప్పుటకుగూడ నిదర్శనములు కలవు. ద్వితీయాంకముచివర "గచ్ఛతాం పురో భవంతౌ. అహమ ప్యనుపద మాగత ఏవ" అని రాజు వచించి, ఋషికుమారులను బంపినాడు. తృతీయాంక ప్రారంభమున,

"అహో! మహానుభావః పార్థివో దుష్యంతః. యత్ ప్రవిష్టమాత్రఏ వాశ్రమం తత్రభవతి రాజని నిరుపద్రవాణి నః కర్మాణి సంవృత్తాని —

కా కథా బాణసంధానే జ్యాశబ్దేనైవ దూరతః,
హుంకారేణేవ ధనుషః సహి విఘ్నా నపోహతి"

అను రాజశక్తిసామర్థ్యముల పొగడ్త రాజా శ్రమమునకు వచ్చినవెంటనే, ఉపద్రవనిర్మూల మైన వెంటనే జరిగిన ఔచిత్యవంత మగును. ద్వితీయాంక మందలి వాక్యములతో బాటు నీభాగమును చదివి నచో, తృతీయాంకవిషయములు వెంటనే జరిగిన వను భావము కలుగును.

కావున ద్వితీయతృతీయాంకములమధ్య కథలోని కాలము చాలదినముల వ్యవధిని జూపును. నాటకములోని కాలము కొద్దిగంటలుమాత్రమే. కాని వివరము లంత స్పష్టముగ గానరావు. ద్వితీయాంక మందలి విషయములు ప్రాతఃకాలమున జరిగినవి. తదంతమున రాజు ఆశ్రమమునకై బయలుదేరి వాడు. తృతీయాంకసన్నివేశములు అపరాహ్ణకాలమున జరిగినవి. రాజు వచ్చుటతోడనే గలిగిన విపరీతమైన మార్పున కాశ్చర్యపడుచున్న ఋషికుమారుని వాక్యములతో ప్రారంభమగుచున్నది. కావున నీయుదంతములు రెండును వరుసగ కాలవ్యవధి లేకయే జరిగిన వని యెంచవచ్చును.

తృతీయాంకమందలి విషయములు ఇష్టియొక్క ఉపధాదినమున జరిగిన వనుట కాధారము కలదు. రాక్షసుల బాధనుండి కాపాడుటకై దుష్యంతు డాశ్రమమున నున్నాడు. ఈయంకాంతమున శకుంతలా దుష్యంతుల సంవాదము శాంత్యుదకముతో వచ్చిన గౌతమివలన నిలిపివేయబడినది. రాజు లతావలయమందు దాగియుండ శకుంతల సెలవుతీసికొనుచు, "లతావలయ! సంతాపహారక! ఆమంత్రయే త్వాం భూయోఽపి పరి

"భోగాయ" అని దుష్యంతునికి అన్యాపదేశముగ భోగదేశమును సూచించినది. వీరిరువురును కలసికొనుట, వీరి వివాహము ఆస్థలమున నారాత్రియే జరిగియుండవలెను. ఈ రహస్యవివాహమైనతర్వాత దుష్యంతు డాయాశ్రమమున నుండుట యసంభవము. కావున మర్నాడే ఆశ్రమమును వదలినాడు.

చతుర్థాంకమందలి విష్కంభకము తృతీయాంకములో చెప్పబడిన వివాహమైన మర్నాటి యపరాహ్ణమున జరిగినది. అనసూయ "వను సఖ్యాః శకుంతలాయాః సౌభాగ్యదేవ తార్చనీయా" అని చెప్పుచున్నది. ఆశ్రమోపయోగార్థము కావలసిన పూలు సేకరించితి మని ప్రియంవదవాక్యము కలదు. ఆదినము నుండి శకుంతల ఇష్టదేవతార్చన చేయవలె నని అనసూయ పలుకుచున్నది. ఈఅర్చన వివాహదినము మొదలుకొని స్త్రీలు చేయుదురు. కావున వివాహ మాక్రిందటి రాత్రి జరిగిన దని తెలియుచున్నది. దుష్యంతు డానాటి యుదయము తన రాజధాని కేగినాడు.

కావున తృతీయచతుర్థాంకములమధ్య నొక రాత్రి గడచినది. దుర్వాసశాపము రా జింటికి చేరక ముందే జరిగియుండవలెను. లేకున్నయెడల రాజు తన వివాహమును విస్మరించడు. కాన వెంటనే విదూషకునికి చెప్పియుండెడివాడు. కాని విదూషకుని కారీతిగ చెప్పలేదని మనకు తెలియుచున్నది. ఈమానమునకు కారణము దుర్వాసుని శాపము, తత్ఫలముగు విస్మృతి. విదూషకునికి శకుంతలావృత్తాంత మంతయు పరిహాస మే నని—

"న ఖలు సత్యమేవ తాపసకన్యకాయాం మమాభి
లాషః. పశ్య—
క్వ వయం క్వ పరోక్షమన్మథో
మృగశాబైః సమ మేధితో జనః,
పరిహాసవిజల్పితం మయా
పరమార్థేన నగృహ్యతాం వచః."

అని శ్లేషతో ద్వితీయాంకమున చెప్పినాడు. దీనిచే షష్ఠాంకమున విదూషకుడు "కింతు సర్వం కథయి త్వావసానే పున స్త్వయా పరిహాస విజల్ప ఏవ న భూతార్థ ఇత్యాఖ్యాతం. మయాపి మృత్పిండబుద్ధినా తథైవ గృహీతం" అని బలపరచినాడు. కావున విదూషకుడుగూడ రాజు తిరిగిరాగనే శకుంతలావృత్తాంతమును పృచ్ఛింపలేదు. కాబట్టి రాజు తన ప్రాసాదమును చేరకమునుపే దుర్వాసశాపము సంభవించినది. అనగా రాజు ఆశ్రమమును వదలివేయగనే ఈ శాపము వచ్చినది. అనగా చతుర్థాంకమందలి విష్కంభకము తృతీయాంకమైన మర్నాడు జరిగినది.

ఇదియునుగాక అనసూయ "అద్య స రాజర్షి రిష్టిం పరిసమాప్య ఋషిభి ర్విసర్జితః ఆత్మనో నగరం ప్రవిశ్య అంతఃపురసమాగత ఇతోగతం వృత్తాంతం స్మరతి వా నవా" అని పలుకుచున్నది. మూడురోజు లలో, రాజపురుషు లాశ్రమమునకు వచ్చియుండవలసినది. ఇది రాజు తన వాగ్దానమును భంగము చేసిన తర్వాత పలికిన మాటలు కావు. రాజు పెట్టిన గడువు పైపోయినతర్వాత వాగ్దానభంగము కల్గగనే అనసూయ, "తేన రాజ్ఞా శకుంతలాయా మనార్య మాచరితం...ప్రతిబుద్ధాపి కిం కరిష్యామి ? న మే ఉచితే ష్వపి నిజకరణీయేషు హస్తపాదం ప్రసరతి. కామ ఇదానీం సకామో భవతు యేన అసత్యసంధే జనే శుద్ధహృదయా సఖీ పదం కారితా" అని ధోరణి మార్చినది.

ఏతావతా మనకు తేలున దేమన: తృతీయాంక విషయము లపరాహ్ణమున జరిగినవి. వివాహ మానాటి రాత్రి జరిగినది. మర్నాడు ప్రొద్దునన్నే రాజు తన ప్రాసాదమున కేగినాడు. చతుర్థాంకవిష్కంభమందలి సన్నివేశ మా అపరాహ్ణమున జరిగినది. కావున నాటకమందలి కాలము ననుసరించి తృతీయాంకచతుర్థాంకవిష్కంభకములమధ్య నొక రాత్రి గడచినది.

కథయందలి కాలము ననుసరించి వీటికి గల వ్యవధి ఇంతకన్న నెక్కువకాల మనుటకు సూచనలు కలవు. శకుంతలాదుష్యంతు లాశ్రమమం దెంకి స్వేచ్ఛగ సంచరించెడువారో పంచమాంకమున గలరు. తృతీయాంకమందుమాత్రము వారు కలసికొనువారేగాని స్వేచ్ఛగ మాట్లాడినా రని లేదు. పంచమాంకమున,

"అనస్యేకస్మిన్ దివసే నవమాలికామండపే నలినీపత్రభాజనగత ముదకం తవ హస్తే సన్నిహిత మాసీత్...తత్క్షణే స మే పుత్రకృతకో దీర్ఘాపాంగో నామ మృగపోతక ఉపస్థితః. త్వయాయం తావత్ ప్రథమం పిబ త్వి త్యనుకంపినోపచ్ఛందిత ఉదకేన. నపున స్తేఽ పరిచయా ద్ధస్తాభ్యాశ ముపగతః. పశ్చా త్తస్మిన్నేవ మయా గృహీతే సలిలే అనేన కృతః ప్రణయః. తదా త్వ మిత్థం ప్రహసితోఽసి. 'సర్వః సగంధేషు విశ్వసితి. ద్వావ ప్యత్రారణ్యకా' ఇతి"

అని శకుంతలావాక్యములు కలవు. ఆరవ యంకమున దుష్యంతుడు—

"అక్లిష్టబాలతరుపల్లవలోభనీయం
పీతం మయా సదయ మేవ రతోత్సవేషు,
బింబాధరం స్పృశసిచే ద్భ్రమర ప్రియాయా
స్త్వాం కారయామి కమలోదర బంధనస్థం"

అనుచున్నాడు. ఈసన్నివేశములు తృతీయాంక విషయములు జరిగినతర్వాతనే తటస్థించును. కథలోని కాలము ననుసరించి, ఆ యపరాహ్ణమందలి ప్రథమసమావేశ మైనతర్వాత శకుంతలాదుష్యంతు లాశ్రమమున తరచుగ కలసికొనుచుండియుండవలెను. అనసూయాప్రియంవదలకు దక్క తదితరులకు వివాహము రహస్యవిషయ మై యుండవలెను. కొంతకాల మైనతర్వాత రాజు వెడలిపోయెను. ఇది కథలోని కాలానుగుణము.

చతుర్థాంకమందలి విష్కంభకమునకు, మిగిలిన చతుర్థాంకమునకు మధ్య చాలకాలము గడచె ననుటకు సూచనలు కలవు. సోమతీర్థమునుండి కణ్వుడు తిరిగి వచ్చి, పుత్రికావివాహమును గ్రహించి, రాజువద్ద కామెను పంపుటకు సన్నాహములు చేయుచున్నాడు. పంచమాంకమున శకుంతలా, గౌతమీ, శార్ఙ్గరవాదులు రాజభవనమును సమీపించినారు. ఈ ప్రయాణమునకు రెండు దినములకన్న నెక్కువ యవసరము. శకుంతలను వీడిపోవునప్పుడు రాజు తన పరివారమును మూడు రోజులలో పంపెదనని,

"ఏకైక మత్ర దివసే దివసే మదీయం
నామాక్షరం గణయ గచ్ఛసి యావదంతం,
తావ త్ప్రియే మదవరోధగృహప్రవేశం
నేతా జన స్తవ సమీప ముపైష్యతీతి"

అని పలికినాడు. అనగా రాజు తన ప్రాసాదమును జేరి, పరివారమును పంపుటకు మూడురోజులు చాలును. మరియు, ద్వితీయాంకముదివర రాజమాత దగ్గరనుండి వచ్చిన వార్తావహుడు అప్పటినుండి నాల్గవ దివసమున రాజగృహమున జరుగబోవు మంగళకార్యమునకు దుష్యంతుడు రావలెనని చెప్పుచున్నాడు. అనగా ఆశ్రమమునకు, రాజభవనమునకు గల దూరము తక్కువని తేలుచున్నది. కావున శకుంతలాదులు రాజభవనమును రెండుమూడురోజులలో చేరినా రని చెప్పవచ్చును. ఆశ్రమమును వదలిపెట్టిననాటికి మూడవ దినమందలి యపరాహ్ణమున నిది జరిగియుండవచ్చును.

రాజభవనమును సమీపించునప్పటికి శకుంతల గర్భము ధరించిన దను విషయము తేలికగ గుర్తించ తగినట్లు వృద్ధిపొందినది. పంచమాంకమున "తత్కథ మిమా మభివ్యక్తసత్త్వ లక్షణాం ప్రత్యాత్మానం క్షేత్రిణ మాశంకమానః ప్రతిపత్స్యే" అని రాజామెను చూచి యనినాడు. కావున చతుర్థాంకవిష్కంభకమునుండి పంచమాంకప్రారంభమునాటికి సుమారైదు నెలల కాలము జరిగియుండవలెను. చతుర్థాంకమునకు, పంచమాంకమునకు మధ్య గలకాలము రెండుమూడు దినము లని నిర్ధారణచేసినాము. కావున నీఅయిదు నెలల వ్యవధి చతుర్థాంకవిష్కంభకమునకు, మిగిలిన చతుర్థాంకమునకు మధ్య గడచినకాల మైయుండవలెను.

"పూర్వమపి న త్వయా సంకీర్తితం కదాచి త్తత్రభవత్యా నామ" అను దుష్యంతుని వాక్యము రాజు ప్రాసాదమున కేతెంచిననాటికి, శకుంతల యేతెంచిననాటికి చాలకాలము గడచిన దని తెలుపుచున్నది. ఈవ్యవధి చతుర్థాంకవిష్కంభకమునకు, మిగిలిన చతుర్థాంకమునకు గల మధ్యకాల మైయుండవలెను.

ఇంత వ్యవధి నంగీకరించిన ననేకకష్టములు వచ్చుచున్నవి. శకుంతలావివాహముగాని, గర్భధారణముగాని గౌతమికి తెలియదని నిశ్చయముగ జెప్పవచ్చును. వివాహయోగ్యయైన శకుంతలవంటి కన్యక ఆశ్రమములో గౌతమివంటి వృద్ధురాలి కంటి

రొదుట నివసించుచు, గర్భిణియని గుర్తింపబడకుండుట యసంభవము. ఈ అయిదు నెలలలోను శకుంతలాజీవితమున గల మార్పును గౌతమి తెలిసికొనకపోవుట యసంభవము. అనసూయా ప్రియంవదలకీ వివాహము, గర్భము తెలియును. వారీ విషయమును గౌతమికి చెప్పి ఏదేని యొక యుపాయమును సాధించలేదని నమ్మగలమా? వారిద్దరును మూడు నాలుగు రోజుల వరకును దుష్యంతుని పరివారముకొరకు ఎదురుచూచుచుండిరి. రాజెప్పుడు వాగ్దానభంగము చేసినాడని యెంచినారో అప్పుడు,

"అథవా దుర్వాసశ్శాప ఏవ వికారయతి. అన్యథా కథం స రాజర్షి రీదృశాని మంత్రయిత్వైతావతః కాలస్య లేఖామాత్రమపి న విసృజతి. తదితో౽భిజ్ఞాన మంగుళీయకం తస్య విసృజావః. దుఃఖశీలే తపస్విజనే కో౽భ్యర్థ్యతాం. నను సఖీగామీ దోష ఇతి వ్యవసితాపి న పారయామి ప్రవాసప్రతినివృత్తస్య తాతకాశ్యపస్య దుష్యంతపరిణీతా మాపన్నసత్త్వాం శకుంతలాం నివేదయితుం."

అని అనసూయ ప్రలపించినది. కణ్వుడు వచ్చువరకు వారీవిధముగ నైదు నెలలు గడిపిరనుట యసంభవము. ఈ పై వాక్యములలో వారు గౌతమికీవృత్తాంతము నివేదింప దలచినట్లు సూచన గన్పడుచున్నది. రాజు పెట్టిన గడువు దాటినతర్వాత కొద్ది దినములు మాత్రము వారు వేచినారని చెప్పవచ్చును. తర్వాత కణ్వుడాశ్రమమునకు వచ్చుట, వారు చెప్పనక్కరలేకయే సర్వము ఋషికి విదితమగుట కలదు.

ఇదియునుగాక నీవిష్కంభకమునకును, మిగిలిన యంకమునకును గల వ్యవధి కొద్దిదినములే యనుట కింకొక సూచన గలదు. శకుంతల నత్తవారింటికి పంపుటకు కణ్వుడు సర్వమును తయారుచేసినాడని చతుర్థాంకప్రారంభమున ప్రియంవద అనసూయతో పలుక, "తేన హ్యేతస్మిం చూతశాఖావలంబితే నారికేర సముద్గకే ఏతన్నిమిత్తమేవ కాలాంతరక్షమా నిక్షిప్తా మయా కేసరమాలికా" అని యనసూయ చెప్పినది. ఈమాలిక ననసూయ ఎప్పుడు చేసినది? విష్కంభకమందలి సన్నివేశము జరిగినమర్నాడో, తర్వాతి రోజో అయియుండవలెను. విష్కంభకసమయమునకు మూడవనాటికి రాజపురుషులు వచ్చెదరని వారు వేచియున్నారు. మగని దగ్గరకు పోవుచున్న శకుంతలకీ మంగళముహూర్తమున అర్పింపదలచిన దామాలికయే. ఎంత జాగ్రతగ నుంచినను పుష్పమాలిక వాడిపోక అయిదు నెల లుండగలదా? కావున 'కాలాంతరక్షమా' యన కొలది దినములే యని చెప్పికొనవలెను. కాబట్టి విష్కంభకమునకు, మిగిలిన అంకమునకు మధ్య కొద్దిరోజులుమాత్రమే గడచినవని చెప్పికొనవలెను. ఇది నాటకమందలి కాలము. కథయందలి కాలము అయిదు నెలలు. చతుర్థ పంచమాంకముల మధ్య నీరెండు కాలములును సుమారు రెండు దినముల వ్యవధి నిచ్చుచున్నవి.

సప్తమాంకమున నైదేండ్ల భరతుడు గన్పడుచున్నాడు. ఈదీర్ఘకాలము పంచమషష్ఠాంకముల మధ్య నుండవలెను. షష్ఠసప్తమాంకముల మధ్య వ్యవధి యొకదినము; కథయందలి కాలము ననుసరించి కొలది దినములు.

కాని ఇచటగూడ నొక చిక్కు కలదు. కొన్ని విషయములను సమాధానపరచుటకు పంచమాంకవిషయము లైన వెంటనే రెండుమూడుదినము లైనతర్వాత షష్ఠాంకవిషయములు జరిగినవని యెంచవలసియున్నది.

దుష్యంతుని వాక్యముల నన్నిటిని పరిశీలించినచో ఏదోవిషయమును విస్మరించిన రీతి రాజు కనపడుచున్నాడు. పంచమాంకప్రారంభమున రాజు రంగస్థలముమీదికి వచ్చినతర్వాత-

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి య త్సుఖితో౽పి జంతుః,
త చ్చేతసా స్మరతి నూన మబోధపూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని"

అని యతని పలుకులు కలవు. తర్వాత —

"ఇద ముపనత మేవం రూప మక్లిష్టకాంతి
ప్రథమపరిగృహీతం స్యాన్న వే త్యవ్యవస్యన్,
భ్రమర ఇవ విభాతే కుంద మంతస్తుషారం
న చ ఖలు పరిభోక్తుం నాపి శక్నోమి హాతుం"

అని యనుచున్నాడు. తదనంతరము "సందిగ్ధబుద్ధిం మాం కుర్వ న్నకైతవ ఇవాస్యాః కోపో లక్ష్యతే" అని గలదు. అంకాంతమున

"కామం ప్రత్యాదిష్టాం
స్మరామి నపరిగ్రహం మునే స్తనయాం,
బలవత్తు దూయమానం
ప్రత్యాయయతీవ మే హృదయం"

అను వాక్యములు గలవు. ఏదో విషయమును విస్మరించినట్లు, ఎచటనో తప్పిద మొనరించినట్లు, తత్ఫలితముగ మనోవ్యాకులత నందినట్లు రాజున కనుభూతి గలదని ఈవాక్యములవలన జెలియుచున్నది.

కణ్వుని యాశ్రమము తన భవనమున కతిసమీపమున గలదు. విస్పష్టముగ రాజుచే వివాహ మాడబడినది, స్వీకరించు మని పంపినవాడు కులగురువు. మేనక శకుంతలయొక్క తల్లి. ఈసందిగ్ధావస్థనుండి కాపాడుటకు సానుమతి యను అప్సరస సమీపమున గలదు. ఐదారేండ్లు మౌనవ్రతము నవలంబించగల వయోవృద్ధుడు కాడు కణ్వుడు. తన జీవితమువలె శకుంతలయందు వాత్సల్యము గలవాడనుటచే సోమతీర్థమునకు గూడ నరిగినాడు. రాజవిస్మృతికి కారణము నెరిగిన అనసూయాప్రియంవద లంత దీర్ఘకాల మూరకుండెడువారు కారు. శకుంతలను రక్షించుచున్న మారీచుడు తనకు చేతనైన సహాయము చేయగలవాడు. ఇట్టి సందర్భములో నీరైదేండ్ల మౌనవ్రత మేల కలిగినది? వీరు తమకు చేతనైనది చేయుటకు తగిన యవసరము రాలేదని చెప్పికొనిననే సరియైన సమాధానము కుదురును. ఏ విషయమైన ఆలోచింపక పూర్వమే సర్వము తెలిసిపోయినది. ఉంగరము దొరకినది. రాజునకు వివాహవిషయము జ్ఞప్తికి వచ్చినది. శకుంతలా దుష్యంతుల పునస్సమాగమము కుదిరినది.

శార్ఙ్గరవాదులు తిరిగి యాశ్రమమునుచేరి, కణ్వునకీ వృత్తాంతము నివేదించుసరికి రెండు దినములైయుండవలెను. ఆ వేళకే పునస్సమాగమముకూడ నైనది. కణ్వునకీ వృత్తాంతమును పంపగోరి, మారీచాశ్రమమున దుష్యంతుడు తహతహపడుచుండెను. దివ్యదృష్టిచే నీవరకే కణ్వు డీ విషయమును తెలిసికొనెనని మారీచుడు చెప్పినాడు.

యోగదృష్టి యుక్త, యుంజాన భేదమున ద్వివిధము. కణ్వుడు యుంజానుడు. సామాన్యదృష్టి కతీతమైన విషయములను గ్రహింప కొంత ప్రయత్నము చేయవలెను. శకుంతలనుగూర్చి యాలోచించుచుండినచో మారీచాశ్రమమందలి విషయము లతనికి బోధపడగలవు. శార్ఙ్గరవునిద్వారా సంగతి తెలిసికొని కణ్వు డాలోచించుచుండెననియు, అప్పుడు శకుంతలా దుష్యంతుల పునస్సమాగమము నెరిగినాడనియు తెలియగలదు. "తపఃప్రభావాత్ ప్రత్యక్షమేవ సర్వం తత్రభవతః" అని మారీచుని వాక్యము.

ఇదియునుగాక షష్ఠాంకసన్నివేశములు పంచమాంకవిషయములు జరిగినవెంటనే జరిగిన వనుటకీయారవయంకమున ననేకసూచనలు కలవు. సానుమతి ప్రవేశించునప్పటికి తతఃపూర్వమామె రాజప్రాసాదమునకు వచ్చుచుండెనను సూచనలు లేవు. రాజును చూచి, శకుంతలాత్యాగానంతరము రాజునకు గలిగిన యవస్థ నామె దీర్ఘకాలమువరకు తెలిసికొనలేదనుట యసంభవము. ఆరేండ్లు తరచుగా రాజును ఆమె చూచుచున్నయెడల "సాంప్రత మస్య రాజర్షే రుదంతం ప్రత్యక్షీకరిష్యామి" అని ఈవిధముగ పలుకదు. ఆమె తరచు చూచుచున్నట్లైన రాజుయొక్క యవస్థ నెరిగియుండెడిది. శకుంతల మారీచాశ్రమమున గలదని యామెకు తెలియును. రాజు శకుంతలను గూర్చియు, శకుంతలకు తాను జేసిన యపరాధమును గూర్చియు నింతకాలము చింతించుచున్నట్లామె కనుగొనిన, ఏదోవిధమున వారిరువురి నొకచో జేర్చెడిది. ఉంగరము రాజునకు దొరకిన దనిమాత్ర మామె కింకను తెలియదు. దీనినిబట్టి షష్ఠాంకము తదంకమందలి ప్రవేశక మైనవెంటనే జరిగిన విషయములను దెల్పుచున్న దని తేలుచున్నది. శకుంతల కేమాత్రమైన సహాయము చేయ వీలున్నదో, లేదో తెలిసికొనుటకే ఆమె రాజుదగ్గరకు వచ్చినది. "కిమత్రభవతో ల్లోకః కర్ణపథం నాయాతం శకుంతలాప్రత్యాదేశకాలీనం"

అను కంచుకీవాక్యములును, "శ్రుతం రాష్ట్రియ ముఖా ద్యావ దంగుళీయక దర్శనం" అను చేటీవాక్యములును శకుంతలాపరిత్యాగవిషయము మొన్న ఈమధ్య జరిగినసంగతి యని తెల్పుచున్నవి. కాని ఐదారేండ్లనాటిమాట యనిమాత్రము కాదు. "న ఖలు మాతాపితరౌ భర్తృవియోగదుఃఖితాం దుహితరం చిరం ద్రష్టుం పారయతః" అను షష్ఠాంకమందలి విదూషకుని వాక్యములు గూడ నీ యంకమందలి విషయములు పరిత్యాగ మైనవెంటనే జరిగిన వని సూచించుచున్నవి. కావున మారీచాశ్రమమున జరిగిన శకుంతలా దుష్యంతుల సమావేశము పరిత్యాగమైన రెండుమూడు దినముల తర్వాతి దని యనుటకు సూచన లనేకము గనపడుచున్నవి. అప్పు డీ విషయమున నందరు నవలంబించిన మౌనమును సమాధానపరచగలము. వా రేమైన చేయుటకు గల వ్యవధి లేనేలేదు. శకుంతలను త్యజించి రాజు వ్యాకులమనస్కు డయ్యెను. మర్నాటి యుదయమున ఉంగరము దొరకినది. ఆ యపరాహ్ణమున నింద్రునిచే నాహ్వానింపబడినాడు. ఆ తర్వాతి రోజున మారీచాశ్రమమున పునస్సమాగమమైనది. ఇది నాటకమందలి కాలము.

ఇక రెండవవిధమగు కాలమును పరిశీలింతము. శకుంతలాకుమారుడు ఐదేండ్లవాడై సప్తమాంకమున గన్పడుటయే కాక దీర్ఘకాలవ్యవధిని సూచించు ననేక విషయము లున్నవి. "తత్ర మే చిత్రఫలకగతాం స్వహస్తలిఖితాం తత్రభవత్యాః శకుంతలాయాః ప్రతికృతి మానయేతి" అని విదూషకు డనుచున్నాడు. అంగుళీయకము దొరకినతర్వాత ఈపటము చిత్రింపబడియుండవలెను. అనగా నీయంకమందలి ప్రవేశకము తర్వాత చాలకాలము గడచిన దన్నమాట. మరియు "సాక్షా త్ప్రియా ముపగతా మపహాయ పూర్వం" అను రాజవాక్యములుగూడ నీయభిప్రాయమును ధ్రువపరచుచున్నవి.

నాటకమందలి కాలము ననుసరించి పంచమాంకమునకు, షష్ఠాంకప్రవేశకమునకు మధ్య నొకరాత్రి, తత్ప్రవేశకమునకు, మిగిలిన యంకమునకు మధ్య కొలది గంటలు గడచిన వని చెప్పవచ్చును. కాని కథయందలి కాలము ననుసరించి పంచమాంకమునకు, షష్ఠాంకప్రవేశకమునకు మధ్య చాలసంవత్సరములు, ప్రవేశకమునకు, మిగిలిన యంకమునకు మధ్య కొలది దినములును గడచిన వనవలసివచ్చుచున్నది.

"చింతాజాగరణప్రతాంతనయన
స్తేజోగుణా దాత్మనః
సంస్కారోల్లిఖితో మహామణిరివ
క్షీణోఽపి నాలక్ష్యతే"

అను కంచుకివాక్యములలో దుష్యంతుడు చింతాజాగరణము ననుభవించుచున్నట్లు కలదు. సప్తమాంకమున రాజు శకుంతలను చూడగనే "మమ దీర్ఘం విరహవ్రతం బిభర్తి" అనినాడు. శకుంతలకూడ ప్రప్రథమమున దుష్యంతుని గుర్తించజాలకపోయి, "నఖల్వార్యపుత్ర ఇవ" అనినది. ఇట్టి పరిస్థితి వచ్చుటకు కొన్ని సంవత్సరములు గడచియుండవలెను. చింతాజాగరము అంగుళీయకదర్శన మైనతర్వాత గలదు. "యదైవ ఖలు స్వాంగుళీయకదర్శనా దనుస్మృతం దేవేన సత్య మూఢపూర్వా మే తత్రభవతీ రహసి శకుంతలా మోహాత్ ప్రత్యాదిష్టేతి-తదాప్రభృతి..." అను కంచుకీవాక్యము లిందుల కుపోద్బలకములు.

సప్తమాంకమందలి విషయములు షష్ఠాంకసన్నివేశములైన మర్నాడు జరిగినవని "పూర్వేద్యుర్దివ మధిరోహతా మయా న లక్షితః స్వర్గమార్గః" అను రాజవాక్యముచే తెలియుచున్నది. కాని రాజు ఇంద్రుని వద్ద కేగి, అసురుల నోడించి, భూమికొక రోజులోనే వచ్చుట యసంభవము. కావున నాటకమందలి కాలమునకు, కథయందలి కాలమునకు నిటగూడ భేదము కలదు.

కావున సూక్ష్మముగ పరిశీలింపగా, శాకుంతల నాటకములోని రెండువిధముల కాలముల నీక్రిందవిధముగా సూచింపవచ్చును:

| | నాటకమందలి కాలము | కథయందలి కాలము |
|---|---|---|
| ౧,౨ అంకములమధ్య | ఒకరోజు | కొలదిదినములు |
| ౨,౩ అంకములమధ్య | కొలదిగంటలు | కొలదిదినములు |
| ౩-వ అంకము, ౪-వ | | |

| | | |
|---|---|---|
| అంక విష్కంభము నకు మధ్య | ఒకరోజు | కొలదిదినములు |
| ౪-వ అంకవిష్కంభమునకు మిగిలిన యంకమునకు మధ్య | కొలదిదినములు | ఐదు నెలలు |
| ౫,౬ అంకముల మధ్య | రెండుదినములు | రెండుదినములు |
| ౬ వ అంకమునకు, ౭ వ అంక ప్రవేశకము నకు మధ్య. | ఒకరోజు | ఐదుసంవత్సరములు |
| ౭ వ అంక ప్రవేశకమునకు మిగిలిన యంకమునకు మధ్య. | కొలదిగంటలు | కొలదిదినములు |
| ౬,౭ అంకముల మధ్య | ఒకదినము | కొలదిదినములు |

ఈ రెండురకముల కాలము లున్నట్లు స్థూల దృష్ట్యా తెలియబడనట్లు కాళిదా సీ నాటకమున తన శిల్పమును వ్యక్తీకరించినాడు. విశేష కాలవ్యవధి లేకయే నాటకము జరుగుచున్న దను నమ్మకమును (Effect of the continuity of action) ప్రేక్షకులకు, పాఠకులకు కలుగ జేయుటయే నాటకమందలి కాలము వలన కలుగు ప్రయోజనము. ఒకదానిపై నొకటి త్వర త్వరగా సన్నివేశములు వచ్చుచున్నట్లు కనబడుటచే కాలవ్యవధి సాధారణముగ తెలియబడదు. భవభూతికూడ ఉత్తరరామచరితలో నీకాలములను చాలనేర్పుతో నుపయోగించినాడు.

[అనువాదము : పో. సు. శా]



# సుమతి శతకము-
# కర్తృత్వవిచారము

= శ్రీ బులుసు వేంకటేశ్వర్లు =

❀

ఆంధ్రదేశమునం దాబాలగోపాలమున కామోద సంధాయకమై చిరకాలమునుండి స్థిరకీర్తి నంది ప్రస్తుతముసైతము మిక్కిలి వ్యాప్తిలో నున్న సుమతిశతకమును విరచించిన విజ్ఞుఁ డెవఁ డన్న విషయ మింతవఱకును నిర్ధారణము కాలేదు. ఒక్క సుమతి శతకమే కాదు: ఉత్తమగ్రంథము లెన్నియో కర్తృనామరహితములైన వున్నవి. దీనికిఁ గారణ మానాఁటి యాంధ్రకవిపుంగవులు స్వలాభాపేక్ష లేక నామ ప్రకటనలాలసతకు లోనుగాక తాము చేర్చిన విషయములఁ బ్రజోపయోగకరముగాఁ జేయసమకట్టుటయుఁ గావచ్చును. లేక అనంత మగు కాలవాహినిలో నఖండముగాక ప్రయాణముచేయుచు నేఁటికి మన దురదృష్టవశమున నాయాభాగములు నష్టములై కవినామాదులు మనకు లభింపకపోవుటయుఁ గలదు. అట్టివానిగురించి ప్రబలాధారములను నిష్పాక్షికదృష్టితో సంపాదించి యాయా కవికాలకర్తృత్వములను నిర్ణయింపఁబూనుట సద్విమర్శకుల విధి.

ఇంతవఱకును సుమతిశతకకర్తృత్వమునుగూర్చి మూఁడువాదము లున్నవి. సుమతి యను జైనముని కర్తృక మని యొక వాదము; వేములవాడ భీమకవి కృతమని యింకొక వాదము; బద్దెనకృత మని మఱియొక వాదమును. వీనివిషయమై కొంత పరిశీలనము చేసి వివిధ విషయములలో ప్రబలసందేహములను వెలిబుచ్చి యే నిర్ణయమునకును రాలేక శతకకవిచరిత్రకారులు కీ. శే. వంగూరి సుబ్బారావుగారు భావివిమర్శకులకు విడిచియుంచినారు. వీరి మతమున నిలచినది మూఁడవ వాద మొక్కటియే. కాని తుదకు దాని విషయమునను గొన్ని సందేహములు వారికే కలుగఁగా నింతవఱకీవిషయనిర్ణయము జరుగలేదు. ఇచ్చటఁ గ్రమముగా నీమూఁడు వాదములను బరిశీలించి మూఁడును నిరాధారములే యని తెలుపుటే యీవ్యాసోద్దేశము.

ఇందలి మొదటివాదము మిగుల పేలవమైనది. ఐనను దీనికి రెం డాధారములుకలవు. కవిచౌడప్పవేమనలవలె సుమతి యను జైనముని ఆత్మసంబోధకముగా నీశతకమును వ్రాసినాఁ డనున దొకటి. న్యాయముగ నాశతకమున—

" శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు నౌరా యనఁగా,
ధారాళమైన నీతులు
నోరూరఁగఁ జవులు పుట్ట నుడివెద సుమతీ."

అను శతకారంభపద్యము లేదని చూపిన తాళపత్రప్రతి యొకటియు నీవాదమున కాధారము.

కాని, సుమతి యను జైనమునియే వ్రాసియున్నచో విప్రులఁ బూజ్యార్థమున వాడియుండఁడు. మఱియు శతకారంభమునఁ జైపద్యము లేని ప్రతి యొక్కటి కానవచ్చుచున్నను మిగిలిన ప్రతు లన్నిట నీ పద్య ముండుటచేతను, జైనమతస్థుఁడు శ్రీరామునిఁ బూజించు టసంభవమగుటచేతను, ఇంతకు నీ వాదమును లేవఁదీసిన కీ. శే. వంగూరి సుబ్బారావు

గారే దీని నుపసంహరించుకొనుటచేతను సుమతిశతకము జైనమునికృతము కాదని తేలినది.

ఇఁక వేములవాడ భీమకవికృత మనుట కింతకంటెను మూలాధారములు రెండుమూఁడు గలవు. అందు —

"కాదన్నవాఁడె కరణము,
వాదడఁచినవాఁడె పేడి, వసుధేశుకడన్
లే దన్నవాఁడె చవవరి,
గాథలు పెక్కాడువాఁడె కావ్యుఁడు సుమతీ."

అను పద్య మొకటి 'దశాలకుఁ బ్రాసమైత్రి' కుదాహరణముగా నొక లక్షణకర్త గ్రహించినట్లు ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక (౬ సం. ౪౫౬ పుట) లోఁ గలదు. కాని, ఈ పద్యము ప్రస్తుతసుమతిశతకమునందే ప్రతియందును గానరాని కారణమున నింకొక సుమతిశతక మేదే నున్నదా యని సందేహమునకుఁ గారణమైనది. దీనికితోడు ప్రాచ్య లిఖిత పుస్తక భాండారములో ౧౧-౪-౨౩ తాళపత్రప్రతిలో :

"శ్రీకరముగ భీమన మును
లోకమునకుఁ బొగడఁగా విలోకించి మదిన్ (?)
బ్రాకటముగ సుమతికి మతి
చేకూడఁగ సుమతినీతి చెప్పఁదొడంగెన్."

అను నొక శతకారంభపద్య మాతృక లభించినది. దీనిని బురస్కరించుకొని భీమన సుమతిశతకము వ్రాసినాఁడని వాదము. ఇంతకు మించిన ప్రబలాధార మింకొకటి కలదు: సర్వలక్షణసార సంగ్రహములో ఏఱుంట - అకార మనుటకు :

"ఏఱుకుమీ కసుగాయలు
దూఱుకుమీ బంధుజనుల దోసముసుమ్మీ,
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ.
—భీమకవిసుమతిశతకము." అని యున్నది.

ఈ పద్యము ప్రస్తుతసుమతిశతకమందును గలదు.

ఈవిషయముల ననుసరించి చూడఁగా నీవాదము కొంత ప్రబలముగానే కానవచ్చినది. కాని 'కాదన్నవాఁడె కరణ' మను పద్య మేప్రతియందును గానరాకపోవుటచేతను, "శ్రీకరముగ భీమన మును" అను పద్యభావము సందిగ్ధముగ నుండి యీ 'సుమతినీతి' యాతని గ్రంథనామమో, లేక అంతకు పూర్వమే విరచింపఁబడిన మఱియొక గ్రంథసారాంశమో తెలియరాకుండుటచేతను, కవిచరిత్రకారులైన వీరేశలింగముపంతులుగారు కాని, శ్రీరామమూర్తిపంతులుగారు కాని తమ భీమకవిచరిత్రములలో నీతఁడు సుమతిశతకము వ్రాసిన ట్లెచ్చటను దెలుపకపోవుటచేతను, భీమకవిదని వాడుకలో నున్న కవిజనాశ్రయమునసైత మీవిషయ మేకోశమునను లేనికారణమునను సుమతిశతకము భీమనకృతము కా దనవచ్చును. కాని, మూఁడవవిషయమున "ఏఱుకుమీ కసుగాయల" పద్యము ప్రస్తుతసుమతిశతకమున నుండుట యొక్క ప్రతిబంధక మగును. ఈవిషయమున ప్రస్తుతసుమతిశతకమునకుఁ బ్రతిగా మఱియొక సుమతిశతక ముండియుండవలె ననుటకుఁ గొన్ని ప్రమాణములు లభించినవి. దీనివలనఁ బ్రకృతశతకమును భీమకవి వ్రాయలేదని ఋజువైనను, వేములవాడభీమకవిగాని, మఱియొక భీమకవిగాని యేయొకఁడుకాని మఱియొక సుమతిశతకమును విరచించె ననియు, నది ప్రస్తుతము శిథిలమై యందలి పద్యములు కొన్ని చెదరి సందర్భరహితముగా నీసుమతిశతకమునఁ జొనుపఁబడిన వనియు నాయభిప్రాయము.

ఆంధ్రసాహిత్యపరిషత్తులో సుమతిశతక తాళపత్రప్రతులు పరిశీలించు సందర్భమున నొక ప్రతిపై "సుమతిశతకము—చంద్రాభొట్ల జోగయ్యశాస్త్రిగారి కుమారుఁడు కృష్ణమూర్తి యీఅప్పన్న శాస్త్రుల్లదస్తూరీ." అను నక్షరములతో వ్రాయఁబడిన ప్రతియొకటి కలదు. అందు ప్రస్తుతసుమతిశతకములోఁ గానరాని పద్యము లెన్నియో కలవు. ఆప్రతి యసంపూర్ణముగా నుండుటే కాక చాలమట్టునకు శిథిలావస్థలో నున్నది. అందు ప్రధానముగాఁ గొన్ని పద్యము లిట నుల్లేఖించుచున్నాను. ఈపద్యములు ప్రస్తుతసుమతిశతకమున లేకపోవుటేకాక ప్రస్తుతశతకమునఁ గల పద్యములు కొన్ని అందు లేవు. ఇందు నందు గల సాదృశ్యపద్యములైనను పాఠభేదము లెక్కువగా నున్నవి.

అధికపాఠములు కొన్ని క్రమముగా నిచ్చుచున్నాము.

"అనఘా వినుముద్యోగికి
ధనముండెను నీతియుండె......
....................
...................."

మిగిలినది శిథిలమైనది.

"అలుకసెడ కొన్కి(?)చల్లుట
తను బల్లము కాదు మిగులఁ గూర్చుటకొఱకే
వలయునెడ నర్థమిచ్చుట
వెలయఁగ నభివృద్ధికొఱకె వినరా సుమతీ."

"ఎన్నఁడు గుడువక నధికతఁ
దన్నిమరి కూర్చు ధనము ధరలో నెపుడున్
అన్నలకును రాజులకును
గన్నములకుఁ బోవుచుండుఁ గదరా సుమతీ."

"పొరుగింటి క్రేఁగ నిచ్చుట
పరపతిఁ బతిఁ గూడి చనిన పతిఁ బుట్టింటం
జిరకాల ముండనిచ్చుట
పురుషుఁడు తన పతిని గోలుపోవుటె సుమతీ."

"బిరుసైన హయము నెక్కుడు
మరుమాటం(తం)బలుకు సుతుని మానక విడుమీ
వెరవెఱుఁగని...
తరచుగఁ బతి(పతి?)గవయఁజనదు ధరలో సుమతీ"

"రిపుపొత్తు పాముపొత్తును
గపటాత్ముని మిత్రు పొత్తు గడుసరిపొత్తున్
విపరీతభార్య(?)పొత్తును
అపదృష్టము(?)చేతవచ్చు నదిగో సుమతీ."

"సిరి తన్ను వలఁచియుండఁగ
సిరి గల్గిన చిన్నె లెల్లఁ జేయఁగవలయున్
సిరిఁ గూర్చి పాటలాడిన
సిరియుండదు లోభియొద్ద సిద్ధము సుమతీ."

ఇట్టి పద్యము లెన్నియో కలవు. ఈ యధిక పాఠములే కాక ప్రకృతసుమతిశతకములోని యీక్రింది పద్యములును, మఱికొన్ని పద్యములు నాప్రతియం దిచ్చుటను లేవు.

"శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు నౌరా యనఁగా
ధారాళమైన నీతులు
నోరూరఁగఁ జవులు పుట్ట నుడివెద సుమతీ."

"పుత్రోత్సాహము తండ్రికిఁ
బుత్రుఁడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని గనుఁగొని పొగడఁగఁ
బుత్రోత్సాహంబు నాఁడు పొందుర సుమతీ."

"మది నొకని వలఁచియుండఁగ
మదిచెడ యొక క్రూరవిటుఁడు మానక తిరుగన్
అది చిలుక పిల్లి బట్టిన
చదువునె యాపంజరమున జగతిని సుమతీ."

"లావుగలవానికంటెను
భావింపఁగ నీతిపరుఁడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁ డెక్కినట్లు మహిలో సుమతీ."

"వేసరపు జాతిగానీ
వీసము దాఁ జేయునట్టి వెంగలిగానీ
దాసీకొడుకైనఁగానీ
కాసులుగలవాఁడె రాజు గదరా సుమతీ."!

ఈమొదలగు పద్యము లాప్రతియందుఁ గానరావు. ఈకారణములు నా పైయభిప్రాయమునకు దోహదములగుటచేతను, సర్వలక్షణసారసంగ్రహమందలి 'ఏఱుకుమీ కసుగాయలు' అను పద్యము ప్రకృతసుమతిశతకమునందలిదే యైనను విరికిడిచేఁగాని, భీమన నామధేయుఁ డొకఁడు రచించిన మఱియొక గ్రంథ పద్యములఁ జూచి రెండింటికి నీతఁడే కర్త యను పొరపాటునఁగాని భీమకవిసుమతిశతక మనుట సంభవించియుండవచ్చు ననుటచేతను ప్రస్తుత సుమతిశతకము భీమకవికృతము కాఁజాలదు.

పిమ్మట మూఁడవవాదము బద్దెనకృత మనునది. దీనికిని రెండు మంచి యాధారము లుండుటచేఁ జాలకాలము (నేఁటివఱకు) ఈవాదమే నిలిచినది. ఇందు మొదటిది శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు బద్దెనీతిశాస్త్రముక్తావళిని సంపాదించుచు—

"శ్రీవిభుఁడ గర్వితారి
దుర్మదదళనోపలబ్ధజయలక్ష్మీసం
భావితుఁడ సుమతిశతకము
గావించిన ప్రౌఢఁ గావ్యకమలాసనుఁడన్"

అని బద్దెన చెప్పుకొన్న ట్లొక పద్యము చేర్చి యుండిరి. ఇది నిజ మను మాహ కలుగుటచే భీమన కృత మను వాదము వీఁగిపోయినది. తరువాత,

"పతికడకుఁ దన్నుఁ గూర్చిన
పతికడకును వేల్పుకడకు సద్గురుకడకున్
సుతుకడకు రిత్తచేతుల
మతిమంతులు చనరు నీతిమార్గము సుమతీ."

అను సుమతిశతకపద్యమునకు :

"సుతుకడకు వేల్పుకడకును —
...........................
......................
................... బద్దెనరేంద్రా."

అను పాఠ మొక్కటి దొరకుటచే ప్రాచీనులు సైతము సుమతిశతకము బద్దెన దనువారు కలరు.* — అని యీవాదమున కాధారములు చూపిరి.

ఈవాదమును కవులచరిత్రకారు లగు వీరేశలింగముగా రంగీకరించి సుమతిశతకము బద్దెనకృత మనియే యుదాహరించిరి. కాని పరిశీలించి చూడఁగా దీనికిని ప్రబలమైన ప్రతిబంధకములు గలవు. 'శ్రీవిభుఁడ' నన్న పద్య మొక్క ప్రతిలోనే యున్న దని శ్రీకవిగారే వ్రాసిరి. వివిధప్రతులు చూచిన కీ. శే. సుబ్బారావుగారికిఁ గాని, మూఁడు ప్రతులు తిలకించిన నాకుఁ గాని యీపద్య మెచ్చటను గానరాలేదు. అందుచే 'నీతిశతకము'నకు బదులు 'సుమతిశతక' మనియు నుండియుండవచ్చును. అటు లిది యంత నమ్మఁదగినది కాదు. పైఁగా, బద్దెన నీతిశాస్త్రముక్తావళిలో తన గ్రంథము గురించి యిట్లాశీర్వదించుకొనెను :

"శ్రీవిభుఁడైన బద్దెనృప
శేఖరు చేసిన నీతిశాస్త్రము
క్తావళి శిష్టలోకహిత
మయ్యెడుఁగావుత నాఁడునాఁటికిం
దీవరగర్భుఁడున్ శశియుఁ
దిగ్మమరీచియు భూతధాత్రియున్
దేవగణంబులున్ బుధులు
దిక్పతులుం గలయంతకాలమున్"

ఇదియేకాక మతియును గ్రంథాంతమందు-

"ఇది శ్రీ లక్ష్మీవల్లభ శ్రీపాదపద్మారాధకకమలాప్తకులపవిత్ర నన్నెగంధవారణరాజరాజమనోజాంక బద్దెనాఖ్యప్రణీతం బైన రాజనీతి ప్రకారం బన్నది సర్వము సంపూర్ణము."

అను గద్యము సైతము చేర్చియున్నాఁడు. ఇది చేర్చిన బద్దెనృపాలుఁడే సుమతిశతకము వ్రాసియున్నచో శతకారంభమునఁ గాని, శతకాంతమునఁ గాని తన నామధేయముఁ గాని, గద్యను గాని చేర్చకొనియే యుండెడివాఁడు. కాన, ఈయాధారము చింత్యమే.

పోనిండు. ఉభయగ్రంథములకుఁ గల శయ్యాసాదృశ్యము ననుసరించి రెండును బద్దెనకృతములే యని నిర్ణయింత మన్న, శైలీభేద మత్యంతముగా కానవచ్చుచున్నది. రెండు గ్రంథములను తిలకించినవారికి భేదము విస్పష్టముగాఁ దోఁచును. ఉదాహరణకు రెండుమూఁడు పద్యములు :

"అగుటయుఁ గామియు విధివశ
మగు కొఱఁగక తనవశంబె యని యెందములో
వగచెడు మూఢుఁ గనుంగొని
నగఁడె విధాత్రుండు కీర్తినారాయణుఁడా"
(నీతిశాస్త్రముక్తావళి, ౧౦౩)

"ధరణిపుఁ డాజ్ఞ చే శుభము
దైవము చేతఁ దపంబు శాంతిచే
సురతము ప్రౌఢిచేఁ బలుకు
సూనృతుచేఁ గుల మాత్మవేదిచేఁ
బురు లుపకారిచేఁ గవిత
పూజ్యతచే పతి సాధుశక్తిచేఁ
బురుషుఁడు శాల్మిచే మహిమ
పుణ్యముచే వెలయున్ యశోనిధీ. (౧౧౫)

"పదివేల సురలు గొల్వఁగ
బ్రదికెడు నింద్రునకు నేలఁ బాటెడు శ్రీమితిన్

మదిలోని మరణభయమును
బ్రదుకాశయు నొక్కడిదిటె బద్దెనరేంద్రా."

ఇట్టి శైలీరమ్యత సుమతిశతకమున వ్యంగ్యము. ఇంతియకాక బద్దెననీతిశాస్త్రముక్తావళిని సుమతిశతకకర్త యనుకరించె ననుటకుఁ గొన్ని యాధారములు కలవు. ఉదాహరణకు రెండుమూఁడు:

"నయ మన్నఁ జాలఁ బ్రావరు
భయ మన్న నమేధ్య మైన భక్షింతురు నా
నయముభయంబులలోపల
భయమే నయమండ్రు బుధులు బద్దెనరేంద్రా."
(నీతిశాస్త్రముక్తావళి, ౧౧౨.)

"నయమునఁ బాలుం ద్రావరు
భయమునను విషమ్మునైన భక్షింతురుగా
నయ మెంత దోషకారియొ
భయమే చూపంగవలయు బాగుగ సుమతీ."
(సుమతిశతకము, ౬౩.)

"సంధియును లేమి ప్రాలకు
నందము పురుషానుకూలి యగుట కులస్త్రీ
కందము మగవారికి నల
వందము మర్యాద పతికి నందం బెందున్."
(నీతిశాస్త్రముక్తావళి, ౯౫.)

"చేతులకుఁ దొడవు దానము
భూతలనాథునకుఁ దొడవు బొంకమి ధరలో
నీతియె తొడ వెవ్వారికి
నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ."
(సుమతిశతకము, ౮౭.)

"అలుకయు పగ సౌజన్యము
చెలి యాసయె కష్టమొప్పె సెగ్గము విద్యా
బలము సురుత్వము రాజ్యము
ఫల మాజ్ఞయ యండ్రు బుధులు బద్దెనరేంద్రా."
(నీతిశాస్త్రముక్తావళి, ౭౬)

"తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరక మండ్రు తథ్యము సుమతీ."
(సుమతిశతకము, ౫౫)

అందుచే బద్దెనతరువాతి కవియే సుమతిశతకమును విరచించె ననుటకె యివి సహాయపడునుకాని సుమతిశతకము బద్దెనకృత మనుటకివి యాధారములు కాఁజాలవు.

ఇట్లు శైవముని, భీమకవి, బద్దెన ముగ్గురిలోను నెవరు సుమతిశతకకర్తలు కాఁజాలరని తేలినది. కాని, సుమతిశతకకాలనిర్ణయమునకుఁ గొన్ని లభించిన యాధారములు పరిశీలనార్హములు. పైన తెలిపినట్లు బద్దెననీతిశాస్త్రముక్తావళి విరచించిన పిదపనే యీ శతకము విరచింపఁబడె ననుటకు పైసాదృశ్యపద్యములే సాక్షి. ఇంతేకాక, ౧౨-వ శతాబ్దమునకుఁ జెందిన పాల్కురికి సోమనాథుని కృతుల యనుకరణములు నిందు స్పష్టముగ గోచరించుచున్నవి. ఒకటిరెండుదాహరణములఁ బరిశీలించినఁ జాలును:

"నల్లనో భామల యుల్లం బెఱుఁగక,
గొల్లవాఁడైనను గోరుచే శవయు
నొల్లని వెలయాలి నొల్లని నృపతి
నొల్లని చెలిఁబాయ నొల్లఁ డేనియును
గొల్లండు వాఁడెగా కొల్లడ జాతి
గొల్లఁడు గొల్లండె గొల్లఁడేనియును."
( పండితారాధ్యచరిత్రము, పర్వతప్రకరణము.)

"ఒల్లని సతి నొల్లని పతి
నొల్లని చెలికాని విడువ నొల్లనివాఁడే
గొల్లండు కాక ధరలో
గొల్లండును గొల్లఁ డౌనె గుణమున సుమతీ."
(సుమతిశతకము, ౨౩)

మఱియు సుమతిశతకమున గొల్లని నిట్లు నిందించుటయుఁ గానరాదు. "గొల్లని సాహిత్యవిద్య" వ్యంగ్యమనియు, "కని కల్ల నిజము తెలియని, మనుజాధిపుఁడతఁడు గొల్ల మహిలో సుమతీ" యెందలగునవియు సోమనాథుని భావానుసరణములు.

ఇంతకుఁ దేలిన దేమనఁగా, నిట్టి ఛాయలు గల సుమతిశతకము చరిత్రజ్ఞులచే నిర్ణయింపఁబడిన బద్దెనకాలము (క్రీ. శ. ౧౨౬౧) నకును, సోమనాథుని కాలమునకును (క్రీ. శ. ౧౨౦౦,) దరువాతనే విరచింపఁబడె ననియు, దీని కర్తృత్వవిషయమున పై నుల్లేఖించిన విషయములఁబట్టి భీమకవి యన వేములవాడ భీమకవి కాఁ డనియుఁ, దన్నామధేయుఁ డింకొకఁ డింకొక శతకమును వ్రాసియుండిన వ్రాసియుండవచ్చుననియుఁ, బ్రస్తుతసుమతిశతకకర్త యాతఁడు కాక మఱియొకకవి గలఁ డనియుఁ దోఁచుచున్నది.



# “ఆసియా ఆసియావాసులకు”

విశ్వవ్యాప్త సంప్రదాయాలుగల మనన శీల సంస్కారం మన భారతభూమిని ఆసియాకు తలమానికంగా చేసింది. ఇటువంటి సంస్కారాన్ని మనం కోల్పోగలమా? ఎన్నో తరాల వేదాంత తత్వాలకు మనదేశం ఆశ్రయం ఇచ్చి ఉండటం అద్భుత విషయం. పూరీ జగన్నాథం, శృంగేరి మఠాలూ, శ్రీ అరవిందయోగి, శ్రీ రమణమహర్షి ఆశ్రమాలూ, అడయారు కేంద్రమూ, శాంతినికేతనమూ— వీటిని ఒకసారి స్మరించండి. జపానువారు ఇక్కడికి వచ్చినట్టయితే ఇవేవీ దక్కవు. గురుదేవుడి అభిప్రాయం వినండి:

“మీరు సృష్టించదలచిన ఆసియా పుర్రెలగుట్టలమీద గాని నిర్మాణంకాదు... నరహత్యలో ప్రత్యేక ప్రావీణ్యత పొందిన తామర్లేను హృదయానికి ఆహ్లాదం కలిగించే రీతిలో నేను చెప్పిన ఆసియా సందేశం సామ్యం చేయబడుతుందని నేను కలలోకూడా భావించి ఉండలేదు.... మీరు మీ ఉత్తరంలో వివరించిన “ఆసియా ఆసియావాసులకు” అనే సూత్రం రాజకీయ దోపిడి సాధనం. రాజకీయ నామకరణాలనూ, కపటాలనూ దాటి మన అందరినీ ఏకంచేయగల విశ్వమానవత్వం ఇందులో ఏమీ లేదు.”

“కవినుండి కవికి”—జపానుకవి అయిన నాగూచీకి రవీంద్రుడు వ్రాసినది.

“దేవాంశ సంభూతుడు” అయిన జపాను చక్రవర్తి క్రింద ప్రజలనూ సృష్టినీ ఆరాధించటమే జపానీయుల షింటో మతం. ఈ మతానికి లొంగని ఉపదేశాలను జపానువారు ఆమోదించరు.

> రవీంద్రుని “విశ్వమానవత్వం” వెంటనే అవలంబించండి. మీ మీ వ్యక్తిగత ఆదర్శాలు తర్వాతవి. జపానువారిని దేశంలో అడుగుపెట్టకుండా, ఆపటానికి, బ్రిటిషువారి సైన్యానికి మీచేతనయిన సహాయం చెయ్యండి.

## ఎవరికి వారాలోచించుకోండి, అందరూ కలసి పనిచెయ్యండి!

# అదే దేశీయ యుద్ధ రంగం

C.P.U. S.F. TG.

# శివతత్త్వవిచారము

= 'సుబ్రహ్మణ్యం' =

'వేదాంతోపవనే విహారరసికం
తం నీలకంఠం భజే'

శివుడు దేవదేవుడగు మహాదేవుడు. "మహేశాన్నాపరో దేవో, అఘోరాన్నాపరో మంత్రో" అని స్తోత్రములయందు రాజని చెప్పదగిన మహిమ్నస్తోత్రకారుడు చెప్పియున్నాడు. "ఓం నమ శ్శివాయ సిద్ధమైనమంత్రం ఓంకార మేదిరా ఓరీ" అని బ్రహ్మంగారు గానముచేసియున్నారు. "శివుడు దైవ మనుచు శ్రుతు లెల్ల బలుకంగ, వేరెదైవములను వెలయగొల్చి బ్రహ్మము గానక భ్రష్టులైపోయిరి" అనియు, "ప్రత్యక్షముగను శివయను రెండక్షరములు పరమపదము వసురా వేమా" యనియు వేమన్న చెప్పియున్నాడు. మరెందరో మహాకవులును, భక్తులును శివుని అనంత మహిమలను వేనోళ్ల కీర్తించియున్నారు. శివభక్తి ఆంధ్రదేశమునందు, ఒక్క ఆంధ్రదేశమం దన నేల భారతదేశమం దంతటను వేరులు పాతుకొనిపోయినది. పరమకారుణికోత్తముడైన ఈదేవుని స్వరూపస్వభావములను తలపోయుట తద్భక్తులకు ఇహపరసాధకము.

## వేదాంతములయందు
## శివతత్త్వ నిరూపణము

నిర్గుణమును, తురీయమును, అవాఙ్మనసగోచరమును, కేవలము అనుభవైకవేద్యమును అగు పరబ్రహ్మతత్త్వమును వేదాంతములు శివతత్త్వముగా చెప్పుచున్నవి. బ్రహ్మతత్త్వమును శిష్యుని కుపదేశింపబూనుకున్నవాడై వేదాంతసారసర్వజ్ఞుడగు మాండూక్యమహర్షి ఆత్మకు నాల్గుపాదములు కల్పించి, విరాట్స్వరూపమును ప్రథమపాదముగాను, హిరణ్యగర్భస్వరూపమును ద్వితీయపాదముగాను, మహేశ్వరరూపమును తృతీయపాదముగాను, అదృష్టము, అవ్యవహార్యము, అలక్షణము, అచింత్యము, ప్రపంచోపశమము, శాంతము, శివము, అద్వైతము నగు తత్త్వమును బ్రహ్మతత్త్వముగాను చెప్పియున్నాడు.

మనస్సును వాక్కును ప్రేరేపించుచు, ఇంద్రియములకు శక్తి సామర్థ్యము లొసగుచు, మనోబుద్ధీంద్రియాతీతమై యలరారుచున్న ఈ శివతత్త్వమునే హైమవతి ఇంద్రుని కుపదేశించినట్లు కేనోపనిషత్తులో కలదు. పంచకోశవిలక్షణుడై హృదయమునందు సచ్చిదానందరూపమున వెలయుచున్న శివతత్త్వమునే తైత్తిరీయమున భృగుమహర్షి తన కుమారునికి ఉపదేశించెను.

ఈ శివుడే సమస్తదుఃఖక్షయకరు డగుటచేత హరు డనియు, రుద్రు డనియు వేదాంతములయందు కీర్తింపబడుచున్నాడు. ఈ హర రుద్రశబ్దములను కేవల నిర్గుణాత్మకతత్త్వముగా శ్రుతులు చెప్పుచున్నవి. చూడుడు: "క్షరం ప్రధాన మమృతాక్షరం హరః" "క్షరాత్మనా వీశతే దేవ ఏకః" "ఏకోహి రుద్రో న ద్వితీయాయ తస్థుర్య ఇమాల్లోకానీశత ఈశనీభిః", 'యా తే రుద్ర తనూరఘోరా పాపకాశినీ తయా న స్తనువా శంతమయా గిరిశంతాభిచాకశీహి"

సమస్తప్రపంచము శివమయమే యని శతరుద్రీయము చెప్పుచున్నది. శివుని అనంతమహిమలను ఈ ఉత్తమస్తోత్రము గానము చేయుచున్నది.

శివుడు పరబ్రహ్మ యనియు, ఒక్కడైనవాడనియు, ఏకోరుద్రు డనియు, ఈశాను డనియు, భగవానుడనియు, మహేశ్వరుడనియు, మహాదేవుడనియు వేదాంతములయందు కీర్తింపబడుచున్నాడు. ఈశబ్దముల నిర్వచనము అథర్వశిరోపనిషత్తునందు కానవగును.

"అథ కస్మా దుచ్యతే మహాదేవః" అని ప్రశ్నించుకొని శ్రుతి యిట్లు ప్రత్యుత్తర మొస-

చున్నది: "యః సర్వాన్ భావాన్ పరిత్యజ్యాత్మ జ్ఞానయోగైశ్వర్యే మహతి మహీయతే, తస్మా దుచ్యతే మహాదేవః"—అనగా సమస్తభావములను సంపూర్ణముగా వదలి ఆత్మజ్ఞాన మను ప్రౌఢమైన యోగైశ్వర్యమునందు సకలయోగులచేత కొనియాడబడెడు వాడు కావున మహాదేవనామముచే నొప్పుచున్నాడు అని యర్థము. ఇట్లే శ్రుతి తక్కిన పదములకుగూడ వ్యాఖ్యానము గావించుచున్నది.

వాక్కునకు, మనస్సునకు అందని ఈశివతత్త్వమును అనంతములును, అపౌరుషేయములు నైన వేదములే యిట్టి దట్టి దని నిర్వచింపజాలక, నేతినేతివచనముచే సర్వమును నిషేధించియు, "సర్వం ఖ ల్విదం బ్రహ్మ" యను వాక్యముచే శివుడే సర్వాత్మకు డని చెప్పుచుండగా, అల్పబుద్ధులమగు మన మెట్లు తెలిసికొనగలము? ఎట్టి దని వర్ణింపగలము?

ఇందువిషయమై శివతత్త్వపారవేత్త యగు శ్రీ పండితారాధ్యులు ఈ క్రిందివిధముగా చెప్పుచున్నారు:

"అతివాఙ్మనసవ్యాపారమైన నీనిజరూపమును శ్రీపతివాక్పతిప్రముఖులగు మహాపురుషులు తెలిసికొనజాలరు. శివుని తత్త్వము విజ్ఞానము, ఏకము, అణుచరము, ఆనందము అని వేదములు చెప్పునుగాని యిట్టి దట్టిదని నిరూపింపజాలవు. ఇది గా దది గా దని చెప్పి పృథివ్యాదులైన మూర్తుల నన్నిటిని చదువుచు, సమస్త వేదాంతములును నిన్ను వెదకుచున్నవి. అనంతములైన వేదములే నిన్ను తెలిసికొనజాలక వెదకుచున్నప్పుడు ఇతరులకు నిన్నెరుగ శక్యమా?"

## జగత్కారణము

విజ్ఞానము, ఆనందము, అద్వైతము ఇత్యాది నామములచే నొప్పు శివతత్త్వమే ప్రపంచోత్పత్తి స్థితిలయకారణము. శ్రుతి—"ఆనందాద్ధ్యేవ ఖ ల్విమాని భూతాని జాయంతే, ఆనందేన జాతాని జీవంతి, ఆనందం ప్రయంత్యభిసంవిశంతీతి" (తైత్తిరీయభృగువల్లి) ప్రపంచమును సృష్టించునప్పుడు శివుడు భవు డను నామముచే నొప్పుచున్నాడు. భవుడు రజోగుణవిశిష్టుడు. జనులకు సుఖము కలుగజేయునప్పుడు మృడుడని చెప్పబడుచున్నాడు. మృడుడు సత్వగుణవిశిష్టుడు. ప్రపంచమును లయింపజేయునప్పుడు శివుడు రుద్రుడను నామముచే నొప్పుచున్నాడు. రుద్రుడు తమోగుణ విశిష్టుడు. "పరమ స్వతంత్ర నిర్మల పరమానందాత్మ పరమ భట్టారక నిస్తరనిస్త్రైగుణ్యమహత్తరరూపమున శివాభిధానంబరయ్యెన్" (పండితారాధ్యులు)

ప్రపంచోత్పత్తి స్థితి లయకారుడు ఈశ్వరు డని వేదాంతములు చెప్పుచుండ, కూటస్థము, అచలము నగు శివతత్త్వ ముండబట్టియే ఈప్రపంచకల్పన జరుగుచున్న దని శ్రుతి చెప్పుచుండ కొందరు "ఈశ్వరునికి ఇచ్ఛకలదా? సృష్టికి కావలసిన ఉపాయములు కలవా? ఆధారములు కలవా?" అని ప్రశ్నించి, అనిర్వచనీయాతిశయమహిమవిశిష్టుడగు ఈశ్వరుని శంకించుచున్నారు. తర్కింపరాని మహిమాన్వితుడగు ఈశ్వరునికి ఉపాయాంతరము లవసరమా? శ్రుతి—"యథోర్ణనాభిః సృజతే గృహ్ణతేచ, యథా పృథివ్యాం ఓషధయ స్సంభవంతి, తథా పురుషాత్ సంభవతీహ విశ్వం" స్మృతియు "మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరం" అని చెప్పుచున్నది. సర్వశక్తిసంపన్నుడగు ఈశ్వరుడు తప్ప మరెవ్వరు ఈ ప్రపంచకల్పనకు కారణము కాగలరు? సర్వమునకు అధిష్ఠానము శివుడే, సర్వము శివుడే. శివుడు సర్వశక్తిసంపన్నుడు మాత్రమే కాదు—కరుణాకరుడు, భక్తిపరతంత్రుడు నై యున్నాడు. దైవములలో నెల్ల ఉత్తమదైవము శివుడు. భక్తుల యిచ్ఛానుసారము ఇహపరసుఖముల నొసగువాడు శివుడు. అనేకులు—కిరాత శ్వపచులుసైతము శివుని సేవించి ఉత్తమగతి నొందిరి.

## శివుని సగుణరూపము

శివుని నిజస్వరూపము వాక్కునకు, మనస్సునకు, బుద్ధికిని అందని దగుటచేతను, హరివిరించి ప్రముఖదేవతానీకమునకు సైతము దుర్లభమగుటచేతను భక్తానుగ్రహార్థమును, ఉపాసనాసాఫల్యముకొరకును శివుడు మహనీయమంగళప్రదమగు రూపము గైకొని

యున్నాడు. భక్తులు ఈ సగుణరూపము నుపాసించియు, స్తోత్రము చేసియు ధన్యు లగుచున్నారు.

అగుణుడు సగుణు డగు టెట్లు అని సంశయాత్ములు ప్రశ్నింపవచ్చును. కాని భగవంతుడు లోకసంగ్రహార్థమును, భక్తానుగ్రహార్థమును అనేకావతారము లెత్తెనని నమ్ము ఆస్తికుల కీప్రశ్న అర్థవిరహితముగా దోపకమానదు. "యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం" అని భగవంతుడు గీతలలో చెప్పియేయున్నాడు. రామ, కృష్ణ, శంకరాద్యవతారము లన్నియు లోకానుగ్రహార్థమై కొనబడినవే. ఇట్టులే పరమకారుణికోత్తముడగు శివుడు భక్తానుగ్రహార్థమై యొక రూపము గైకొనెను.

ఈరూప మెట్టిది? అత్యంతమంగళప్రదమైనది, నిర్గుణ ఆత్మతత్త్వ ప్రతిపాదకమైనది. శివుడు గైకొన్న అలంకారములును, చిహ్నములును ఆ దేవదేవుని నిర్గుణతత్త్వమును వ్యక్తము చేయునవిగా నున్నవి. దుర్గమమైనప్పటికిని శివుని విచిత్రరూపమును యథామతి వర్ణింప బూనుకొనెదను.

శివుని విగ్రహమును ఎంత వర్ణించినను పౌరాణికులకు తనివి కలుగుటలేదు. విష్ణువునకు గల భోగములు శివునికి లేవు. శివుడు సన్న్యాసి, శివుడు యోగీశ్వరేశ్వరుడైన దక్షిణామూర్తి. శివుని మూర్తి భారతనాగరికతకును, భారతవిజ్ఞానమునకును చిహ్నము. భారతదేశములో సర్వసంగపరిత్యాగులకు గల గౌరవము మహారాజులకు సైతము లేదు. శుకుడు, దత్తాత్రేయుడు, బుద్ధుడు, శంకరభగవత్పాదులు, వేమన్న, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ వివేకానందుడు, దిగంబర సన్న్యాసి (The naked Fakir) అని చర్చిలుచేత బిరుదము బడసిన గాంధిమహాత్ముడు భారతీయుల కాదర్శప్రాయులు. వీరందరికిని శివు డాదర్శప్రాయుడు.

శివుడు సర్వసంగపరిత్యాగియై గౌరీశంకరమున తపమాచరించుచున్నాడు. భూతభేతాళగణ పరివృతుడై మహాశ్మశానమున తాండవమాడుచున్నాడు. భిక్షాపాత్రగా కపాలము ధరించియున్నాడు. శ్మశానమునందలి భస్మమే యతని అంగరాగము. తన ఫాలనేత్రముచే కాముని భస్మము చేసియున్నాడు. అహంకార మను పెద్దపులిని చంపి దాని చర్మమును వస్త్రముగా ధరించియున్నాడు. మద మను గజాసురుని చంపి దాని చర్మమును కప్పుకొనియున్నాడు. మన స్సను లేడిని దూరముగా నుంచి ఆత్మారాముడై విలసిల్లుచున్నాడు. దుష్టప్రవృత్తులను సర్పములను లోపలి నుండి పెకలించి కంఠమునందు హారములుగా ధరించియున్నాడు. సర్వలోకభయంకరమగు హాలాహలమును కబళించియు తన ఉదరములో నున్న ప్రపంచములు భస్మమగు నన తలంపున దానిని మ్రింగకయు, వెలుపలి ప్రపంచములు భస్మమగు నను తలంపున దానిని వెడలగ్రక్కకయు కంఠమున దాల్చియున్నాడు. ఇట్టివారికి ఒక మచ్చ యుండుటకూడ శోభస్కరమేగదా.

శివుని వాహనము వృషభము. ఆవృషభముపై ఆదిశక్తి యగు పార్వతితోను, ముద్దుకుమారులగు గణపతి సుబ్రహ్మణ్యులతోడను, ప్రమథులు స్తోత్రపాఠములు గావింప, భూతభేతాళగణములు పరివేష్టింప నిండు పేరోలగమున నున్నాడు. పార్వతికి ఆయన అర్ధభాగము నిచ్చియున్నాడు. ఎందుకు? శక్తి లేనిది ప్రవృత్తియే లేదు; ప్రపంచమే లేదు. "శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం న చే దేవం దేవో నకుశలస్స్పందితు మపి" అని శంకరులు చెప్పియున్నారు. గణపతి ఓంకారస్వరూపుడు. ఓంకారము పరబ్రహ్మము నుండి కలిగిన మొదటి వికృతికదా! సుబ్రహ్మణ్యుడు మహత్తత్త్వమైయున్నాడు. అనగా మనకు బుద్ధినిచ్చు దైవము సుబ్రహ్మణ్యుడు. వ్యష్టిలో నీతడు మహత్తత్త్వమనియు, సమష్టిలో నీతడు హిరణ్యగర్భతత్త్వమనియు చెప్పబడును. శివుడు శక్తితో కలియునప్పుడు మొదట కలుగునది బుద్ధియేగదా! సాంఖ్యులు దీనిని మహత్తత్త్వ మందురు. వేదాంతులు దీనిని " మహా నాత్మా " అనిరి.

" ఇంద్రియాణి పరాణ్యాహు ఇంద్రియేభ్యః పరం మనః, మనసస్తు పరా బుద్ధిః బుద్ధే రాత్మా మహాన్ పరః, మహతః పర మవ్యక్త మవ్యక్తాత్ పురుషః పరః. "

సుబ్రహ్మణ్యుని వర్ణన లన్నియు ఈ విషయమునే స్పష్టము చేయుచున్నవి. సుబ్రహ్మణ్యుడు వేదమూర్తి. వేదమయుడగు నతని పేరనే మన దేశములో ప్రతి యింటియందును సుబ్రహ్మణ్యులు వెలసియున్నారు. సుబ్రహ్మణ్యుడు షణ్ముఖుడు. ఇంద్రియములు, మనస్సు అతని ముఖములు. సుబ్రహ్మణ్యుడు దేవతల సేనాధిపతి. దేవత లనగా ప్రకాశించు ఇంద్రియములు. ఇంద్రియములకు సేనాధిపతి బుద్ధియే గదా! ఈ బుద్ధికి అధిష్ఠానమైన దేవుడు సుబ్రహ్మణ్యుడు. సుబ్రహ్మణ్యుని వాహనము నెమలి. నెమలి మనోవేగమునకు చిహ్నము. ఈ వర్ణనలన్నియు సుబ్రహ్మణ్యుడు హిరణ్యగర్భతత్త్వ మని స్పష్టము చేయుచున్నవి.

శివుడు త్రిపురములను నాశము చేసి ఆ పురములలో నివసించు అసురుని చంపియున్నాడు. అనగా స్థూల, సూక్ష్మ కారణ శరీరములను నాశము చేసి స్వస్వరూపావస్థితియందున్నాడు. "ఓ పశుపతీ! ఏమి నీ సాహసము? ఏమి నీ ధైర్యము! మరెవ్వరేని యిట్లు నిలచియుండగలరా? శోకోన్ముఖులగు దేవత లందరు నిటు నటు పారజూచుచుండ, మును లందరు గడగడలాడుచు భయకంపితు లగుచుండ, తుదకు దృశ్యప్రపంచ మంతయు నశించిపోవుచుండ నీ వొక్కడవె నిర్భయుడవై మహాప్రళయమం దోటు లేక విలసిల్లుచుంటివి" అని శివానందలహరి స్తోత్రకారుడు చేసిన స్తవ మెంతయు నొప్పియున్నది.

శివుడు చంద్రుని, ఆకాశగంగను మౌళియందు దాల్చియున్నాడు. శివుని ఆకారసంపద ఎట్టిదో ఈ చిహ్నములవలన తెలిసికొనదగును. ఆత్మయొక్క నిరతిశయ సుఖస్వరూపమునకును, జ్యోతిఃస్వరూపమునకును చంద్రుడు చిహ్నము. గంగ చిచ్ఛక్తి. అనగా జ్ఞానశక్తి. జ్ఞానము చల్లనిది. స్ఫటికవిశదమైనది. శక్తి యగుటచే స్త్రీగా వర్ణింపబడినది. ఆత్మతత్త్వమును వర్ణించు పట్టున శ్రుతి 'విరజం, నిష్కలం, శుభ్రం, ఆనంద రూపం, జ్యోతి ర్మయం, జ్యోతి రివాధూమకః' ఇత్యాది విశేషణముల నుపయోగించుట గమనింపదగియున్నది.

## దక్షాధ్వరధ్వంసము

శివుడు దక్షాధ్వరధ్వంసి. దక్షుడు ప్రజాపతులలో నొక్కడు. క్రియాదక్షుడు. ఋషులు ఆతని యజ్ఞమునకు ఋత్విక్కులు. సదస్యులు దేవతాగణము. ఐనను క్రతువు ధ్వంసమయ్యెను. ఏల? ప్రజాపతి విభుత్వగర్వంబునం జేసి దక్షుడు ఈశ్వరాదులను ధిక్కరించి, అరుద్రకంబుగా యజ్ఞము గావింప నుపక్రమించెను. సవనభాగార్హుడును, యజ్ఞఫలవిధాతయు నగు ఈశ్వరుని ఆదరింపక పోయెను. పైగా అవమానించెను. ఈ కారణమున సవనము ధ్వంసమయ్యెను. ఈశ్వరుని ఆదరించి, ఈశ్వరునికి సవనభాగము నిచ్చి దక్షుడు మరల యజ్ఞము చేసినపుడు యజ్ఞము సక్రమముగ జరిగెను. కనుక కర్మల నన్నిటిని ఈశ్వరార్పణబుద్ధితో చేయవలె నని మనము ఈ కథవల్ల నేర్చుకొనదగియున్నది.

## భక్తపరతంత్రుడు

శివుడు భక్తపరతంత్రుడు. తన శిరములను కోసి శివుని పాదకమలములపై నర్పించినకతమున రావణాసురుడు ఇతరుల కలభ్యమగు సంపద పడసెను. శివుడు భక్తుడగు బాణాసురుని ఇంటి కావలివాడై యతని కొరకు విష్ణువుతో యుద్ధమునకు తలపడెను. శివునికి ఎండ తగులకుండ తనపాదుక నడ్డము పెట్టి, తన పుక్కిటి నీటితో శివలింగము నభిషేకించి, తాను తినగా మిగిలిన నంజుళ్లను నైవేద్యముచేసిన బోయవాడు భక్తాగ్రేసరుడై శివుని అనుగ్రహమునకు పాత్రుడయ్యెను. శివభక్తుడగు అర్జునునకు తన స్వరూపము చూపి పాశుపతాస్త్రము నొసగెను. నిష్కల్మషమగు భక్తిచే మాలయగు నందుడు శివసాయుజ్యమును బడసెను. మరెందరు శివునియందలి భక్తిచే తరింపలేదు! ఇంత సులభుడు, ఇంత భక్తపరతంత్రుడు నగు దైవము మరి యొకడు లేడు. కావున స్మశానవాసి యనియు, భస్మధారి యనియు, సన్న్యాసియనియు శివు నమంగళుగా దలంపజనదు. సమస్తలోకములకును శివుడు మంగళప్రదమైనవాడు.

## శివలింగము

ఆసేతుహిమాచలపర్యంతము గల పుణ్యక్షేత్రములయందును, తీర్థరాజములయందును శివుడు లింగా

కారమున వెలసియున్నాడు. విష్ణువు మున్నగు దేవతలకు విగ్రహములు కానవగును. శక్తికిని విగ్రహములు కలవు. కాని శివుని కిట్టి ప్రతిమలు కానరావు. ఏల? "కూటస్థ మచలం ధ్రువం" అని వేదవ్యాసుడు వర్ణించిన కేవల ఆత్మతత్త్వమగుటచేతనే శివుడు లింగాకారము నొంది యున్నాడు. ఈలింగము ఆపాతాళనభస్థలాంతభువన బ్రహ్మాండవ్యాప్తమైనది. చల్లని కిరణములచే చంద్రుడు ఈలింగమును నిరంతర మభిషేకించుచున్నాడు. ఈ లింగము యొక్క ఆదిని కనుగొనుటకు వెళ్లి బ్రహ్మదేవుడు పాతాళాదిలోకముల నన్నిటిని వెదకి కనుగొనలేకపోయెను. ఈవిధముగానే దాని అంతము కనుగొనలేక విష్ణుదేవుడు ఊర్ధ్వలోకముల నన్నియు గ్రుమ్మరి గ్రుమ్మరి అంతము గానక తిరిగివచ్చెను. దీని యర్థమేమి? సర్వవ్యాపియగు ఆత్మతత్త్వము యొక్క ఆద్యంతము లెవ్వరు కనుగొనగలరు? ఈలింగము యొక్క ఆద్యంతములు వెలుపల నెవ్వరికిని కనబడవు. ఎవడు అంతర్ముఖుడై హృదయమునందు స్థిరముగా ప్రతిష్ఠితమైన లింగమును కనుగొన ప్రయత్నించునో వానికి పరమేశ్వరుడు స్వయముగా దర్శన మిచ్చి తరింపజేయును. స్థాణురూపమునను, జ్యోతీరూపమునను ఆత్మలో అమరియున్న లింగమునకు శివలింగము బాహ్యచిహ్నము.

## శివతాండవము

శివుడు నటరాజు. ఈప్రపంచ మంతయు ఆతని నాటకరంగము. ఈనాటకరంగమున ఆతడు బ్రహ్మానందముతో ప్రపంచమునకు తత్త్వోపదేశము గావించి తరింపజేయుటకై నాట్యమాడుచున్నాడు. ఈనాట్యము యొక్క పరమార్థమును విచారించుట సమంజసము.

"కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్ యదేష ఆనందో నస్యాత్ ఏష ఆనందయాతి" అని తైత్తిరీయోపనిషత్తులో నొక వాక్యము కలదు. ఈ ఆనందము లేనిచో ఎవ్వరు ఉచ్ఛ్వాస నిశ్వాసములు విడువగలరు? ఆతడే ఆనందము కలుగజేయుచున్నాడు అని శ్రుతియర్థము.

శివుడు ఆనందమూర్తియై తాండవించబట్టియే ప్రపంచమునకు ఆనందము కలుగుచున్నది. సంతోషము కలిగినప్పుడు మనము ఎగురుదుము, గంతులు వైతుము, చిందులు త్రొక్కుదము. స్వల్పమానుషానందమే యింత గొప్పదిగా నగపడుచో కేవలము ఆనందరూపియగు శివుని నాట్య మెట్టిదిగా నుండవలెను? ఏది ఆనంద స్వరూపమో అదియే చిత్ స్వరూపము. ఏది చిత్ స్వరూపమో అదియే సత్ స్వరూపము. కనుక శివుడు సచ్చిదానందమూర్తియై ఈప్రపంచమహానాటకరంగమున ప్రచ్ఛన్నముగా నాట్యము గావించుచున్నాడు. శివుని పాదఘట్టనమున కోర్వజాలక భూమి సంచలించుచున్నది. బహువేగముచేత నక్షత్రగ్రహమండలములు చలించి అంతరిక్షమునందు తిరుగుచున్నవి. వెడదలును, నిడువులును నగు జటల తాకిడిచే స్వర్గ ప్రాంతప్రదేశములును, దిక్కులును బద్దలగుచున్నవి. ఐనను ప్రపంచక్షేమమునకై శివుడు నాట్యము చేయుచున్నాడు. ఈ తాండవకాలమందు బ్రహ్మ, విష్ణు, ఇంద్రాదిదేవతలు, సరస్వతి మొదలగు దేవతాస్త్రీలు తాళములు, మృదంగములు మున్నగు వాద్యములు ప్రయోగించుచున్నారు.

బ్రహ్మాండవ్యాప్త దేహుడగు శివుడు గంగను, చంద్రుని తలదాల్చి, సర్వాభరణుడై, ప్రణవమగు ఢక్కను బూని ప్రపంచమునకు జ్ఞానోపదేశము గావించుచు, మరియొక చేతిలో మానవులకు జ్ఞానజ్యోతి ప్రసాదించుచు, ఒకకాలితో మహామాయను త్రొక్కిపట్టి, మరియొక కాలితో తురీయపదమును జూపుచు, మనస్సను లేడిని దూరముగా నుంచి ఆత్మారాముడై బ్రహ్మానందమున తాండవమాడుచున్నాడు. ఆత్మతత్త్వము నాట్యము చేయుచుండబట్టియే ఈప్రపంచ నటన జరుగుచున్నది. శివుడు త్రిలోకగురుడు. ఈనాట్యముచే ఆయన ప్రపంచమునకు వైరాగ్యబోధ చేయుచున్నాడు.

మహత్తరమైన ఈశివతత్త్వమును విచారించి, ఆమహాదేవు నుపాసించుట ఇహపరసాధకము.

"ఏతదాలంబనం శ్రేష్ఠం
ఏతదాలంబనం పరమ్."



భా ను మూ ర్తి

# భానుమూర్తి

ఈచిత్రము చితూర్‌ఘర్ (మేవాడు) నందలి సూర్యాలయములోనిది. శిలాశిల్పము. ఆసీనమూర్తి ననుసరించి వ్రాయబడినది. ఈమూర్తి ౮-వ శతాబ్దము నాటి దని యూహించవచ్చును. వ్యక్త్యప్రమాదములతో పద్మాసనమునం దున్నది. చుట్టును రాజ్ఞి, సువర్ణ, సువర్చస, ఛాయ మొదలైన దేవేరులు, దండుడు, పింగళుడు మొదలగు పరివార దేవతలు నమరియున్నారు. అంతర్భాగమునందలి చీకటిలో కొన్నిమూర్తులు స్పష్టముగా తెలియుటలేదు. ఔత్తరాహికసంప్రదాయము ప్రకార మీసూర్యమూర్తికి చౌకమైన 'కిరీటముకుట' మున్నది. దానికి శిఖరముకూడ చదరముగానే యుండును. ప్రస్తుతము ఉన్న సూర్యవిగ్రహములలో ఇది మిక్కిలి శ్రేష్ఠమైనది. కుడిచేయి శిథిలమైనది. మరికొన్ని అట్లే పోయినవాటిని నేను పూర్తిచేసి యున్నాను. ఆ స్త్రీవిగ్రహములు చీకటిని తరుము చున్నవని కొందరి యభిప్రాయము. లేక నాట్య భంగిమములో ?

రామనాథశర్మ.

# మేరీ ఔరత్

[కథానిక]

= శ్రీ మునిమాణిక్యం నరసింహారావు =

"రైలుటైము అయింది. తొందరగా వెళ్లాలె. —ఆ రెండు ధోవతులు చాలవు. ఇంకా రెండు వెయ్యి. లాల్చీలు ఎన్ని వేశావూ? మూడా? ఏమిటి నీ ఉద్దేశం? రోజుకు ఒకటైనా కావాలా? వెయ్యి ఇంకా రెండు."

"ఎందుకండీ ఇవన్నీ? ఎక్కడైనా పారేసివస్తారు."

"ఎక్కడైనా పారేసివస్తానూ? అంటే... నేను శుద్ధ తెలివితక్కువవాడ్ని అన్న మాట! ఊరికెళ్లినప్పుడల్లా పారేసుకొస్తున్నానా?"

"ఎప్పుడూ పారేస్తున్నారని కాదండీ."

"మరేమిటి, ఎందుకు వద్దనటం?"

"రెండురోజుల ప్రయాణానికి ఇన్ని బట్టలు ఎందుకు, ఏదో క్లుప్తంగా తీసికెడితే చాలదా అనీ నే ననటం."

"అంటున్నావులే. ఆ అనటంలోనే నేను తెలివితక్కువవాడ్ని అయినట్లు తేలుతున్నది. ప్రతి ఆడదీకూడా తన మొగుడంత తెలివితక్కువవాడు ఈ ప్రపంచంలో ఇంకొకడు లేడనుకొంటుంది."

"నే నేమీ అనుకోటం లేదండీస్వామీ. మీ ఇష్టం వచ్చినన్ని తీసుకెళ్లండి. ఊరికే జాగ్రత్తకోసం చెప్పాను. దాని తరువాత మీ ఇష్టం."

అని వెళ్లిపోయింది కాంతం. అల్లాగ వెళ్లిపోవటం మటుకు నాకు చాలా విచిత్ర మనిపించింది. ఎందుకంటే- మా ఆవిడ... అంత సులభంగా వదిలేసే మనిషి కాదు. పోట్లాట వచ్చిందంటే మరీ పెంకెపట్టు. సాధారణంగా లోకంలో భార్యలు భర్తలతో పోట్లాడుతూనే ఉంటారు. అందులో మా ఆవిడ సెకండుఫ్రంటు కూడా ఓపెన్ చేసింది. గదిలో పోట్లాట ప్రారంభిస్తుంది. ఎట్లాగో తప్పించుకొని బైట పడితినా, నడవలో మళ్లీ ఎటాక్ చేస్తుంది. అల్లాంటి మనిషి మరి ఇల్లాగ నన్ను వదిలేసి వెళ్లిపోవటం ఆశ్చర్యం కలుగజేసింది అంటే చేయదూ?

సరే నని, కావలసిన బట్టలూ అవీ తీసుకొని సూటుకేసులో పెట్టి బెడ్డింగు తయారు చేసికొన్నాను. అంతా సిద్ధం అయినతరువాత కాంతాన్ని పిలిచి "ఏదీ..."అన్నాను- రూపాయి మోగించటం చూపిస్తూ.

ఆవిడ సూటుకేసువంక ఒకసారీ, బెడ్డింగువైపు మరోసారీ చూచి, ఆతరువాత నవ్వుతూ నాకేసి చూస్తూ నిలబడింది.

ఈచిరునవ్వులకు అర్థాలు నాకు తెలియకపోలేదు. ఊరుకొన్నాను.

"ఎందుకండీ సూటుకేసూ, బెడ్డింగూ కూడానూ? సూటుకేసులో ఉన్న ఆ నాలుగు బట్టలూనూ బెడ్డింగులో వేసుకొంటే మీకు తేలికకదూ"" అన్నది.

నిజమే ఆమాట. తెలివితక్కువగా రెండుసాల్తీలు తయారుచేశాను. వీటిని రైళ్ళల్లో ఎక్కించటానికీ, దింపటానికీ—కూలీ ఇవ్వాలె. బోలెడు శ్రమానూ. కాని నాకు ఆమాత్రం తోచింది కాదు.

"వచ్చావూ? ఏదోఒక వంక పెడటానికి! సరే. రాణీసాహేబావారి ఆజ్ఞ ఏమిటో సెలవియ్యండి" అన్నాను.

"సరె సరె లెండి. నేను రాణీనీకాదూ, సాహేబునూకాదు. మీరు ఎంతలోకి సాయిబు అవుతారు!" అన్నది.

ఆవిడ అక్కడ నిలబడి చూస్తుండంగానే, సూటుకేసులోని బట్టలు తీసి బెడ్డింగులో పడేసి ప్రయాణానికి సిద్ధమైనాను. "నాన్నా, ఒకజట్కా పిలూ" అని కేకేశాను మా అబ్బాయికోసం.

మరిరెండు నిమిషాల్లో జట్కా ఇంటిముందు నిలబడింది. నేను ఎక్కి కూర్చున్నాను. కాంతం వాకిట్లోకి వచ్చి, "జాగ్రత్తగా రండి. శాలువకూడా తీసుకెడుతున్నారు." అన్నది ఆదుర్దాగా చూస్తూ. ఆశాలువ పారేస్తాననే ఆమె అనుకోటం. పారేయటం కొంచెం హెచ్చుతగ్గుగా నిశ్చయమనేఊహించి "జాగ్రత్త,జాగ్రత్త" అంటూనే ఉంది. నేను బండివాడితో "పోనియ్యవోయ్" అన్నాను. బండి సాగిపోతున్నా కూడా ఆవిడ, "ఏమండోయ్, జాగ్రత్తసుమండీ, బెడ్డింగు ఎక్కడైనా విడిచివచ్చేరు. తువాలాలూ అవీ ఉన్నాయి." అంటూ చెప్పింది.

బండి దుకాణాలు దాటి మలుపు తిరిగింది. ఇంతలో మా రాధాయ పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. వాడు రొప్పుకుంటూ వచ్చి "అమ్మ ఒకసారి రమ్మంటున్నది" అని చెప్పాడు. నేను విసుక్కుంటూనే దిగి వెళ్లాను. ఆమె లోపలికి తీసికెళ్లి, "డబ్బు తీసుకోకుండా వెడుతున్నారేం" అన్నది. పర్సు జేబులో వేసుకొన్నాను గాని ఆవిడనడిగి డబ్బు తీసుకోటం మరిచిపోయినాను.

"నయమే, ఏదీ ఇయ్యి" అన్నాను.

"ఎంత ఇయ్యమంటారూ?"

"పాతిక ఊ, చప్పున ఇచ్చెసెయ్యి"

"పాతి కెందుకండీ—రాజమండ్రి వెళ్లి రావటానికి?"

"అక్కడినుంచి యకాయకీని బెజవాడ-మీదుగా నరసారావుపేట వెడతాను. అమ్మాయిని చూడటానికి."

"ఒక్కమాట వినండి-మీరు చాలా రోజులు ప్రయాణం చేయలేరు. రాజమండ్రి నుంచి ఇల్లా వచ్చి రెండురోజు లుండి, ఆతరవాత అమ్మాయిదగ్గరకు వెళ్లండి. ఈలోపున దాని కోచీర కొని ఉంచుతాను. నా మాట విని ఈపదీ తీసుకెళ్లండి. మిగతా పదిహేనూ నాదగ్గ రుంటై" అని బ్రతిమిలాడింది.

నేను ఆవిడచేతిలో ఉన్న కాయితాలన్నీ లటిక్కున లాక్కుని పర్సులో పెట్టుకొని — "నీవు ఊరుకో. నా కేం ఫరవాలేదు. మళ్లీ ఇటు రాను. ప్రోగ్రాము ఒకమాటు స్థిరపడిం తరువాత మార్చటానికి వీల్లేదు" అని అధికారిలాగ అన్నాను. ఆవిడ చిన్నబుచ్చుకొని "సర్లే, మీ ఇష్టం" అని

నన్ను వీధిలోకి పంపి, ఇంకోసారి "జాగ్రత్త" అని చెప్పి దీనంగా చూసింది. నేను నవ్వుతూ బండి ఎక్కి 'ఊ' అన్నాను. "మళ్లీ ఎప్పుడొస్తారూ?" అని ఆవిడ అడిగింది బండి సాగింతరువాత. "రేపు రాజమండ్రిలో ఉంటా ననుకో. అక్కడినుంచీ నరసారావుపేట వెళ్లి రెండురోజు లుండి నాలుగో నాటికి తిరిగివస్తాను" అన్నాను. "అమ్మాయి చేతులో ఆపదిరూపాయలూ పెట్టండి. ఇంకో విధంగా ఖర్చుచేయక" అని కేకవేసింది. నేను తల ఊపి ఊరుకొన్నాను.

ఆ వెళ్లటం వెళ్లటం నేను రాజమండ్రి పోయినాను. అక్కడికి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందీ అంటే — కాంతంస్నేహితురాలు ఒకర్తె అక్కడ శానిటోరియంలో ఉంది. ఆమెను చూడాలని కాంతం తహతహ లాడింది. ఆమెవెడితే నేనూ వెళ్లాలె. ఇద్దరం వెడితే డబ్బు ఎక్కువ కర్చు అవుతుందని నేను ఒకడ్నే చూచివస్తానని మా ఆవిడకు చెప్పాను. ఆవిడ సరేనని ఒప్పుకొన్నది. అదీ నా ప్రయాణానికి కారణం. డబ్బు కర్చు తగ్గించే ఏవిషయమైనా కాంతానికి ఇష్టం. నేను కూడా ప్రతివిషయంలోనూ ఇప్పుడు జాగ్రత్తగా ఉంటున్నాను.

రాజమండ్రిలో దిగి దగ్గరలో ఉన్న కాఫీహోటలులో ఒక్క ఇడ్డెను, అరకప్పు కాఫీమాత్రమే పుచ్చుకొన్నాను. "డబ్బు జాగ్రత్తగా వాడండి" అని కాంతం నొక్కి నొక్కి చెప్పినమాటలు నేను మరిచిపోయి ఎక్కువ సొమ్ము పాడుచేయటం తప్పు అని తోచింది. ప్రయాణం పొడుగునా నేను ఒక్క దమ్మిడీఅయినా అనవసరంగా కర్చు చేయదలుచుకోలేదు.

అటుతరువాత మా ఆవిడస్నేహితురాలిని చూడటానికి శానిటోరియముకు బయలుదేరాను. శానిటోరియం వీరభద్రాపురానికి రెండుమైళ్ల దూరంలో ఉందని తెలిసింది. నడిచివెళ్లటం కష్టం అని తోచింది. అదీకాక ఎండ తీక్షణంగా ఉండేలాగ కనిపించింది. అది మాఘమాసం. పగలు మండుటెండ, రాత్రిళ్లు చలీనూ. బండొకటి మాట్లాడుకొని వెడదా మనుకొన్నానుగాని, రానూ పోనూ రూపాయిన్నరకు తక్కువైతే బండి కట్ట నన్నారు. రూపాయిన్నర కర్చుచేయటానికి ఏమాత్రం మనస్సొప్పలేదు. ఒక్క నిమిషం తటపటాయించి గిరుక్కున తిరిగి వీరభద్రాపురందారి పట్టాను. వీధులలో దుమ్ము ఎత్తిపోస్తున్నది. పోనుపోను ఆదుమ్ము మరీ ఎక్కువైంది. నడిచీ నడిచీ సుమారు పదకొండుగంటలకు శానిటోరియం చేరాను.

ఒక మిట్టపై నున్న ఆవైద్యశాలలో అన్ని ఏర్పాట్లూ ఎంతో బాగా ఉన్నాయి. క్షయదగ్గు మహాభయంకరమైన వ్యాధి అనీ, ఆరోగులు పీనుగులలాగ ఉంటారనీ అనుకొన్నాను కాని అక్కడున్న రోగులలో చాలామంది మంచి మనుష్యులలాగే కనబడ్డారు. శేషమ్మగారూ, ప్రయాగమ్మగారూ కూడా ఆరోగ్యంగానే కనిపించారు. కాని ప్రయాగమ్మగారు అతఃపూర్వపురాత్రే నెత్తురు కక్కుకొన్నదట. క్షయదగ్గు మహాతమాషా అయిన జబ్బు. ఆరోగ్యంగా ఉన్నట్లే ఉండి పుటిక్కున లాడు తెంచుతుంది. వాళ్లతో కబుర్లు చెబుతూ ఒంటిగంటదాకా గడిపాను. అక్కడినుంచి వాళ్లకు విశ్రాంతి సమయము. ఎవ్వరూ అక్కడ ఉంటానికి వీలులేదు. అంచేత నేను

వాళ్లతో చెప్పేసి ఊళ్లోకి వచ్చేసరికి మూడుగంటలైంది. హోటల్లో ఒక రకం భోజనం ఆరు అణాలనీ, మరో రకం పావలా అనీ చెప్పారు. ఇందులో రెండో రకం భోజనంతోనే తృప్తిపొందాను. బెజవాడ వైపు వెళ్లే రైలు ఒకటి నాలుగు గంటలకే ఉందని తెలిసింది. వెంటనే స్టేషనుకు వెళ్లి టిక్కెట్టు కొని, రైలులో చేయవలసిన ప్రయాణం అంతా చేసి పడవలసిన అవస్థలన్నీ పడి, ఆరోజు రాత్రికే ఇంటికి వెళ్లవలసినవాణ్ణి మర్నాడు పది గంటలకు కొంపచేరాను.

౨

బండి ఇంటిముందు ఆగటంతోటే చిన్నపిల్లలు ఇద్దరూ వచ్చి బండిదగ్గర నుంచున్నారు. పెద్దపిల్లలు ముగ్గురూ వీధి వాకిట్లో నుంచుని, "అమ్మా, నాన్నొచ్చారేవ్ " అని కేక వేశారు. నేను బండి దిగి ఇంట్లోకి అడుగు పెట్టగానే వంటఇంట్లోనుంచి మా ఆవిడ రావటం కనపడ్డది. "అప్పుడే వచ్చారేం? అమ్మాయి అత్తవారింటికి వెళ్లలేదా " అని రెండు ప్రశ్నలు నామీద విసిరి, నేను ఏమీ చెప్పకముందే బండివాడితో "బెడ్డింగు బండిలో ఉంది కాబోలు, తీసుకొని రావేమి అబ్బాయ్" అన్నది. "అయ్యగారు బెడ్డింగూ ఏమీ తేలేదండి" అంటూ వాడు బండి కిరాయి పుచ్చుకొని వెళ్లిపోయినాడు. కాంతం తెల్లబోయి నావంక జూచి, "బెడ్డిగు ఏమి చేశారు?" అని అడిగింది. ఊరికే మాటవరసను అల్లాంఅడిగిందే గాని, నేను ఆ బెడ్డింగు ఎక్కడో పారేసివచ్చానని ఆవిడగారు ముందుగానే నిశ్చయించుకొంది. నేనన్నానూ- "ఊరికే హడలిపోబోకు. బెడ్డింగు వెనకనుంచి వస్తూంది " అని. "ఎక్కడైనా వదిలివేసి వచ్చారా " అని మళ్లీ అడిగింది కొంచెం ఆశతో. నేను నవ్వి 'అవును' అని వంటింటివేపు నడిచాను. ఆవిడ సంగతి గ్రహించి "స్నానం చెయ్యండి" అంది. నేను వెంటనే స్నానం కానిచ్చి పిల్లలతో కలిసి భోజనం చేస్తున్నప్పుడు కాంతం మళ్లీ, "ఏమండీ, అమ్మాయిదగ్గరకు వెళ్లలేదేం" అన్నది. "ఏదో ప్రయాణం చేయలేకపోయినాను. రాజమండ్రినుంచి ఇల్లా యకాయకీని వచ్చేశాను. రెండురోజులుండి కాస్త బడలిక తీర్చుకొని వెడతాను" అన్నాను. "ఆ బెడ్డింగు బెజవాడలో పారేసి వచ్చారు కాబోలు " అంది. నేను నవ్వి ఊరుకొన్నాను. "శాలువా అవీ జాగ్రత్తగా ఉన్నవికదా " అని మళ్లీ అడిగింది- నాకు కోపం వస్తుందేమోనని కొద్దిగా భయపడుతూనే. "ఎందుకే హడలిపోతావు కాంతం? నే నేదన్నా తీసికెడితే మళ్లీ ఇంటికొస్తుందని నీకు నమ్మకం లేదన్నమాట!" అన్నాను. ఆవిడ ఆమాటమీద కాస్త నొచ్చుకుని "ఆ, అదిగాదండీ, ఊరికే అడిగాను. మరేం లేదు. నరేకానీండి, మీరు రాజమండ్రిలో ఎప్పుడు బయలుదేరారూ?" అని విషయాంమార్చింది. "చెప్పవలసిన సంగతులు చాలా ఉన్నాయి. భోజనం అయినతరువాత చెప్పతా"నంటూ పెరుగూఅన్నమూ తినేసి నేను ముందుగా వెళ్లి పడకకుర్చీలో కూలబడ్డాను. ఒక్కగంటసేపు కునుకుపట్టింది. అప్పటికి కాంతం వచ్చి తమలపాకులూ వక్కలూ నాముందు పెట్టి "ఆ, ఏమిటండీ సంగతులు" అంటూ చాపమీద కూర్చున్నది. నాదగ్గరనుంచి వెంటనే జబాబు రాకపోవటం కనిపెట్టి ప్రయాణం సంగతులు ఏమిటండీ ? ఎప్పుడు

బయలుదేరారు రాజమండ్రీలో" అని మళ్లీ అడిగింది.

"నిన్న నాలుగుగంటలకు గోదావరి స్టేషనులో రైలు ఎక్కాను."

"అయితే రాత్రి బెజవాడలో ఆగారన్న మాట. రంగయ్య అన్నయ్యఇంట్లో ఉన్నారా? మీాతమ్ముడింటి కెళ్లారా!"

"రంగయ్యఇంటికీ కాదు ... మాతమ్ము డింటికీ కాదు"

కాంతం తెల్లపోయి "అయితే హోటల్లో ఆగారన్నమాట. పక్కచుట్టకూడా ఆహోటల్లోనే పారేసివచ్చారా? " అని భయాన్ని కనపరిచింది.

"పీలు చిక్కితేనరి, నేను పారేసేననే అంటావు!"

"మరి హోటల్లో - పదిమంది వచ్చిపోయే చోట - నిక్షేపమంటి బెడ్డింగు - శాలువ కూడా ఉండేలందులో-వదిలేసివస్తారటండి?"

"పోట్లాటకు తయారై కూర్చోకూ. అసలు నేను హోటల్లో వదిలేసివచ్చానని ఎవరు చెప్పారూ."

"ఆఁ, అయితే ఎక్కడ తగలేశారూ!" అన్నది ఆవిడ భయమూ, విచారమూ సూచిస్తున్న గొంతుకతో.

"నీవు...ఎగిరిపడక..."

"నేను అనుకుంటూనేఉన్నాను."

"ఊరుకో ... ఊరుకో ... ఎక్కడికీ పోలేదు బెడ్డింగు. రెండురోజులలో వస్తుంది. కొన్ని కారణాలచేత ఒక స్నేహితునివద్ద వదలవలసి వచ్చింది." అని శాంతంగా జబాబు చెప్పాను.

"ఏమి టా కారణాలు ?"

"అదీ అడగవలసిన ప్రశ్న. అట్లా అడుగూ చెపుతాను" అని ప్రారంభించాను. "ఇక్కడనుంచి వెళ్లానా రాజమండ్రి ? మీా శేషమ్మను చూశాను."

"కులాసాగా ఉందా ?"

"ఆ—సుఖంగా ఉంది. నీవు ఆదుర్దా పడాల్సింది ఏమీా లేదు. చూచి ఆ రోజు-అంటే నిన్న సాయంత్రమే బయలుదేరాను."

"పనసపొట్టు కొనమంటిని గదండీ."

"కొనటానికి వీలులేకపోయింది."

"ఆ, నా బొంద, వీలులేకపోవటం ఏమిటి ? పిల్లలకు ఎంతో ఇష్టం. ఇక్కడ దొరుకుతుందా ఏమన్నానా ! చెప్పినమాట వినరాదా !"

"నీ మాట వినాల్సిరావటంచేతనే అది కొనలేదు."

"అదేమిటండీ ?—".

"చెపుతా ఏమిటో—చెప్పనిస్తేగా ?"

"ఊఁ........."

"నేను ఆసుపత్రి కెళ్లొచ్చేసరికి మూడు గంటలైంది. కొనాలంటే పనసపొట్టు ఊళ్లోకి పోవాలి. అల్లాగ వెడితే ఆపూటరైలుఅందేది కాదు. ఆ రాత్రి అక్కడుంటే పూటకూళ్లింటికి పావలా, పడుకోనేందుకు గదికి అద్దె అర్ధరూపాయి—ముప్పావలా దండుగ.అందుకని వెంటనే ఉన్న బండిలో రావటం గలిగింది."

"సరే. అల్లాగయినా రాత్రికి రావలసింది. ఈ పూట వచ్చారేం?—బెజవాడలో హోటల్లో తగలేశారు ! ఎక్కడైతేనేం ?"

"లేదు. బెజ వా డ వెళ్లనేలేదు."

"అయితే--ఎక్కడున్నట్లూ?" అన్నది ఆశ్చర్యంతో.

"ఆ సంగతే చెపుతాను. నీవు కొంచెం ఓపిగ్గా వినాలె."

"ఒక కథలాగ అన్నమాట."

"ఊ. అల్లాగే అనుకో" అన్నాను నేను.

"సరే కానివ్వండి." అన్నది ఆవిడ.

"రాజమండ్రి నుంచి బందరు రావటానికి రెండు మార్గా లున్నవి. బెజవాడ మీదుగా రావటం ఒకటీ, భీమవరం మీదుగా రావటం మరొకటీ."

"మీరు బెజవాడ మీదుగా రాలేదని చెపితిరిగా."

"బెజవాడ మీదుగా రాలే దన్నాను గాని భీమవరం మీదుగా వచ్చానని చెప్పానా ?"

"ఊఁహూ...ఇప్పుడు చెప్పండి."

"అదే భీమవరంమీదుగా వచ్చాను. ఆ రావటంలో..."

"నిడదవోలుమీదుగా వచ్చారు. అంతే గదూ. మీరు ఊరికే గాలి పోగుజేసుకొని కథ అల్లుకొస్తారు. వినేవాళ్లకు విసుగొస్తుంది. మీ కేం? ఇంతకూ ఆ బెడ్డింగు ఎవరింట్లో పడేసివచ్చారో చెపితే నేనెళ్లి కాస్త నడుము వాలుస్తా."

"సరే, నీ వింత తొందరపడుతున్నావు కాబట్టి రాజమండ్రినుంచి నిడదవోలుదాకా జరిగిన విశేషాలు వదిలేస్తున్నాను. అయితే ఒక్కటి. డబ్బు కలిసివస్తుందని రాజమండ్రి నుంచి నిడదవోలుకు ఓ టిక్కెట్టు కొనుక్కొని అక్కడినుంచి భీమవరానికి మరోటి కొన్నాను. ఎందుకో తెలుసునా? ఇది నయం. విడివిడిగా కొనటంవల్ల ఓ అరణాలు కలిసొస్తయి" అని ఆవిడవంక చూశాను నన్ను మెచ్చుకొంటుందని. ఆవిడ "ఊ, కానివ్వండి" అన్నది ఓమోస్తరు విసుగుతో, ఆవలించి చిటికవేస్తూ. "మరి శ్రమ అయినా ఇల్లాగ విడివిడిగా...టిక్కెట్టు పుచ్చుకొని రావటం-సొమ్ము దమ్మిడీకూడా అనవసరంగా పాడుచేయకపోవటం-చూశావా మరి ! !"

అన్నాను. ఆవిడ కొంచెం నవ్వి చాలా మంచిపని చేశారు" అని నొక్కి అన్నది. "అదే-ఆ కాస్త మాటకోసమే నేను పరితపిస్తున్నా" అని ఆమెబుగ్గను తర్జనితో తాకాను. 'ఊ' అని విసుక్కుంది. ముద్దుకు అలా అన్నా నన్నాను.

"ఇంకా ముద్దులూ ముక్కలూనూ!"

"ఏం!"

"పెద్దవాళ్ల మైపోవటంలే!"

"అల్లా అనకు. ఏముద్దు కాముద్దే! పడుచుదనపు మిసమిసలు ఎంత ముద్దో, ముసలితనపు ముడతలూ అంతే ముద్దు. వృద్ధాప్యంమటుకు ముద్దయిన కాలంగదూ"-

"అయితే కావచ్చు. మీరు ఈగొడవలోకి దిగక ఆపరుపుచుట్ట ఎక్కడ పారేసి వచ్చారో చెప్పండి."

"అదుగో పారేశారనే నీ వనుకోటం-!"

"నా అనుకోటంతో మీ కెందుకండీ—ఏవూళ్లో ఎవరింట్లో పడేసివచ్చారో చెప్పండి-నన్ను వేధించక."

"ఆసంగతి నన్ను చెప్పనిస్తేనా ? ఫలానిచోట దిగబెట్టి వచ్చానూ అంటే అక్కడికెందు కెళ్లారూ అంటావు. అందుకని నే చెప్పదలుచుకొన్న రీతిని చెప్పనియ్యి."

"అల్లా అయితే సరే—"అని దగ్గరలో నున్న పట్టెమంచం వాల్చుకొని పడుకొని - "ఇక మీఇష్టం" అన్నది. నేనూ ఒక్క సిగిరెట్టు వెలిగించాను.

3

"భీమవరం చేరానా...అక్కడే గొడవ జరిగింది. కిటికీదగ్గిర కెళ్లి అందరిలాగే టిక్కట్టు అడిగితే ఆయన ఇయ్యక, 'అటు తిరిగి రండి లోపలికి' అన్నాడు."

"ఎంచేతా?"

"అదే తమాషా. అందరికిమల్లే నాకూ ఒక టిక్కట్టు తీసి ఇస్తే, చెప్పే దేముంది? సరే లోపలికి వెళ్లాను. 'కూర్చోండి మాస్టారూ. ఈనలుగురినీ పంపించి మీతో మాట్లాడతానూ' అన్నాడు."

"ఇంతేగదా. వాడెవరో దరిద్రుడు మీ దగ్గర చదువుకొని ఉంటాడు."

"సరిగ్గా అంతే. నాకైతే జ్ఞాపకంలేదు. వాడు ఆనలుగురినీ పంపించి నాదగ్గర కొచ్చి క్షేమం అడిగి, టీ ఇప్పించి, ఎంతో గౌరవించాడు."

"సరే-మామూలే."

"అవునా, ఆపళంగా, బందరు కో టిక్కట్టు ఇయ్యమంటే ఇయ్యడే-"

"ఓహో—ఆరోజుకు...అదే ఆపూటకు వాళ్ల ఇంట్లో భోజనం చెయ్యమని ఖూర్చున్నాడు కామాలు."

"కాదు, కాదు. 'ఎకాయెకీని బందరు వద్దండి మాస్టారూ. కైకలూరుదాకా తీసికోండి. అక్కడినుంచి మళ్లీ ఇంకోటిక్కట్టు కొనండి. మీకు ఓపావలా కలిసొస్తుంది' అన్నాడు. 'వద్దుఓయ్—ఈ గొడవంతా నేను పడలేను. ఇప్పటికి పడ్డది చాలూ. బారు టిక్కట్టు ఇవ్వవయ్యా' అంటే-'అల్లా నేనెప్పటికీ ఇవ్వనండీ. రేపు ఎప్పుడైనా కనపడ్డప్పుడు పిన్నిగారు-'ఏమోయ్, నీకైనా తెలియదా? మాస్టారికి పావలా దండుగ బెట్టించావు' అంటే నే నేమనేది చెప్పండి?' అన్నాడు. 'అయితే...నీకు మాఆవిడకూడా తెలునన్నమాట' అనేసరికి ఆకుర్రాడు 'సారి! బాగుందండోయి మాస్టారూ. మీరు అంతా మరిచిపోయినా రన్నమాట. నేను మీరున్న ఇంట్లో వీథి గదిలో ఉండేవాణ్ని. మీకు కూరలూ అవీ నేనే తెచ్చేవాణ్ని. పండగ పండగకూ మీ ఇంట్లోనే భోంచేసేవాణ్ణి. నేను సుందరాన్నండీ మాస్టారూ' అన్నాడు. 'ఓయ్ నువ్వటోయ్' అని నేను వాడి వీపుమీద చరిచాను— అప్పటికి జ్ఞాపకంవచ్చినవాడిలాగ, నిజానికివాడెవరోఅప్పటికీ ఇప్పటికీనాకు జ్ఞాపకంరానేలేదు. అంతటితో వాడు ఊరుకోక 'పిన్నిగారు నాచేత కూరలూ అవీ తెప్పించేటప్పుడు ఒక్క దమ్మిడీ ఎక్కువ ఖర్చుచేస్తే కూకలేస్తుండేవారు. ఒకటండీ మాస్టారూ, మీరు చెప్పిన చదువువల్ల నాలుగు డబ్బులు సంపాదించటం నేర్చుకొంటే, వారు చెప్పిన చదువువల్ల నాలుగు రూపాయలు వెనకేసుకోటం నేర్చుకొన్నానండీ' అన్నాడు."

"ఎవరండీ ఆ అబ్బాయీ, అయినా సంవత్సరానికో కుర్రాడు, ఎవరో ఒకరు మన ఇంట్లో తిరుగుతూ ఉంటాడాయె. జ్ఞాపకం ఉండదు. అయినా మీకంటే వాడే నయం."

"సరే. టిక్కట్టు కైకలూరుకే తీసుకోక తప్పింది కాదు. ఆ కుర్రాడు నన్ను రై

తెక్కించి 'కైకలూరులో బండి చాలాసేపు ఆగుతుందండీ. మీరేమీ తొందరపడాల్సిన అగత్యంలేదు.' అని చెప్పి వెళ్లిపోయినాడు. దాని తరువాత..."

"అబ్బబ్బ! ఏదో కథలాగ ఎందుకండీ ఈగొడవంతానూ."

"కొంచెం ఓపిక పట్టు నువ్వూ."

"ఇంతకూ ఆ బెడ్డింగు కైకలూరులో ఎక్కడైనా వదలి వచ్చారా?"

"అవును. కైకలూరులో ఒకాయనకు ఇచ్చివచ్చాను."

"ఎందు కిచ్చారు?"

"అదే- ఆప్రశ్నకే నేను సమాధానం చెప్పాలె. తొందరపడితే ఎల్లాగ? కైకలూరులో దిగి టిక్కెట్టు కొంటానికి వెళ్లాను. కిటికీదగ్గర జనసమ్మర్దన ఎక్కువగా ఉంది. ఎట్లాగో తోసుకెళ్లి టిక్కెట్టుకొని పరుగెత్తు కొంటూ రైలుదగ్గరకు వచ్చేశాను."

"రైలు అందలేదు కామాలు."

"ఊఁ— రైలు అందకేం— చక్కగా అందింది. కాని తరవాత సిగరెట్టు కొనుక్కుందామని మనీపర్సుకోసం జేబులో చెయ్యి పెడుదును గదా..."

"ఊఁ" అన్నది కాంతం హడలిపోయి.

"పర్సు కాస్తా కనపడలేదు."

"అయ్యో, అయ్యో, పర్సు పారేశారుటండీ? నన్ను తగలెయ్య ... అయ్యయ్యో. మొర్రో వద్దని మొత్తుకొన్నా విన్నారు కారు. ఎంత ఉంది అందులో"

"ఇరవైరెండు రూపాయ లున్నయి"

"ఇరవైరెండు రూపాయలూ పోయినైటండీ? మాట్లాడ రేమండీ?... నన్ను తగలెయ్య...అట్లా చూస్తా రేమండీ ... పారేశారు కామాలు. అంతాపోయి నట్లేనా..." అంటూ తెల్లపోయింది కాంతం.

ఏం జెప్పేది? తెల్లమొఖం వేసి "పోయింది, అంతా ఊడ్చుకుపోయిం"దన్నాను. అంతాపోయిందండీ, అంతా పోయిందండీ" అని ఆవిడ కాసేపు విచారపడి, "ఎట్లా పోయిందండీ" అన్నది. "ఆ టిక్కెట్టు తీసు కొనే సందట్లో ఎవరో జేబులోనుంచి లాగేశారు"

"పక్కజేబులో పెట్టారుకామాలు. బనియను జేబులో పెట్టుకోకపోయినారుటండీ"

"అవును మరి. అట్లా జరిగింది. ఏం జేసేది? ఎన్నిసార్లు ప్రయాణం చేశాను కాను? ఇంతకూ ఆరోజున అల్లాగ దరిద్రం చుట్టుకొన్నది"

"ఎవరు కాజేశారో?"

"ఎవరు కాజేశారో తెలిస్తే వాడ్ని అక్కడే పాతేద్దును. తెలియలేదు"

"పరుగెత్తేటపుడు క్రింద ఏమైనా పడిపోయిందేమో వెదికారూ"

"పరుపులో ఏమైనా పెట్టి మరచిపోయినానేమోనని పరుపు అంతా ఖంగారుగా వెతుకుతుంటే అక్కడున్నవాళ్లు నాఆదుర్దా చూసి 'ఏమిటండీ' అని అడిగారు. నేను ఈవిషయం చెప్పాను. 'క్రింద ఏమైనా పడిపోయిందేమో వెదకండి. వెళ్లి పోలీసుకు రిపోర్టు అయినా ఇవ్వండి' అంటూ చెప్పారు"

"మరి వెతుక్కోకుంటండీ. నా ముఖం ఇంతమాత్రం తెలియు లేదండీ మీాకు"అన్నది. ఆవిడ.

"వెతకటానికి టైము ఏదీ? అప్పటి కప్పుడే రైలు కూసింది. ఇది వెదకటానికి వెడితే రైలు కాస్తా పోతుందని భయం వేసింది. అందుకని ఊరుకొన్నాను."

"అయితే ఇంతకూ పర్సుకోసం వెదకనే లేదన్నమాట."

"అఁహ, ఆపెట్టెలోవాళ్లంతా 'దిగి వెళ్లండి, వెతుక్కోండి' అని తొందర పెట్టారు."

"వెదుక్కోరుటండీ."

"అందుకనే - ఎట్లాగ ఈపరుపుచుట్ట కూడా దింపుకుందామా- ఒకవేళ రైలు ఉండదేమో అని ఆలోచిస్తూ ఉండంగానే, ఒకాయన 'మాస్టారూ, మీబెడ్డింగు నేను చూస్తూఉంటాను. మీరు వెళ్లి వెతుక్కోండి' అన్నాడు. నాకు ఇంకోనిమిషం ఆలోచనకు టైము లేకపోయింది.'ఇదే నాబెడ్డింగు.మీరు జాగ్రత్తచేయండి' అని చెప్పి తొందరగా చూచి మళ్లీ వద్దామని వెళ్లాను. అక్కడ ఎవ్వరూ మనుష్యులూ లేరు; పర్సూ లేదు. నరేనని తిరిగి పరుగెత్తుకుంటూ వచ్చేసరికి రైలు కదిలింది. ఎక్కలేకపోయినాను."

"బాగానే ఉంది. అక్కడ దిగబడి పోయినా రన్నమాట."

"అవును-మరి ఏం జేసేది? ఆపళంగా వెళ్లి స్టేషనుమాస్టరుతో చెపితే ఆయన - 'ఇక్కడ జేబుదొంగ లున్నారండీ ... రోజూ ఇల్లాంటి రిపోర్టులు వస్తూనే ఉన్నవి' అన్నాడు."

"ఏందరిద్రమండీ! పర్సు పర్సుపాళంగా ఎవరో కొట్టేశారు." అని కాంతం తను కని పెట్టిన విషయం చెప్పింది. నే నేమీ మాట్లాడ లేదు. మళ్లీ అన్నది కాంతం—"నేను అంత పైకం తీసికెళ్లవద్దండీ, నాముఖాన పారేసి వెళ్లండీ అంటే విన్నారూ? బిళ్లకుడుము లాగ ఇరవైరూపాయలూ వాడి ముఖాన పెట్టారు. ఎంత తెలివితక్కువండీ!"

నాకు 'వళ్లు మండిపోయింది. "నన్ను అనవసరంగా అంటావుగాని, ఇందులో నా తెలివితక్కువ ఏముందమ్మా కాంతం" అన్నాను.

కాంతం ముఖం చిట్లించి,"బారు టిక్కెట్టు కొంటే ఏఅవస్థ లేకపోయేది" అన్నది. అదీ నా తెలివితక్కువ అన్నట్లు.

"పావలాడబ్బులు కలిసొస్తయి అని గదూ నాగోల!"

"నాబాంద పావలా ఇవ్వ డేమైంది!"

"ఇల్లా అవుతుందని నేను అను కొన్నానా?" అన్నాను నేను జాలిగా.

కాంతం కూడా నా వంక జాలిగా చూసింది. ఆ చూపులో 'మీ తప్పు ఇం దులో ఏమీ లేదు. పాపం. 'అన్న మాటలు ఉన్నవి.

అల్లాగ ఒక క్షణం చూచి సాను భూతితో "ఏదోలెండి. ఇంతకూ బయలు దేరిన గడియ మంచిదిగాదు. "అని తృప్తి పరచుకొని చివరకు "ఇరవైరూపాయలు గదా-ఏం జేస్తాము. పోతేపోయినై లెండి. ఇబ్బంది పడకుండా వచ్చారా? ఆరాత్రి ఎక్కడున్నారూ? రావటానికి చేతులో డబ్బు ఉన్నదా ఏమైనా- పోయింది పోగా?" అంటూ నాలుగు ప్రశ్నలూ ఆదుర్దాగా అడిగింది.

"చేతులో ఆ టిక్కెట్టు ఒక్కటే— అది మారిస్తే మళ్లీ పావలా వచ్చింది."

"అయితే అవస్థ పడ్డారన్నమాట!"

"అవస్థ అంటే అవస్థా. నే నెప్పుడూ అంత అగచాట్లు పడలేదు."

"అయ్యో! ఆ రాత్రి తిండీ తిప్పలూ లేవు గాబోలు. ఎవరూ స్నేహితులు లేక పోయినారండీ?"

"ఒక శాష్ట్రుడు ఉన్నాడు."

"వెళ్లక పోయినారా ఆయనఇంటికి?"

"వెళ్లాను. ఆయనభార్య కడుపుతో ఉందట. కంటానికి పుట్టింటికి వెళ్లింది. ఆరోజు ఆదివారం కావటంచేత ఆయన కూడా వెళ్లాడు. ఇల్లు తాళం పెట్టి ఉంది."

"ఊఁహూ."

"అన్నీ అల్లాగ కలిసొచ్చినై."

"చాల్లెండి. ఇక ఊరుకోండి."

"ఊరుకోక ఏం జేసేదిలే!...నోరు నొక్కుకుని మరీ ఊరుకొన్నాను. చేతిలో ఉన్న పావలాలో ఒక బేడకు ఏవో అరటి పండ్లూ అవీ కొనుక్కొని తిని ఊరుకొన్నాను. ఇంతకూ ఆ రాత్రి హోటలులో బెంచిమీద పడుకొన్నాను."

"అయ్యయ్యో! ఎంత అవస్థ పడ్డారండీ. మిమ్మల నెప్పుడూ ఒంటిరిగా ప్రయాణం చేయనీయకూడదు. ఇదే చెపటం—వింటు న్నారా? ఇక్కడినుంచి మీరు ఎక్కడికి వెళ్లినా నన్ను తీసికెళ్లండి. మహా బాగుంది మీ అవస్థ...అయితే ఆ పర్సు పోవటం సంగతి నలుగురికీ చెప్పకపోయినారా? మీ రెందుకు చెపుతారూ? ఏం? చెప్పారా?"

"ఎందుకు చెప్పనూ? చెప్పాను"

"ఏమన్నారు?"

"ముందు నా దేవుళ్ళైందీ నా కేంపని అయిందీ, నా కెంతజీతం అయిందీ తెలుసుకొన్నారు. తెలుసుకొని 'ఏం పనయ్యా. నూరు రూపాయల జీతగాడివి! పావలాకోసం లోభించి స్టేషను స్టేషనులో దిగి టిక్కెట్టు పుచ్చుకొన్నా అంటావు' అని చీవాట్లు వేసి 'ఎవరు చెప్పారయ్యా నీ కీబుద్ధి!' అని అడిగారు. మా ఆవిడ చెప్పిందని అందా మనుకొని మళ్లీ ఊరుకొన్నాను నవ్విపోతారని. మర్నాడు ప్రొద్దున్నే గుడివాడకారు ఎక్కి గుడివాడలో ఒక మాష్టరుదగ్గర కావలసిన డబ్బు అప్పుపుచ్చుకొని ఆపళంగా రైలెక్కి వచ్చేశా" అని పూర్తిచేసి, మళ్లీ ఇంకోసిగిరెట్టు వెలిగించాను.

౪

"ఇంతకూ ఆబెడ్డింగుసంగ తేమైంది? అందులోపదిపదిహేనురూపాయల శాలువా, పదిరూపాయల బట్టలూ ఉన్నయిగదా. అది కూడా ఊరేగ లేదుగదా" అన్నది కాంతం ఒక్కక్షణం అయినతరువాత.

"నే చెప్పానుగా, ఒకాయన కిచ్చానని"

"చెప్పారు లెండి. ఆయన ఎవరో, ఏ పేటలో ఉంటాడో మీకు గట్టిగా తెలుసా"

"అసలు ఆయనది ఏవూరో కూడా తెలియదు. చూచిన ముఖం!!"

"నాబొంద మీరు చూడని ముఖం అంటూ ఉందిటండీ. ఆయనఎవరో, పేరేమిటో తెలుసుకోకుండా బెడ్డింగు ఎల్లా ఇచ్చారండీ"

"నేను ఇచ్చానా? ఆయన చూస్తూఉంటా నన్నాడు. నేను సరేనన్నాను. పేరూ ఊరూ అడగటానికి వ్యవధీ లేదూ, ఇంతకూ నాకు తోచనూ లేదూ - చెప్పద్దూ"

"ఎందుకు తోస్తుంది, అమ్మవారు నెత్తినెక్కి తొక్కుతుంటే — అయ్యో!

అయ్యో! పాతికరూపాయలూ పోసై పోయినై ఆమె. అమ్మాయికి ఇంకా చీర కొందా మనుకొంటున్నా. ఇంకేమి కొనేది? నేను నెత్తిన నోరెట్టుకుని మొత్తుకొన్నా-డబ్బు అంతా తీసికెళ్లబోకండీ అని నా మాట విన్నారూ?"

"పొరపాటేనే కాంతం- ఇక్కడనుంచి తప్పకుండా వింటాను చూస్తూండు."

"నాబొంద, ఇదివరకెన్ని సార్లు అన్నారు ఇల్లాగ! తీరా సమయు మొచ్చేసరికి ఎగిరి పడతారామె. సరే లెండి. ఏం అనుకొని ఏం లాభం! పోయిన సొమ్ము రాదుగదా —ఆ బెడ్డింగుకూడా ఎక్కడ పారేశొచ్చారో చెప్పండి — ఊరికే దాచక. దాన్నికూడా ఒక ఏడ్పు ఏడ్చి ఊరుకొంటాను."

"అప్పుడే తొందరపడివలసిన అవసరం లేదు. పోయిందని గట్టిగా ఇంకా చెప్పలేను. ఆ సంగతి గట్టిగా తెలిసినతరవాత ఇద్దరం కలిసి ఆ కాస్తపనీ చేద్దాము."

"చాల్లెండి. ఊరుకోండి. మీకు చీమ కుట్టినట్లయినా లేదు. పైగా వేళాకోళం ఏమిటండీ!! ఆ బెడ్డింగు సంగతి ఏమైనా కనుక్కోండి."

"మన మేమి కనుక్కోగల్గుం? ఆయన ఎవరో నాకు తెలియదామె. అయితే ఒకటి- ఆయన చాలా పెద్ద మనిషిలాగు కనుపించాడు. తప్పక పంపుతాడు. వస్తుంది. నా మాట నమ్ము."

"మీరు చెప్పిందల్లా నమ్మబట్టే ఈ స్థితికి వచ్చింది; సంసారం-" అని కాంతం ఈసడింపుగా మాట్లాడి లేచిపోయింది. అవతల నుంచి మాటలు వినిపిస్తున్నాయి. "ఖద్దరు బట్టలు ఇన్ని వద్దండీ అంటే, అది వెయ్యి ఇది వెయ్యి అని వేధించారు. ఇప్పుడు మళ్లీ కొనగలమా? ఈధరలలో ఎంత లేదన్నా యిరవై రూపాయల సొమ్ము!... ఆ శాలువ మటుకు శాలువ కొన్నప్పుడే పదిహేనురూపాయలు. అంతా యాభై రూపాయలసొమ్ము. తగలేసి వచ్చారు."

"ఆయాభైస్నీ — ఆ వాళ పాతిక మరిచిపోయినావు."

"నాబొంద! పైగా జ్ఞాపకం చేస్తారు కూడా. డెభ్భై అయిదు రూపాయల సొమ్ము పోయిందని ఏమన్నా- ఏంమనిషిబ్బా!... ఆఏడు కాఏడు పైపడ్డకొద్దీ ఎవరికైనా కాస్త జాగ్రత్త తెలుస్తుంది - నూరు రూపాయల సొమ్ము! ఉహూ" అంటూ నిట్టూర్పులు విడుస్తూ సాధిస్తూ కాంతం వంట ఇంట్లోకి వెళ్లి పోయింది.

నేను ఒంటరిగా కూర్చుని ఆలోచించాను ఆపెద్దమనిషి ఎవరై ఉంటాడా అని. సినిమాకథ నడుపుతూ పూర్వవృత్తాంతాన్ని దర్శకుడు చూపేరీతిగా జరిగిన ప్రయాణపు కథ అంతా ఒక్కసారి కళ్లముందుకు తెచ్చుకొన్నాను. ఆయన నాకు ప్రథమంలో నిడదవోలు స్టేషనులో కనిపించాడు-ఎల్లాంటి మనిషి? చామనచాయ—వెడల్పైన నుదురు-బట్టతల—ఆయనను మళ్లీ గుర్తించటానికి ఇవన్నీ సాయపడతైకదా అని సంతోషించి మరిచిపోకుండాఉంటానికి కాయితంమీద వ్రాసుకొన్నాను. ఆయనను గురించి నాకు ఎటువంటి అభిప్రాయం కలిగిందీ అని రెండో ప్రశ్న వేసుకున్నాను. నాకళ్లముందు ఆయన పర్‌ఫెక్ట్ జెంటిల్‌మెన్‌లాగ కనుపించాడు. నామనస్సును ఎన్నిసార్లు గ్రుచ్చిగ్రుచ్చి అడిగినా అదే సమాధానం వచ్చింది. దాంతో

నాకు మరీ ధైర్యం వచ్చింది పరువుచుట్ట తప్పక వస్తుందని. మూడో ప్రశ్న-ఆయన ఎవరై ఉంటాడు ? ఈ ప్రశ్నకు సరియైన సమాధానం రాలేదు. మొదట నాకు ఆయన నా విద్యార్థులలో ఒకడై ఉంటాడని తోచింది. విద్యార్థి అని ఎందు కనుకున్నానూ అంటే— ఆతరువాత నన్ను మాస్టారూ అని పిలిచాడు కాబట్టి. అయితే దానిమీద రెండు సందేహాలు బయలుదేరినై. మాస్టారూ అని పిలిచినంతమాత్రాన నావిద్యార్థి అనుకుంటానికి వీల్లేదు. ఇప్పుడు మాస్టారూ అని ప్రతివాణ్ణీ పిలుస్తారు. రెండోది-ఆయన నా విద్యార్థి అయితే నాకు నమస్కారం పెట్టడా అని. కొందరు విద్యార్థులు నమస్కారం పెట్టకుండా పోవటం కద్దుగాని అది ఉన్న ఊళ్లో సంగతి. ఇన్నాళ్లబట్టీ చూస్తున్నాను, పొ రు గూ రు లో నా వి ద్యా ర్థి కనపడితే, నమస్కారం పెట్టక పోయింది లేదు. చివరకు నాకు ఆయన నావిద్యార్థి కాదనీ, ఏదో ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగి అనీ తోచింది. చివ్వరకు వచ్చింది ఆయనది ఏవూరై ఉంటుందీ అన్నప్రశ్న. బెజవాడ, తెనాలి, గుంటూరు ఈ మూడుఊళ్లల్లోనూ నన్ను బాగా ఎరిగున్నవాళ్లు చాలామంది ఉన్నారు. కాబట్టి ఈ మూడుగ్రామాల లోనూ ఎక్కడో ఒకచోట ఆయనను కలుసుకోవచ్చునూ అని తోచింది. చాలా సంతోషం కలిగింది. పొరుగూరైతే, నేను ఈవూళ్లో ఉన్నా ననీ, ఫలానివీథిలో ఉన్నాననీ తెలియకపోవచ్చు. ఆపెద్దమనిషికి ఏ దురుద్దేశం లేకపోయినా, ఈభోగట్టా తెలియక పంపలేకపోవచ్చు. కాబట్టి ఈసంగతీ, నా అడ్రెస్సూ ఒక చిన్న ప్రకటనరూపంగా పత్రికలో వేయిస్తే తప్పకుండా లాభిస్తుందని నిశ్చయించుకొని చటుక్కున లేచి వెళ్లి, కాంతంతో చెప్పాను. ఆవిడ "ఊరికే వేస్తారా, ఏమైనా డబ్బు ఇవ్వాలా?" అంది. సుమారు ఓ అయిదారు రూపాయలు కర్చు అని చెప్పాను. ఆవిడ "చాల్లెండి. పైగా అదోదండగ ఎందుకు? ఇయ్యదలుచుకొన్నవాడు ఎల్లాగో కనుక్కొని ఇస్తాడు" అంది.

"ఏగుంటూరో అనుకో ఆయనది. ఆయన గుంటూరునుంచి పనివేళా ఈపరువు తీసుకొని నాలుగురూపాయలు కర్చుచేసుకొని బందరువచ్చి ఆపరువు నా కిచ్చి వెడతాడా?" అన్నాను.

"మీదంతా వెర్రిగోల. ఇక్కడికి రావాలా అండీ. మీకు ఉత్తరం వ్రాయకూడదూ? మీఅడ్రసు అసలు ఆయనకు తెలిసే ఉంటుంది. అంతగా తెలియకపోతే ఏ వెర్రివెధవను అడిగినా చెబుతాడు" అన్నది.

"వెర్రివెదవలు గుంటూరులో ఉన్నారంటావా ?"

"ఆ. అన్ని ఊళ్లల్లోనూఉంటారు!"

"సరే. అయితే ప్రకటన చేయ వద్దంటావు!"

"వద్దు, ఏమీ వద్దు, ఊరుకోండి. ఇప్పటికి రెండురోజు లైందిగదా. ఇంకా రెండు రోజులు చూద్దాము. వస్తుందా సరేసరి. రాదూ, పర్సుపోయినట్లే ఇదీ పోయిం దనుకొంటాను." అని ఆవిడకు తోచిన హితవు చెప్పింది. చెప్పి "మీదోగోల. పరువుచుట్ట వస్తుందన్నమాట పట్టిభ్రమ." అని తేల్చి చెప్పేసింది చచ్చులేకుండా.

"నాకుమటుకు పరుపుచుట్ట వస్తుందని ఘట్టి నమ్మకం" అన్నాను. చూద్దాంగా అని ఊరుకొంది కాంతం.

ఆతరువాత నేను బట్టలు వేసుకొని బజారు కెళ్లాను కాఫీ త్రాగటానికి. వీథిలో నడుస్తున్నా, కాఫీహోటల్లో కాఫీ త్రాగు తున్నా నాకళ్లు నాలుగువైపులా తిరుగు తున్నై బట్టతలపెద్దమనిషి ఎవ్వరైనా కని పిస్తారేమోనని. కళ్లు పీక్కుపొయ్యేటట్లు చూచినా ఒక బట్టతలా కనపడలేదు. కుండు చుట్టూ తిరిగాను ముమ్మారు. ప్రయోజనం లేకపోయింది. ఒక్కబట్టతలమనిషి కనిపిస్తే బాగుండు ననిపించింది.

ఇంతలో ప్రొద్దుగ్రుంకింది. ఇక లాభం లేదని ఇంటి కెళ్లాను ... ఆరాత్రిరాత్రల్లా కాంతం కాసేపు యాభైరూపాయల సొమ్ము పోయిందనీ, కాసేపువందరూపాయల సొమ్ము పోయిందనీ గోలపెడుతూనే ఉంది.

తెల్లవారింది. పిల్లలంతా లేచారు. కాంతం కాఫీ కాస్తున్నది. ఆమెముఖంలో వెదికిచూచినా సంతోషరేఖలు లేవు. ఇంతలో వాకిట్లో ఆడుకొంటున్న పిల్లలు గొల్లున కేకేశారు పెంకులు లేచిపోయేటట్లు. ఏమిటా అని హడిలిపోయి కాంతం ఒక్క గంతేసింది వీథిగుమ్మంలోకి. నేనూ వెనకాలే పరుగెత్తాను. ఏముంది? పరుపుచుట్ట ఒకటి పడేసుంది అక్కడ. ఉప్పరి "బాబూ, కూలి ఆరే ఇచ్చారండి. ఇదిగోనండి చీటీ" అని ఇచ్చింది. పరుపుచుట్ట నాదే! ఆచీటీలో ఏమీ లేదు. నాపేరూ, వీథిపేరూ ఉంది- అంతే.

"ఎవరిచ్చారే ఇది" అనిఅడిగాను నేను. "ఆయన ఎవరో నే నెరగనండి. ఈ పరుపు చుట్ట కార్లకాడ నా కిచ్చి మీ ఇంటికాడ ఇయ్యమన్నారండి. ఆ చీటీ ప్రకారం మీ ఇల్లు కనుక్కున్నానండి." అని అది వెళ్లి పోతుంటే—"ఆయన ఎట్లా ఉంటాడే ఉప్పరీ? ఆయనకు బట్టతల ఉందా" అని అడిగాను. "నాకు తెల్దండీ" అని కేకేసి అది గబగబ వెళ్లిపోయింది.

మేము మొదట కాసేపు తెల్లపోయి, తేరుకుని సంతోషించాము. నిజంగా పోయిన వస్తువ దొరికినప్పుడు ఉన్న ఆనందం మహా గొప్పది. "నే జెప్పలేదూ కాంతం, ఎక్కడికీ పోదు—వస్తుందనీ" అన్నాను నేను గర్వంగా. "ఎవరో ఆయన పెద్దమనిషే." అని మెచ్చు కొంది కాంతం. "ఇంతకూ ఆయన ఎవ రైందీ తెలియలేదుగదా" అన్నాను. "ఏదో తమాషాగానే ఉంది. ఈ కాలంలో యాభై రూపాయల సొమ్ము దొరికితే వద్దని ఇచ్చేసే వాడు ఉన్నాడండీ. పెద్దమనిషి. అయితే మటుకు నాకు మాత్రము నమ్మకం కల గటం లేదండీ" అని అని, ఏదో మనస్సుకు హఠాత్తుగా తట్టినదానిలాగ ఉలిక్కిపడి - "నన్నుతమాషాచేయటానికి ఏదైనా నాటకం ఆడారా"అన్నది.

"ఛా, ఏం నాటకం?"

"ఏముందీ-యిది ఈవూళ్లోనే ఎవరింటి లోనో పెట్టి రెండురోజులైనాక పంపమని చెప్పిఉండకూడదూ."

"ఛాఛా, ఎందుకూ అల్లా చెయ్యటం? అల్లా చేస్తే నా కేం ఒరుగుతుందీ?"

"ఊఁ, న న్నేడిపించటానికీ."

"ఎబ్బె... నేనుమటుకు లోపల ఎంత ఇదౌతున్నాను ఇంతసొమ్ము పోయిందే అని- పైకి అల్లా ఉన్నానుగాని."

"కాదులెండి. మీరు మొట్ట మొదటినుంచి చెపుతూనేఉన్నారూ — బెడ్డింగు వస్తుంది బెడ్డింగు వస్తుందీ అని. ఏమిటా ఇల్లా అంటారూ అని నేను సందేహిస్తూనేఉన్నా' దొంగనాటకం ఆడారన్నమాట" అన్నది.

"ఇదేంమాట కాంతం, నన్ను అల్లాగ అన్యాయంగా అంటావు. ఛీ! అల్లాగ ఎప్పటికీ చెయ్యలేదు. ఆయనకు నేను ఫలానా అని తెలిసిఉంటుంది. పంపాడు" అని సిన్సియర్‌గా చెప్పాను. కాంతం నమ్మీనమ్మని స్థితిలో ఉంది.

ఇంతలో చిన్నపిల్ల బెడ్డింగు విప్పు తున్నది. విప్పి ఆబట్టలన్నీ అటూ యిటూ పడేస్తుందని "అమ్మా, ఇప్పుడు అది విప్పక, ఆనక్కు చూద్దాం" అన్నాను.

"విప్పనియ్యండి. బట్టలన్నీ ఉన్నయ్యో మో చూద్దాము" అన్నది ఆవిడ. అందులో ఏమైనా తినే వస్తువ ఉందేమోనని వాళ్లు చూస్తున్నారు. అమ్మకూడా విప్పమనటం మూలాన వాళ్లునలుగురూ చేరి, "వద్దే తల్లీ, ఇప్పుడెందుకే" అంటూనేఉన్నా వినక తాళ్లూ అవీ దేని కవి ఊడదీశారు. అందులో ఒక మిఠాయిపొట్లం ఉంటే చిన్నపిల్ల లిద్దరూ డేగల్లాగ తన్నుకుపోయారు. ఈపొట్లం ఎక్కడిదా, నే నటువంటి దేమీ పెట్టలేదే అని ఆలోచిస్తున్నాను. మరిచిపోయి పెట్ట టానికైనా వీలులేదు. ఎందుకంటే నేనసలు ఎక్కడా కొన్నపాపాన పోలేదు.

ఇంతలో చిన్నమ్మాయి, "యిదెక్కడిది నాన్నా? అక్కయ్యకు కొన్నావా" అంటూ ఒక చీర పైకి ఎత్తింది. "పట్టురవిక యిదిగోనే అమ్మా" అని పాప రవికను పరుపుచుట్టలోనుంచి పైకి లాగింది.

నేను ఏమి టీవిచిత్రం అంటూ తెల్ల పోయి చూస్తున్నాను. ఆవిడ ముఖం ఎందుచేతనో కందగడ్డ అయిపోతున్నది. "మిగతా బట్టలు చూపు" అన్నది చిన్నదాంతో. అది ఒక్కొక్కటే ఎత్తి చూపింది. అన్నీ నాబట్టలే! అన్నీ ఉన్నాయి!

కాంతం ఏమనుమానపడ్డదో ఏమో మరి నిప్పులు గ్రక్కుతూ తోకత్రొక్కిన పాము లాగ చివ్వున లేచి "ఏమిటండీ?—చీర ఎవరి దండీ? ఎట్లా వచ్చింది ఇది మీపరుపుచుట్ట లోకి ? మాట్లాడ రేం?" అంటూ చురచురా చూచింది. నేను ఏమీ చెప్పలేక కళ్లు అప్ప గించి ఊరుకొన్నాను.

కాంతం కత్తులూ, కటారులూ చూపుల్లో విసరుతూ "ఇంత నాటకం ఆడతారు టండీ-నన్ను పిచ్చిదాన్ని చేసి!" అని కొర కొర చూచింది.

"ఇదేమిటో చిత్రంగానే ఉంది" అన్నాను నేను.

"చిత్రంగా ఉండదూ! ఎట్లా వచ్చింది ఇది మీ బెడ్డింగులోకి?" అని అడిగింది ఆవిడగారు.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను" అన్నాను.

"ఆలోచిస్తారు! ఆలోచించరూ మరి! సంగనాచిలాగ చూడబోకండి. ఏమిటో అసలుసంగతి చెప్పండి" అన్నది. నే నేమీ చెప్పలేకపోయినాను. కాంతం నన్ను అనుమానిస్తున్న దని నేను గ్రహించాను. కాని ఏమి చెప్పినా నమ్మించలేను. అందుకని "రామ, రామ! నే నేమీ ఎరగను" అని ఇంత అపనింద పైబడ్డందుకు సిగ్గుపడి దిగులుతో లోపలికి వెళ్లిపోయి పరుపుమీద

బాక్కు బోర్లా పడుకొన్నాను. రెండు నిమిషా లైందో లేదో ఎవరో వీథిగుమ్మంలోకి వచ్చి నట్లు చప్పుడైంది. "మాస్టరుగారు ఉన్నా రాండి"అన్నారు ఎవరో. "ఆ, ఉన్నా" రన్నది కాంతం. "మరేమీ లేదండీ. యిదుగో యిక్కడే ఉంది ఈపరుపుచుట్ట! నాకు కైకలూరుస్టేషనులో మాస్టారు ఈ పరుపుచుట్ట యిచ్చి ఆయన దిగబడిపోయి నారు. నేను గుడివాడలో దిగానులెండి. దిగి మాఅమ్మాయిగారింట్లో రెండురోజు లుండి యివ్వాళే అమ్మాయిని వెంటబెట్టు కొని వచ్చాను కారుమీాద. ఈపరుపుచుట్ట నాదే అనుకొని యిందులో చీర ఒకటి పెట్టిందట మా అమ్మాయి. యిప్పుడే చెప్పింది. తీసుకెడదా మని వచ్చానండి" అన్నాడు ఆ వచ్చిన పెద్దమనిషి.

"ఇదుగోనండి మీాచీర. ఎక్కడిదా అని నేనూ చూస్తున్నాను. ఇవ్వవే అమ్మాయి" అని కాంతం అనటం వినిపించింది. "నాన్నను పిలు అమ్మా" అని కూడా అన్నది. అమ్మాయి వచ్చి నన్ను పిలిచింది. నేను వెళ్లి ఆయన్ను గుర్తించిపరుపుచుట్ట జాగ్రత్తగా పంపినందుకు నమస్కరించాను. ఆయన "మాస్టారూ, క్షమించాలండీ. పాపం ఈ రెండు రోజులూ మీారు పరుపుచుట్టకోసం ఆదుర్దా పడిఉండాలె!" అన్నాడు. నేను "ఏమీా ఆదుర్దాపడలేదండి. ఎక్కడికి పోతుంది" అన్నాను. "గుడివాడలో మా అమ్మాయిగారింటి కెళ్లాను. అక్కడ రెండు రోజు లుండాల్సివచ్చింది" అంటూ మళ్లీ నాకు ఆకథ అంతా చెప్పి సెలవు పుచ్చుకొని వెళ్లిపోయినాడు.

నన్ను కాంతం అనవసరంగా అనుమానించినందుకు నాకు వళ్లు మండిపోతున్నది. అందుచేత నేను ఆమెవైపు అన్నా చూడకుండా గబగబా వెళ్లిపోయి మళ్లీ ప్రక్కమీాద పడుకొన్నాను. పది నిమిషాలు గడిచింది. గాజుల చప్పుడైంది. నేను గిరుక్కున అటు తిరిగాను. ఆవిడ వచ్చి ప్రేమ ఫుట్టిపడే కంఠంతో "కాఫీ యిస్తాను రండి" అంది. నేను మాట్లాడలేదు. ఆమెవంకైనా చూడలేదు. ఆమె నా బుజాలు పట్టుకొని తిప్పటానికి ప్రయత్నిస్తూ "రండీ! పిల్లలుకూడా కాఫీ త్రాగకుండా కూర్చున్నారు మీాకోసం" అన్నది. "నన్ను అన్యాయంగా అనుమానించావుగా నీవు" అన్నాను నేను రుద్ధకంఠంతో. అని పసిపిల్లవాడిలాగ ముడుచుకొని పడుకొన్నాను. నాచెక్కిళ్లు నొక్కుతూ "మనస్సు పాపిష్టిదండీ. ఆడదాని మనస్సు వట్టి పాపిష్టిది. ఏమిటో వెధవ ఆడపుటక!" అంటూ కాఫీ కప్పు నాకు అందించింది మా కాంతం.

# రాజరాజనరేంద్రుని కలిదిండితామ్రశాసనము

= శ్రీ నేలటూరి వెంకటరమణయ్య =

●

(గత సంచిక తరువాయి)

పట్టాభిషేకమునకు (శ. ౯౪౪) కొన్నియేండ్లకు ముందే రాజరాజనరేంద్రుని యేలుబడి యారంభమాయె నని చెప్పుటకు గొంత యాధారము గలదు. ఇతడు నలువదియొక సంవత్సరములు సంపూర్ణముగ రాజ్యపాలన మొనర్చిన పిమ్మట నితని పదచ్యుతుని గావించి సింహాసన మధిష్ఠించిన వాడగు నితని సవతి తమ్ముని- సప్తమవిజయాదిత్యుని పుత్రుడగు విమ్మడిశక్తివర్మ శ. ౯౮౩ తులా. శు ౨ గురువారమునాడు అనూరాధాయుక్తకుంభలగ్నమున బట్టాభిషిక్తు డాయెను.[1] ఇందువల్ల శ ౯౮౩ నకు ముందు రాజరాజనరేంద్రుడు సంపూర్ణముగ నలువదియొక్క సంవత్సరములు వేంగి నేలినట్లు తెల్లమగు చున్నది. రాజరాజనరేంద్రుని శాసన మొకటి యతని నలువదియొకటవ రాజ్యవర్షమున చెక్కినది దీని సత్యమును ఋజువుపఱచుచున్నది.[2] శ. ౯౮౩ లో నతడు రాజ్యపాలన చేసిన ౪౧ సంవత్సరములు దీసివేయగా నతడు శ. ౯౪౨ లో రాజ్యపాలన నారంభించె నని తేలుచున్నది. ఇంతే కాదు. రాజరాజనరేంద్రుని శిలాశాసనములు కొన్ని పైవిషయము నే వ్యక్తపఱచుచున్నవి. ఇవి శకాబ్దములతో పాటు రాజ్యవర్షములను దెల్పుచుండుటచేత రాజ్యారంభకాలమును గనుగొనుట కనువుపడుచున్నవి. ద్రాక్షారామ భీమేశ్వరాలయమునందలి యాగ్రాణములో నుండు నొక చాపతాయిమీద సర్వలోకాశ్రయవిష్ణువర్ధన మహారాజను నామాంతరము గల రాజరాజదేవుని శాసనము శ. ౯౬౮ నకు సరియగు ౨౬-వ రాజ్యవర్షమున వ్రాయించిన దొకటి కలదు.[3] శ. ౯౮౦-వ సంవత్సరమునకు సరియైన ౩౮-వ రాజ్యవర్షమున వేయించిన శాసన మింకొకటి గుంటూరుమండలములోని తెనాలితాలూకాకు జెందిన నందివెలుగుగ్రామములోని శివాలయముకప్పుమీద గానవచ్చుచున్నది.[4] మఱియొకటి శ. ౯౮౩ ప్లవసంవత్సరమునకు సరియైన సర్వలోకాశ్రయ విష్ణువర్ధనమహారాజుగారి ౪౧-వ రాజ్యవర్షమున జెక్కించినది పైతాలూకాలోని వలివేరు గ్రామమందలి శివాలయమున కెదుట బడియున్న బండపై నున్నది.[5] ఈశాసనములు రాజరాజనరేంద్రుని పరిపాలన భిన్నకాలముల నారంభమైనట్లు సూచించుచున్నవి.

ఈపట్టికయందు బొందుపఱచిన శాసనములవల్ల రాజరాజనరేంద్రుని పరిపాలనము భిన్నకాలముల

---

1. ఆంధ్రచారిత్రకపరిశోధన సంఘపత్రిక, సం. ౫, పుట ౪౪.
2. ARE 671 of 1920.
3. ARE 183 of 1893, SII.IV. No.1008.
4. ARE 663 of 1920.
5. ARE 671 of 1920.

| శాసనసంఖ్య | శకాబ్దము | రాజ్య వర్షము | రాజ్యారంభ కాలము |
|---|---|---|---|
| 188 of 1893 | ౯౬౯ | ౨౬ | ౯౪౩ |
| 668 of 1920 | ౯౮౦ | ౩౭ | ౯౪౩ |
| 671 of 1920 | ౯౮౩ | ౪౧ | ౯౪౨ |

యందు రెండు పర్యాయము లారంభమైనట్లు తెలియవచ్చుచున్నది. పరిపాలన భిన్నకాలముల ప్రారంభమగుట యెట్లు పొసగును, ఇచట గానవచ్చు వ్యత్యాసమె ట్లేర్పడినది యను నీయంశములు విచారణీయములు. శాసనముల కాలమును దెల్పునపుడు కొన్ని యెడల గతాబ్దమును, మఱికొన్ని యెడల వర్తమానాబ్దమును నమూదు సేయు నాచారము ప్రాచీనకాలమున వాడుకలో నుండెను. రాజరాజనరేంద్రుని పాలన రెండు భిన్నకాలములయందు ప్రారంభమాయె నని తలచుటకంటె నీయాచారముచొప్పున పైశాసనముల గానవచ్చు శకాబ్దములు కొన్ని గతములనియును, మఱి కొన్ని వర్తమానములనియు నూహించుట లెస్స. ఈ శకాబ్దము లన్నియు గతములో, వర్తమానములో నిర్ధరించి చెప్పుటకు దగిన సామగ్రి లేదు. కాని కడపట జేర్కొనబడిన శాసనమున (671 of 1920) శకాబ్దము (౯౮౩) ప్రభవాది షష్ట్యబ్దముల లోని ప్లవనామ సంవత్సరముతో జోడింపబడియుండుటచేత నది గతాబ్దమని నిశ్చయముగ జెప్పవచ్చును.6 తక్కిన రెంటివిషయమై నిశ్చయించి చెప్పుటకు సాధ్యము గాకున్నను రాజ్యారంభకాలవ్యత్యయమును దొలగించుటకై యందు జెప్పబడిన శకాబ్దములు వర్తమానాబ్దము లని గ్రహించుట యుక్తము. ఇట్లు సేయుట సమంజసమైనచో వీనిలోని శకాబ్దములనుగూడ గతాబ్దములుగ మార్చి యందు మూలమున రాజ్య ప్రారంభకాలము నిర్ణయింపవలసియుండును.

| శాసన సంఖ్య | శకాబ్దము | రాజ్య వర్షము | రాజ్యారంభ కాలము |
|---|---|---|---|
| 188 of 1892 | ౯౬౮ | ౨౬ | ౯౪౨ |
| 668 of 1920 | ౯౭౯ | ౩౭ | ౯౪౨ |
| 671 of 1920 | ౯౮౩ | ౪౧ | ౯౪౨ |

ఇట్లు పైమూడుశాసనములలోని శకాబ్దములను గతాబ్దములుగ బరిగణించగా రాజరాజనరేంద్రుని పాలన శ. ౯౪౨ వ ప్రారంభమాయె నని తేలుచున్నది. ఇది రెండవ శక్తివర్మయొక్క ఆంధ్రసాహిత్యపరిషత్తామ్రశాసనమున సూచింపబడిన రాజరాజనరేంద్రుని రాజ్యారంభకాలమునకు సరిపోవుచున్నది. 7 కాని పై సిద్ధాంతమునకు వ్యతిరిక్తమగు శాసనము మఱియొకటి కలదు. ఏడవవిజయాదిత్యునిపాములవాక తామ్రశాసనము, విమలాదిత్యునియనంతర మతని పుత్రుడగు రాజరాజు పండ్రెండేండ్లు రాజ్యపాలనము నొనర్చె ననియు, దరువాత విమలాదిత్యుని కుమారుడును, రాజరాజునకు ద్వైమాతురుడును నగు విజయాదిత్యు డాతని వెడల నడచి రాజ్యము నాక్రమించుకొని శకము ౯౫౨-వ సంవత్సర కర్కటశుద్ధ ౫ అదితిసుత దినమున నుత్తరాఫల్గునీనక్షత్రముతో గూడిన కన్యాలగ్నమున బట్టాభిషేకము గావించుకొనె ననియు దెల్పుచున్నది. 8 ఈ

6. ఇండి. ఎఫిమెరిస్ సం ౩, పుట ౧౨౪

7. ఆంధ్రచారిత్రకైతిహాసక సంఘపత్రిక, సం. ౫, పుట ౪౯.

8. ఆంధ్రచారిత్రకైతిహాసపంశోధక సంఘ పత్రిక, సం. ౨, పుట ౨౮౪.

తస్య ముమ్మడిభీమస్య
సుతః కృతమతి ర్మహాన్
రాజరాజాహ్వయో రాజా
ద్వాదశాబ్దా న్ధరాం మహాత్॥
తం రాజరాజనృపతిం
నిర్ధాట్య భువః ప్రసహ్య విజయాదిత్యః
విమలాదిత్యతనూజో
తస్య ద్వైమాతురోగ్రహీ ద్రాజ్యమ్॥
శ్రీమాన్ శాకే సమూహే ద్విగిషునిధిమితే
కర్కటగే కర్కటాంశే
శుద్ధాత్మా శుద్ధపంచమ్యదితిసుతదినే
సూర్యగే శౌర్యశాలీ

పాములవాక శాసనమున చెప్పినట్లు శ. ౯౫౨ కు ముందు పండ్రెండు సంవత్సరములు రాజరాజనరేంద్రుడు రాజ్యము చేసినది నిక్కమైనచో నతడు శ. (౯౫౨-౧౨=)౯౪౦-వ సంవత్సరమున రాజ్యపాలన మొనర్చ నారంభించి యుండవలయును. శ. ౯౪౦ సింహమాసమువఱకు విమలాదిత్యుడు ప్రభుత్వము సేయుచుండినట్లు రణస్తిపూండిశాసనమువల్ల విదితమగుచుండుటచేత రాజరాజనరేంద్రుడు తండ్రి గతించిన వెంటనే రాజ్యము సేయదొడగనని చెప్పవలసియున్నది. లబ్ధమైన శాసనాధారముల కిట్లొండొంటితో బొందు కుదురకపోవుటచే రాజరాజనరేంద్రుని రాజ్యారంభకాలమును సూక్ష్మముగ నిర్ణయించుటకు సాధ్యము కాకున్నది. కాని యతడు దన పట్టాభిషేకమునకు ముందు రెండుమూడేండ్లనుండియు ప్రభుత్వము సేయుచుండెనని స్పష్టముగ దెలియుచున్నది.

పైన పేర్కొనిన శాసనములు సూచించునట్లు రాజరాజనరేంద్రుడు శ. ౯౪౦ లోనో, లేక శ. ౯౪౨ వనో ప్రభుత్వము సేయ నారంభించినచో, నతడు వెంటనే పట్టాభిషేకము చేసికొనక శ. ౯౪౪ పర్యంతము వేచియుండుటకు గారణ మేద్దియేనియు నుండవలయును. పూర్వచాళుక్యశాసనముల మూలమున దీని దెలిసికొనుటకు సాధ్యము గాకపోయినను, సమకాలిక చోళశాసనములవల్ల వేంగిదేశమునవప్పుడంతఃకలహముల మూలమున గొంత యలజడి కలిగినట్లు దెలియవచ్చుచున్నది.

అనంతపురమండలములోని మడకశిరతాలూకాకు జెందిన కొత్తశివర మను గ్రామమునందలి యాంజనేయస్వామి దేవాలయమున చోళచక్రవర్తి మొదటి రాజేంద్రచోళదేవుని కాలపు శాసనములు రెండుకలవు. ఇందొకటి రాజేంద్రచోళదేవుని దశమరాజ్యవర్షమున (అనగా శ. ౯౪౩ = క్రీ. శ ౧౦౨౧) వేయించినది. ఇందు రాజేంద్రచోళదేవుని సైన్యాధిపతియు, దిరుమూరునాటిలోని చాత్తమంగళపాలకుడును నగు విక్రమచోళచోళియవరియ మను బిరుదాంకితుడైన అరైయం రాజరాజ మను నతడు మంటపము నొకదాని గట్టించెనని చెప్పియున్నది. ఇతనికి నాల్మడి(లేక నాన్మడి) భీమ, చోళనచక్ర, సామంతాభరణ యను బిరుదనామములు గలవు. 9ఇంకొకదానియందు వీరభీమ, రాజకేసర్ నక్కాలన్, సామంతాభరణన్ అను బిరుదులు పేర్కొన

---

కన్యాలగ్నే తిథౌ శ్రేష్ఠే శశికులతిలకో
రాజమార్తాణ్డసూను
ర్వేంగీసామ్రాజ్యపట్టం పక్ష వసాతి విజయా
దిత్యభూపః ప్రతాపీ॥

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు పంతులుగారీ శ్లోకోక్తవిజయాదిత్యపట్టాభిషేక కాలము శకసంవత్ ౯౫౨ క కర్కాటక కృష్ణ ౫ బృహస్పతివార, హస్తానక్షత్ర కన్యాలగ్నమని గ్రహించి యాంగ్లకాలమానమున నది క్రీ. శ. ౧౦౩౦ జూలై తే౯ది బృహస్పతివారమునకు సరియగు నని గుణించి చెప్పియున్నారు. కాని యిది యంగీకార్యము గాదు. సూర్య భే యనగా హస్తానక్షత్రమనియు, నదితి సుత దిన మనగా బృహస్పతివార మనియు వీరభిప్రాయపడిరి. ఈశ్లోకమును కలకత్తా ఇంపీరియల్ లైబ్రరీ ప్రధానాధికారవర్గములో నొక్కరగు మిత్రులు శ్రీ కే. జీ. శంకర్ ఎం. ఏ. గారి కంపగా వారిందలి కాలము నిట్లు గుణించి, ౧౧-౧౧-౧౯౪౧ నా డొక జాబు మూలమున నిట్లు తెలిపిరి:

శ. కద్రుగిషునిధిమితే = శ ౯౫౨ = క్రీ. శ. ౧౦౩౦-౩౧
కర్కటగే = కర్కాటకాం శా = కరకములో సూర్యుడు
(జూన్-జూలై)

| | |
|---|---|
| శుద్ధపంచమి | = శు ౫. |
| అదితిసుతదినే | = ఆదిత్యవారము |
| సూర్య భే | = ఉత్తరఫల్గునీ (ఆర్యమాన్) లేక పూర్వఫల్గునీ (భగ) |
| కన్యాలగ్నే | = కన్యాలగ్నము. పూర్వాహ్ణము ౧౦ మొదలు ౧౨ గంటలవఱకు. |

ఈయంశము లన్నియు క్రీ. శ. ౧౦౩౧ జూలై ౨౬ తేది ఆదివారమునకు చక్కగ సరిపోవుచున్నవి. ఆదినమున శుద్ధపంచమి తిథి ౭౬ కు ముగిసినది; .౪౭ లకు పూర్వఫల్గుని యంతమంది యుత్తరఫల్గుని యారంభమాయెను. పూర్వాహ్ణము ౧౦-౧౨ గంటల మధ్య తిథి శుక్ల ౫, నక్షత్రము పూర్వఫల్గుని.

9. ARE 23 of 1917.

బడినది.10 మఱియు గొత్తశివర పాతశివర గ్రామముల మధ్యమున నుండు నొక శివాలయమున రెండు శాసనములు గానవచ్చుచున్నవి. ఒకటి పైజెప్పిన వాన్మశి పీము(భీము)ని తెలుగువారిని పేర్కొనుచున్నది. ఇతనికి జయసింఘకులకాల, సామన్తశత్రుప్రహారి యను బిరుదులు గలవు 11 రెండవది యహితరొట్టిశివ యను బిరుదాంకితుడగు నీతడు కళింగ ఒడ్డ తెలుంగులతో జేసిన యుద్ధమును వర్ణించుచున్నది.12 ఇవి కాక మడికశిర గ్రామమునంలి వేణుగోపాలస్వామియాలయములో మంటపమున మఱి రెండు శాసనములు గానవచ్చుచున్నవి. వీనియం దొకటి మొదటి రాజేంద్రచోళచక్రవర్తిదశమ రాజ్యవర్షము నాటిది. తిరుమూరు నాటికి జెందిన శాత్తమంగళాధిపతియు, రాజేంద్రచోళదేవుని చమూనాథుడును నగు విక్రమసోళ సోఴియవరియ నను నామాంతరము గల అరియన్ రాజరాజ ననునతడిందు పేర్కొనబడియున్నాడు. ఇతనికి రెుదిత్తాన కాలన్, సామంతకేసరి యను బిరుదులు గలవు.13 రెండవది రాజేంద్రచోళదేవుడు దన చమూపతియగు సోఴియవరన ననునతనికి వేంగిదేశముపై నెత్తిపోయి యాదేశమును స్వాధీనపఱచుకొమ్మని యాజ్ఞజేసెననియు, నావార్తవిని సోకినంతనే వేంగిదేశపు రాజు పలాయితుడయ్యెననియు దెల్పుచున్నది.14 ఆచార్య నీలకంఠశాస్త్రిగారు చెప్పిన త్రిశాసనము లన్నియు నేక కాలమున వేయించినవే. 15 వీని మూలమున రాజేంద్రచోళచక్రవర్తి తన రాజ్య దశమవర్షమున, నన గా శ. ౯౪౩-వ సంవత్సరమున వేంగిదేశమున కొక దండయాత్ర నంపెననియు, చోళుల ధాటి కాగజాలక అప్పుడు వేంగి నేలుచుండిన నరపాలుడు దేశత్యాగము జేసి పాఱిపోయె ననియు దెలియుచున్నది.

చోళసైన్యము నెదుర్కొనజాలక పరారియైన వేంగిరా జెవ్వడో తెలియదు. అతని నానవాలు పట్టుట సులభసాధ్యము గాదు. కాని యాతడు చోళులకు బ్రతికూలుడనియు, నాతని శిక్షించుటకే రాజేంద్రచోళదేవుడు పైజెప్పిన దండయాత్రను వేంగిదేశమున కంపెననియు నిశ్చయించి చెప్పవచ్చును. అప్పటి పూర్వచాళుక్యశాసనాంతర్గతవంశానుచరితమున విమలాదిత్యుని యనంతరము రాజరాజనరేంద్రుడు రాజ్య మేలినట్లు చెప్పియుండుటచేత చోళదండయాత్ర నడచినప్పుడు వేంగి నేలుచుండిన రాజు రాజరాజనరేంద్రు డను నూహ సహజముగ పొడమవచ్చును. కాని యది సంగతము గాదు. రాజరాజనరేంద్రుడు చోళులకు పరమాప్తుడుకాని విరోధి గాడు. అతడు రాజేంద్రచోళచక్రవర్తికి గడు సన్నిహితబంధుడు; మేనల్లుడు. తాను చోళుల యింటి యాడుబిడ్డ గర్భమున బుట్టితి నని సగర్వముగ దన శాసనములయందన్నిటను జెప్పుకొనియున్నాడు. మఱియు నతడు చోళులయెడ బ్రతికూలుడై ప్రవర్తించినట్లు తెలుపుట కెట్టి యాధారమును గానరాదు. కావున చోళసైన్యము వచ్చుచున్న దని విని పాఱిపోయిన వేంగిరాజు రాజరాజనరేంద్రుడు కాజాలడు. రాజరాజనరేంద్రుడు కాకపోయిన మఱి యాతె డెవ్వ డను ప్రశ్న యొకటి బయలువెడలుచున్నది. ఇతడు రాజరాజనరేంద్రుని ప్రతిస్పర్ధి యని యూహించుటకు గొంత యవకాశము గలదు. ఈ సందర్భమున గమనించదగిన యంశములు కొన్ని యున్నవి. విమలాదిత్యుని రాజ్యము శ. ౯౪౦ లో ముగిసెను. తండ్రియనంతరము రాజరాజనరేంద్రుని యేలుబడి యారంభమైనట్లు అప్పటి పూర్వచాళుక్యశాసనములు దెల్పుచున్నను, నతని పట్టాభిషేకము మఱి నాలుగేండ్ల తరువాతగాని జరుగలేదు. శ. ౯౪౩ నందో, లేక యించుక ముందో చోళచక్రవర్తి రాజేంద్రదేవుడు వేంగిపై దండెత్తెను. ఈదండయాత్రకు ప్రతిఫలితముగ వేంగి నేలుచుండిన రాజొకడు దేశమును విడిచి పాఱిపోయెను. అటువెనుక శ. ౯౪౪-వ సంవత్సరమున రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తు డాయెను. ఈ యంశములను బరిశీలించి చూడ విమలాదిత్యుని యనంతరము వేంగియందు రాజ్యవిప్లవము సంభవించి

---

10. ARE 24 of 1917.
11. ARE 80 of 1917.
12. ARE 81 of 1917.
13. ARE 752 of 1917.
14. ARE 751 of 1917.
15. చోళులు, సం ౧. పుట ౨౩౯.

తమ్మోలమున గొంత యలజడి గలిగినట్లు తోచుచున్నది. రాజ్యమున పోరాటము ప్రారంభ మాయెను. పిత్ర్యమైన రాజ్యమును రాజరాజనరేంద్రు డేలనీయక ప్రతిపక్షి యెవ్వడో యాచికొనగా, దుర్బలుడును, నిస్సహాయుడు నైన మేనల్లునికి బాసటగ రాజేంద్రచోళుడు సైన్యము నంపి యతని శత్రుని బాఱదోలి పూర్వ చాళుక్య రాజ్యమున నతని మరల ప్రతిష్ఠించెను. వ్యక్తమైన చరిత్రాంశముల నాధారపఱచుకొని దృఢముగ జెప్పగలిగిన దింతియే.

రాజరాజనరేంద్రుని కడనుండి రాజ్యమును నాచికొన్న శత్రు వెవ్వరో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. కాని చోళ దండయాత్రా సందర్భమున నడచిన కార్యవిశేషములవల్ల నితని గుర్తించుటకు సాధ్యమగునేమో చూతము. ఈ దండయాత్రాచరిత్రనుగూర్చి తెలియవచ్చు విషయ మత్యల్పము. ఇతర జైత్రయాత్రలవలె నిది చోళశాసనములందుగాని, మఱియెచ్చటగాని విపులముగ వర్ణింపబడలేదు. మడకశిర శాసనములలో దప్ప దీని ప్రస్తావన మఱియెచ్చటను గానరాదు. అందైనను చెప్పబడినవిషయ మతిసంగ్రహము. కావున దీని నత్యంతసూక్ష్మముగ శోధించి యీ దండయాత్రచరిత్రము గనుగొనవలసియున్నది. ఈ దండయాత్రకు నాయకుడైన చోళియవరసుని బిరుదములలో గొన్నిటిని జూచిన వేంగియందప్పుడు సంభవించిన విప్లవముతో గల్యాణిచాళుక్యులకు గొంత సంబంధ ముండినట్లు తోచుచున్నది. పైజెప్పిన మడకశిరశాసనములలో నొకటి చోళియవరసుడు 'జయసింఘకులకాలు' డని తెల్పుచున్నది. దీనివల్ల జయసింఘుని కులమును రూపుమాపుటచే నితని కీ పేరు వచ్చెనని చెప్పవచ్చును. ఇచట పేర్కొనబడిన జయసింఘుడు శ. ౯౩౪-వ సంవత్సరమున బశ్చిమ చాళుక్యసామ్రాజ్యము నేల నారంభించిన జగదేకమల్ల నామాంతరము గల నిమ్మడి జయసింహుడు. 'జయసింఘకులకాల' యను బిరుదువల్ల జోళియవరసు శ. ౯౪౩ నకు బూర్వము చాళుక్యచక్రవర్తియగు జయసింహునితో బోరుసల్పె ననుట నిశ్చయము. ఈ బిరుదును దెల్పు శాసనమునందే 'తెలుంగరు'[16] అనగా దెలుగువారు ముఖ్యముగ బేర్కొనబడియుండుటచేత జోళియవరసు జయసింహునితో బోరినది యాంధ్ర దేశమునందనుట తెల్లము. వేంగి దండయాత్రకు పూర్వము చోళియవరసు జయసింహునితో యుద్ధము చేసినట్లు తెల్పు సాధారము లెవ్వియు లేవు. రాజేంద్రచోళుడు రట్టపాడిమీద బంపిన దండయాత్రయందు చోళియవరసు పాల్గొనియుండినందువల్ల నతనికి జయసింఘకులకాలు డను బిరుదు గల్గెనని చెప్పుటకు వీలులేదు. ఏలనగా వేంగి రట్టపాడి దండయాత్రలు రెండును నేకకాలమున జరిగినవి. మఱియు రట్టపాడిదండయాత్ర కేవలము గర్ణాటకమున సాగినది. అందు తెలుగువారి ప్రాముఖ్యమున కళకాళ మేమియు లేదు. కావున జయసింహునితో జోళియవరసు పోరినది తెలుగుదేశమునందే యని చెప్పవలసియున్నది. ఈ యుద్ధమున జయసింహుని గాని, లేక యాతని వంశజులను నన్యులను గాని జయించిన కారణమున జయసింఘకులకాలు డను బిరుదనామము నాతడు వహించియుండును.

రాజేంద్రచోళదేవుడు వేంగి రట్టమండలములపై రెండు సైన్యముల నేకకాలమున నంపుట కేవలము కాకతాళీయ మనుకొనరాదు. ఏదో యొక యుద్దేశము నెఱవేర్చుకొనుటకే రెండు దండయాత్రలను నేకకాలము సాగించియుండు ననుట సమంజసము. ఈ సమయమున జయసింహుడు చోళరాజ్యసరిహద్దు ప్రాంతమున 'మున్నెన్నడు లేని యాటోపమును జూపుచుం' డినది నిక్కము. చోళు డరట్టపాడిపై నెత్తిపోవుట కది యొక్కటియే కారణము గాదు. కేవలము రాజ్యకాంక్షవల్ల నని చెప్పుటకుగూడ వీలులేదు. ఏలన, రట్టపాడి దండయాత్రకు పూర్వము జయసింహుడే స్థితియం దుండెనో తరువాతను నా స్థితియందే యుండెను. ముశంగి[17] రణక్షేత్ర

---

16. A R E 30 of 1917.

17. ఎపి. ఇండి. సం. ౯ పుట, ౨౩౩. యుద్ధము నడచినస్థలమగు ముశంగి. ఇప్పటి హైదరాబాదురాష్ట్రములోని రాయచూరుమండలాంతర్గత లింగసుగూరు తాలూకాకు జెందిన మస్కి గ్రామమే కాని యన్యము గాదు. అచటి చాళుక్య శాసనములందు ఇది పిరియ ము

మున జయసింహుని జయించి యతఁ డేలుచుండిన సార్ధ సప్త లక్షరాజ్యము నోడించుకొంటి నని రాజేంద్ర చోళచక్రవర్తి దన శాసనములయందు బ్రకటించు కొనినను, జయించిన దేశము నతఁడు స్వాధీనపఱచు కొన్నట్లు గానరాదు. ఈ పట్టున సందేహమున కెడ ము లేదు. జయసింహుని శాసనము లీ యుద్ధము వల్ల నాతని కీవంతైనను రాజ్యనష్టము కలుగలే దని తెల్పుచున్నవి. బళ్లారిమండలమునకు జెందిన హరపనహళ్లి తాలూకాయందలి శిలాశాసనములు రెండు శ. ౯౪౮,౩. ౯౪౪ నాటివి తుంగభద్రా దక్షిణతట దేశ మంతయు జయసింహుని యధీనమున నుండెనని చెప్పుచున్నవి.[18] మఱియు శ. ౯౪౬ నాటి మిరాజ్ తామ్ర పట్టిక లందు మహాపరాక్రమశాలియు, పంచద్రామిళాధి పతియు నగు చోళుని జయసింహు డోడించినట్లు స్పష్టముగ జెప్పియున్నది. [18a] కావున జయసింహునికి ముశంగి రణమున గలిగిన యోటమివల్ల రాజ్యనష్టము గాలేదనుట నిశ్చయము. రాజేంద్రచోళుడు దాను జయించిన రాష్ట్రమును స్వాధీన పఱచుకొన జాలక పోవుటకు కారణము రెండు విధముల నూహింప వచ్చును. జయించిన దేశమును స్వాధీనపఱచుకొని తన యధికారము నందు నిలకొలుపుటకు జాలినంత శక్తి లేకపోయిరైన మండవలయును, లేకదన వాస్తవోద్దేశ మును శత్రుల కొలుకపడనీయక ముణుగపఱచి వారిని వంచించుటకు బన్నిన పన్నాగ మేనియు గావలయును. మొదటియూహ సరియైన దని తలంచుటకు వలనుపడదు. చోళుల యధికార మప్పుడు నిర్వక్రముగ సాగుచుం డెను. అంతటి పోయి బలిమిగల దండు భరతఖండమున మఱియేరాజుకడను లేదు. కావున శక్తిహీనతవల్ల రాజేంద్రచోళుడు రట్టపాడియందు దన యధికార మును నిల్పుకొనజాలకపోయె ననుట తగదు. రట్టపాడి జయించి తన రాజ్యమున గలుపుకొనవలయు నను

మశంగి యని పేర్కొనబడియున్నది. (చూ: హైద. ఆర్కి. సీరీసు నెం ౧ రు. పు ౧.

18 A. R. E. 211 of 1918, 294 of 1918

18 ఎ. ఇండి. ఆంటి సం. ౭. పుట ౧౫౮.

19. A. R. E. 31 of 1917.

నుద్దేశముతో రాజేంద్రచోళు డెత్తిపోయిన ట్లగపడదు. వేంగిని దన యధికారమునక్రిందికి దెచ్చి తన మేనల్లు నారాజ్యమున కధిపతిగ జేయుటయే యతని ముఖ్యోద్దేశము. కాని వేంగి నాక్రమించుకొని యేలుచుండిన రాజు సులభసాధ్యుడు గాడు. అతనికి మిత్రబలసంపత్తి మెండు. జయసింహుని ప్రాపు గలయంతకాలము నతని నిర్జించుట దుస్సాధ్యము. కావున జయసింహుని జిక్కులబెట్టి వేంగి నతని దృక్పథమునుండి తొలగించి నిస్సహాయుడైన వేంగినాథు నోడించి యారాజ్యము నాక్రమించుటకొఱకే రాజేంద్రచోళుడు వేంగిరట్ట మండలములపై నేకకాలమున దాడివెట్టినది. రట్టమండ లమున జోళదండయాత్రవల్ల నత్యంతక్షోభగలిగినను జయసింహుడు దనమిత్రుడైన వేంగిరాజును సంపూర్ణముగ విడనాడలేదు. కొంతసైన్యము నతనికి దోడంపెను. ఈ కొంచెపాటి సైన్యము నోడించియే చోళసేనాధిపతి చోళియవరసు పైజెప్పినట్లు 'జయసింఘకులకాల' యను బిరుదును వహించినది.

జయసింహు నోడించినంతటనే వేంగి చోళులకు స్వాధీనము గాలేదు. రాజరాజనరేంద్రుని ప్రతిస్పర్థికి మిత్రుడు జయసింహు డొక్కడే కాడు. కళింగోత్కళాధిపతులుగూడ నతనికి సహాయ్యులే. కొత్తశివర శాసనములలో నొక్కటి చోళదండనాయకుడగు చోళి యవరసు కాళింగులను నొడ్డవారిని దెలుగువారిని నోడించె నని తెల్పుచున్నది. 19 దీనిబట్టి చూడ వేంగి రాజు దనరాష్ట్రమును దూర్పుదెస నానుకొనియుండు కళింగోత్కళరాష్ట్రాధీశ్వరులతో సఖ్యము గావించు కొనిన ట్లున్నది. పశ్చిమకళింగరాజ్యమును జాళుక్యు లాక్రమించిన నాటనుండియు గళింగాధిపతులు వేంగి రాజకీయపరిస్థితులను గడుశ్రద్ధతో నరయుచు,సమయము పడినపుడెల్ల వేంగీశ్వరుల బలమును గ్రుంగదీయుటకు సంసిద్ధులగువారు. చోళచక్రవర్తి కాశ్రితుడైన వేంగి రాజు దమకు బ్రక్కలోని బల్లెమని వా రెఱుగుదురు. చోళులు దమ దేశము నెత్తివచ్చు పక్షమున వారికి వేంగిప్రభువులు దప్పక తోడ్పడుదు రనుట నిశ్చయము. చోళులకు బ్రతికూలుడు వేంగి నేలునంతకాలము నాగళింగ మునకు వారివలని యుపద్రవ ముండదు. కావున కళిం

గోత్కళాధిపతులు విమలాదిత్యుని యనంతరము వేంగి రాజ్యమునకై యంతఃకలహములు బొడమగా చోళులకు ప్రతికూలురైన రాజనరేంద్రుని ప్రతిస్పర్ధిని గూడి యతనికి వలయు సహాయము శేయ నారంభించిరి.

రాజరాజనరేంద్రుని ప్రతిస్పర్ధిని గుర్తించగడగు నవు డీయంశముల నన్నిటిని జ్ఞప్తియం దుంచుకొనవలయును. విమలాదిత్యుని యనంతరము వేంగి దేశము నాక్రమించుకొని రాజరాజనరేంద్రుని పదచ్యుతుని గావించినవా డతని సవతితమ్ము డగు సప్తమవిజయాదిత్యు డని కొంద అభిప్రాయపడుచున్నారు. 20 ఈ యభిప్రాయము సరియైన దని రుజువుచేయుటకు దగిన యాధారము లేకున్నను, దండ్రిమరణానంతరము రాజరాజనరేంద్రుని దొలగద్రోసి విజయాదిత్యుడు రాజ్యము నాక్రమించుకొనియుండినను నుండవచ్చును. అది యసంగతము గాదు. విజయాదిత్యుని యుత్తరచరిత్ర పైయభిప్రాయమునకు బుష్టిగలిగించుచున్నది. రాజరాజనరేంద్రుడు పట్టాభిషేకము జేసుకొనినపిమ్మట వాతని దొలగద్రోసి రాజ్యము నాక్రమించుకొనుటకు నిరంతరము యత్నముసల్పుచుండువాడు. శ.౯౫౨లో నొకమారును. శ. ౯౭3 లో నింకొకమారును రాజరాజనరేంద్రుని బోద్రోలి రాజ్యమును స్వాధీనము జేసుకొనెను.21 మఱియు నతడు కల్యాణిచాళుక్యులతో సఖ్యము గావించుకొని చోళులతో బ్రతిఘటించి పలుమారు పోరాడెను.22 కల్యాణిచాళుక్యులతోడనే కాక కళింగులతోడను మైత్రి నెఱపి వారి సాహాయ్యమును బడసి రాజరాజనరేంద్రుని పుత్రుడగు రాజేంద్రాపరనామధేయుడగు కులోత్తుంగునితో యుద్ధము జేసెను.23 కావున నీవిజయాదిత్యుడే తండ్రిమరణానంతరము కల్యాణిచాళుక్యులవల్లను, కళింగోత్కళులవల్లను సాయము వడసి రాజరాజనరేంద్రుని బదచ్యుతిని గావించి రాజ్యము నాక్రమించుకొనియుండవచ్చును. కాని దీనిని నొక్కిచెప్పుటకు దగిన యాధార మెద్దియు గానరాదు. ఇది యెట్లున్నను విమలాదిత్యుని మరణానంతరము రాజరాజనరేంద్రుని పిత్ర్యమైన సింహాసనము నధిష్ఠించనీయక యడ్డుపడి ప్రతిపక్షి యెవ్వడో రాజ్యము నాక్రమించుకొన్నది నిశ్చయము. చోళసైన్యము వచ్చి వాని నోడించి తఱుమువఱకును రాజరాజనరేంద్రునకు రాజ్యము స్వాధీనము గాదాయెను.

(సశేషము)

---

20. ఇం. హి. క్వా: సం. ౧౨ పుట ౪౯.

21. ఆంధ్రేతిహాససంశోధకపత్రిక, సం. ౨ పుట ౨౮౭

"తం రాజరాజనృపతిం
నిర్ధాట్య భుజః ప్రసహ్య విజయాదిత్యః
విమలాదిత్యతనూజో
తస్య ద్వైమాతురో గ్రహీ ద్రాజ్యం"
పైపత్రిక సం. ౫, పుట. ౪౪
"పరోక్షే రాజరాజస్య
భ్రాతు ద్వైమాతురస్య యః,
ప్రత్యగ్రహీ న్మహీరాజ్య
శ్రియం వీరశ్రియా యుతః"

22. EC. XI. Dg. 11, 148, cd. 47; Mk. 29. ARE. 257, 286, 278 of 1918; 138, 139 of 1899; 322 of 1924.

23. ఇం. ఆంటి. సం ౧౫, పుట ౧౯౬.

# కందనూరు నవాబు రాజరికం

ఇది కల్పితకథ కాదు; నిజంగా జరిగిన సంగతి. ౧౮౩౮-వ సంవత్సరం వరకూ కర్నూలుజిల్లాలో నాలుగు తాలూకాలు కర్నూలు నవాబురాజ్యంలో చేరివుండేవి. శ్రీశైలము, అహోబిలము, నివృత్తిసంగమము మొదలైన పుణ్యక్షేత్రాలకు పోయే యాత్రికుల దగ్గిర ఆ నవాబుగారు 'హాశ్శీలు' (పన్ను) వసూలు చేసేవాడు. శ్రీ శైలదేవస్థానము చాలా దుఃస్థితిలో వుండేది. ఇలా వుండగా ఈనవాబుగారు ఇంగ్లీషుప్రభుత్వాన్ని తిరగదోడడానికి కుట్రచేసిన సంగతి బయటపడింది. అంతట కుంఫినీవారు ఆయనరాజ్యాన్ని లాక్కున్నారు. శ్రీ శైలాన్ని కొన్నాళ్లు కుంఫినీవారే పరిపాలించి తరవాత ౧౮౮౦ లో శ్రీ పుష్పగిరి శంకరాచార్యులవారి వశం చేశారు.

= శ్రీ దిగవల్లి వెంకటశివరావు =

కందనూరు, కందనోలు, కందెనవోలు అనేవి కర్నూలుకు పాత పేర్లు. కందెనవోలు అనేది అసలుపేరు. క్రీస్తుశకం ౧౬౬౫-వ సం.లో అధ్యాత్మ రామాయణం వ్రాసిన పెద్దనసోమయాజి కందనోలు అని ప్రయోగించాడు. కొందరు కవులు కందవోలు అనికూడా వాడారు. విజయనగర సామ్రాజ్యంనాటి శాసనాలలో కందనోలు, కందనూలు అనే రెండు పేర్లూ కనపడుతున్నాయి. అయ్యలరాజు నారాయణ కవి తన హంసవింశతిలో ఊళ్ల పేర్ల జాబితా నివ్వడంలో 'కందనూరు' అని ప్రయోగించాడు. ౧౮౩౦ లో కాశీయాత్రచరిత్ర వ్రాసిన ఏనుగుల వీరాస్వామయ్యగారుకూడా కందనూరు అనే ప్రయోగించారు.

ఇప్పటి కర్నూలుజిల్లాలో రామళ్లకోట, నందికొటుకూరు, నంద్యాల, శిరివెళ్ల, కంభము, మార్కాపురము, కోయిలకుంట్ల, పత్తికొండ అనే ఎనిమిది తాలూకాలున్నాయి. రామళ్లకోటకు కర్నూలే ముఖ్యపట్టణం. శిరివెళ్లకు ఆళ్లగడ్డ, కంభానికి గిద్దలూరు, తక్కిన తాలూకాలకు ఆతాలూకా పేర్లుగల గ్రామాలూ ముఖ్యపట్నాలు. ఈజిల్లావిస్తీర్ణం ౭౫౦౮ చదరపు మైళ్లు. జనాభా షుమారు పదిలక్షలు. రివిన్యూ ఆదాయం ౨౩౭ లక్షల రూపాయలు.

## పూర్వచరిత్ర

కర్నూలు మండలం హంపీవిజయనగరచక్రవర్తుల పరిపాలనకిందికి వచ్చినప్పటినుంచీ ఈజిల్లా చరిత్రయొక్క వివరాలు తెలుస్తున్నాయికాని అంతకు

పూర్వపు చరిత్రవివరాలు తెలియడం లేదు. అయితే ఈదేశాన్ని పూర్వము చాళుక్యులూ, చోళులూ, ఓరుగంటికాకతీయగణపతిరాజులూ ఏలినట్లు నిదర్శనాలు వున్నాయి. ౧౫౬౫ లో తాళికోటయుద్ధంలో విజయనగరచక్రవర్తి అయిన రామరాజు ఓడిపోవడంతో గెల్చిన పక్షంలో చేరిన తురకరాజైన గోలకొండసుల్తాను కుతుబుశాహీ ఈరాజ్యంమీదికి దండెత్తివచ్చాడు. తరవాత ఇతర మహమ్మదీయరాజులుకూడా దేశం కొల్లపెట్టారు.

## కందనూరి నవాబు

౧౬౮౬ లో మొగలుచక్రవర్తియైన ఔరంగజేబు పాదుషా కృష్ణానదికి దక్షిణాన వున్న రాజ్యాలను జయించాడు. అప్పుడు ఆయన సేనాపతులలో ఒకడైన గయాజుద్దీను కర్నూలు పట్టుకున్నాడు. తరువాత ఈమండలాన్ని మొగలుచక్రవర్తి తన సేనాధిపతియైన దావూదుఖానుబహద్దరుకు జాగీరుగా యిచ్చాడు. అతని తరవాత ౧౭౩౩ లో జాగీరుదారుడైన హిమాయతుఖాను 'నవాబు' అనిపించుకున్నాడు. అతని కాలంలో ౧౭౪౧లో మరాటీదండు వచ్చి దేశాన్ని కొల్లపెట్టింది. దీనినిగురించిన పాటలు ఇప్పటికీ పాడుతూ వుంటారు.

కర్నాటకనవాబుల వారసత్వంతగాదాలలో హిమాయతుఖాను ఒకమాటు ఇంగ్లీషువారి పక్షాన్ని, ఇంకొకమాటు ఫ్రెంచివారి పక్షాన్నీ చేరివాడు అప్పట్లో సలబతుజంగున్నూ, ఫ్రెంచిసేనానియైన బుస్సీదొరయున్నూ కలిసి ౧౭౫౧ మార్చి నెలలో కర్నూలు ముట్టడించారు. ౧౭౫౨ లో మునవరుఖాను కర్నూలునవాబు అయినాడు. అతని కాలములో మైసూరుసుల్తాను హైదరాలీ (౧౭౫౫ లో) కర్నూలుమీదికి దాడివచ్చి కప్పం పుచ్చుకున్నాడు. తరవాత హైదరాలీకొమారుడైన టిప్పుసుల్తాను యుద్ధంలో ఓడిపోయి చనిపోగా బళ్లారి కడపజిల్లాలతోపాటు ఈజిల్లాకూడా ఇంగ్లీషువారికి సహాయుడైన హైదరాబాదునిజాముపాలికి వచ్చింది. తరవాత నిజాము ఇంగ్లీషువారికి సైనికఖర్చుల క్రింద యివ్వవలసివచ్చిన సొమ్ముక్రింద నిజాము బళ్లారి కడపజిల్లాలనూ, కర్నూలు జిల్లాలోని కంభము, మార్కాపురము, కోయిలకుంట్ల, పత్తికొండ అనే నాలుగు తాలూకాలనూ ౧౮౦౦-వ సంవత్సరంలో ఇంగ్లీషువారికి సమర్పించాడు. ఇవే దత్తమండలాలని ప్రఖ్యాతి చెందినాయి. కర్నూలుజిల్లాలో చేరిన మిగతా నాలుగుతాలూకాలు—అనగా రామళ్లకోట, నందికొట్కూరు, నంద్యాల, శిరివెళ్లతాలూకాలు కర్నూలునవాబురాజ్యంలోనే వున్నాయి. ఈసందర్భంలో కర్నూలునవాబు సాలుకు ఒకలక్ష రూపాయలు కప్పం చెల్లించే పద్ధతిమీద అతని రాజ్యం అతనికే వుండనిచ్చారు.

## గులాంరసూలుఖాను పరిపాలన

మునవరుఖాను నవాబుగా వుండగా ౧౮౧౬ లో పిండారీ దండు కర్నూలుమీదికి వచ్చిపడి ప్రజలను దోచి హింసించింది. మునవరుఖాను తరవాత ౧౮౨౩లో గులాంరసూలుఖాను కర్నూలునవాబు అయినాడు. ఇతడు ౧౮౩౯-వ సంవత్సరం వరకూ ఆ రాజ్యాన్ని ఏలినాడు. ఇతని కాలంలో పరిపాలన చాలా నిరంకుశంగా వుండేది. ఈయనరాజ్యంలో వున్న అహోబలం, శ్రీశైలం మొదలైన పుణ్యక్షేత్రాలకు యాత్ర వచ్చే హిందువులవల్ల చాలా ఎక్కువ హాశ్శీలు వసూలు చేస్తూవుండేవాడు. గాని ఆ దేవస్థానాల పరిపాలన సరిగా జరిగించేవాడు కాడు.

ఇంగ్లీషు కుంఫిణీవారి రాజ్యాన్ని కూలద్రోయాలని ఇతడు కుట్ర చేస్తూవున్నట్లు ౧౮౩౯ లో బయలుపడగా కుంఫిణీవారు ఇతని రాజ్యం లాక్కొని తిరుచునాపల్లికి రాజకీయ ఖైదీగా పంపారు. అక్కడ ఇతడు క్రైస్తవమతాభిమానం చూపుతున్నాడని ఒక మహమ్మదీయుడికి కోపం వచ్చి ఇతనిని ౧౮౪౦లో పొడిచి చంపాడు.

కర్నూలు నవాబు రాజ్యాన్ని లాక్కొనేటప్పుడు అతడు అదివరకు తన సరదారులకూ, బంధువులకూ యిచ్చిన జాగీరులు కూడా కుంఫిణీవారు తీసుకొని ఆయనకుటుంబంవారికి రెండులక్షల రూపాయలకుపైగా పింఛను ఏర్పాటు చేశారు. అసలుపింఛనుదార్లు చనిపోయినమీదట ఆ పింఛనులు రద్దుచేశారు.

ఈ రాజ్యాన్ని లాక్కున్నతరవాత దానికి ఒక బ్రిటీషు కమీషనరును ఏజెంటు అనే పేరుతో నియమించి భూమిని రైతువారీ బందోబస్తు చేశారు. ౧౮౫౮ లో తక్కిన నాలుగు తాలూకాలూ కలిపి ఒక కలెక్టరుకింద ప్రస్తుతపు కర్నూలుజిల్లా నిర్మించారు. శ్రీశైలాన్ని కొన్నాళ్లు కుంఫినీవారే పరిపాలించి ౧౮౪౦లో ఆ దేవస్థానానికి పుష్పగిరి పీఠాధిపతులను ధర్మకర్తగా నియమించారు. (Imperial Gazetteer-Provincial Series, Madras I pp. 406-7.)

## ఏనుగుల వీరాస్వామయ్యగారి వర్ణన

ఏనుగుల వీరాస్వామయ్యగారు ౧౮౩౦-౧౮౩౧ మధ్య కాశీయాత్ర చెయ్యడంలో ఈ కర్నూలు నవాబురాజ్యంలో చేరిన పుణ్యక్షేత్రాలు దర్శించారు. అక్కడి రాజకీయ సాంఘిక స్థితిగతులను వర్ణించారు. వీరాస్వామయ్యగారు కడపనుంచి శ్రీశైలానికి ప్రయాణం చేసే దారిలో దువ్వూరువరకూ కడపజిల్లాలో చేరిన భూమి అనిన్నీ, తరవాత వంగలి అనే వూరు కందనూరి నవాబుదనిన్నీ వ్రాస్తూ రూపసింగు అనే సర్దారుకు కొలువుకుగాను ఈ గ్రామం వగైరా కొన్ని వూళ్లు జాగీరుగా ఇవ్వబడిన వని వ్రాశారు. "ఎగువ అహోబిళములో ఉత్సవకాలమందు ౮౦౦ వరహాలు హాశ్శీలు వసూలు అవుతున్నవి. వాటినంతా కందనూరినవాబు పుచ్చుకొని వెనక సుళ్లసంగతినే విచారింపడు." (కాశీయాత్రచరిత్ర, పుట ౧౦)

వీరాస్వామయ్యగారు అహోబిళంనుంచి మహానందికి వెళ్లారు. తరవాత కందనూరినవాబు రాజ్యంలో చేరిన బండాత్మూకురుమీదుగా వెలపనూరు చేరారు ఇక్కడ నవాబుతరఫు ఉద్యోగస్థులు కొందరు ఉన్నారు. (౧౧) అటుతరవాత ఆయన ఆత్మకూరు చేరారు. ఇది ఆనవాబుతాలూకుఉద్యోగస్థులు వుండే కసుబా. బస్తీ. శ్రీశైలయాత్ర చేయవచ్చినవారిదగ్గర హాశ్శీలు పుచ్చుకునే నవాబుముసద్దీలు ఆత్మకూరులో వున్నారు. నవాబుపరిపాలనను ఇలాగ వర్ణించారు. తాలూకా నాలుగు మేటీలుగా పంచి ఒక్కొక్క మేటీకి ఒక్కొక అములుదారుని ఏర్పరిచాడు. ఈ అములుదారులందరిపైన అక్బరువలీను అనే అధికారిని నియమించాడు. నవుకర్లకు జీతానికి జాగీరు లిచ్చాడు. కుంఫినీవారికి నాలుగులక్షరూపాయిలు కప్పం కడతాడు. అతని రాజ్యము బళ్లారిజిల్లాకలెక్టరుఆజ్ఞకు లోబడినది. కలెక్టరుతరఫున ఒక వకీలు కందనూరులో కాపురమున్నాడు. నవాబు కాజీకోర్టు పెట్టి న్యాయవిచారణ చేస్తాడు. కుంఫినీకోర్టులకు నిమిత్తం లేదు. నవుకర్లకు జీతాలు స్వల్పము—సరిగా ఇవ్వడం లేదని వాడుక. (౧౨)

## శ్రీశైలం దేవస్థానము

శ్రీశైలయాత్రకు తీసే హాశ్శీలు కందనూరి నవాబుకు చేరుతున్నది. ఉత్సవాని కయ్యే ఖర్చుగాక హాశ్శీలుకూడా పుచ్చుకుంటారు. వాటి వివరాలు వీరాస్వామయ్యగారు వ్రాశారు.

సిద్ధాపురంలో చెంచువాండ్లకుగాను నవాబు మనుష్యులు మనిషి ఒకటికి ౩ డబ్బులు హాశ్శీలు పుచ్చుకొంటున్నారు (౧౩). పరమవారి (యాత్రికుల) వద్ద నవాబు సరకారు ఆజ్ఞప్రకారం మనిషి ౧కి ౩ డబ్బులు హాశ్శీలు పుచ్చుకున్నా కిరాతకుల నాయకుడు ధర్మాత్ముడుగానే వున్నాడు (౧౪). కందనూరినవాబు వగైరాలు పల్లకీలమీదనే శ్రీశైలమునకు వెళ్లియున్నారు.

శ్రీశైలంగుడి హాశ్శీలు మూలముగా సంవత్సరం ఒకటికి ౧౮౦౦౦ కందనూరినవాబుకు వచ్చినా గుడి యొగతిని పొందేదిన్నీ విచారింపడు. ఎవరైనా మరమ్మతు చేసినట్టయితే సెలవంత హాశ్శీలు తీసుకొనుచున్నాడు. రాజాచందులాలా యీ నిర్బంధముచేత కొంత మరమ్మతు చేసి విడిచినాడు. మైసూరునుంచి వచ్చేవాళ్లకు హాశ్శీలు లేదు. గుడిలో ఏపక్క చూచినా అడివి పెరిగివున్నది. వ్యాఘ్రభూయిష్ఠము. అడివి కొట్టి చక్కచేసే దిక్కు లేదు. స్వామికిన్నీ, దేవికిన్నీ ఎవరైనా ఆభరణాలూ, వస్త్రాలూ సమర్పిస్తే వాటి మదింపంత రూకలు హాశ్శీలు పుచ్చుకోవడమే గాకుండా కొన్ని దినాలు పోనిచ్చి ఆవస్తువులనే ఆకందనూరునవాబు అపహరిస్తున్నాడు.

వీరాస్వామయ్యగారు నివృత్తిసంగమానికి వెళ్లారు. ఇది కొండకింద నున్నది. కృష్ణ ఉత్తరవాహినిగా ప్రవహిస్తూవున్నది. ఆయూరున్నా కందనూరు

నవాబు దే. కృష్ణకు యీవలిపక్క వరకూ కందనూరి వారి రాజ్యం, అవలిపక్క హైదరాబాదువారి రాజ్యము. అందువల్ల కృష్ణ దాటడానికి మనిషి కింత అని కందనూరివారు ఇవతలపక్కా, హైదరాబాదు వారు అవతలపక్కా పోన్నులు పుచ్చుకుంటున్నారు. (ఇంకా వివరాలకు ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్రచరిత్ర చూడండి.)

## దక్షిణ దేశ రాజకీయాలు

మొంగలాయిచక్రవర్తుల కింద దక్షిణదేశానికి పరిపాలకుడుగా నుండిన హైదరాబాదుసుభాదారుడే ఇంగ్లీషుప్రభుత్వంవారికి నమ్మిన స్నేహితుడైన ఘనత వహించిన నిజాముప్రభువు అయినాడు. మొంగలుసామ్రాజ్యం అస్తమించినతరవాత ఇంగ్లీషు పరిపాలనలో దక్షిణహిందూదేశంలో వున్న మహమ్మదీయరాజ్యాలపైన నిజాముగారి అధికారము పోయినా చాలాకాలంవరకూ ఆయనకు మంచి పలుకుబడి వుంటూవుండేది.

౧౮౨౯ మొదలు హైదరాబాదురాజ్యానికి నిజాముప్రభువైన నాజర్ ఉద్దౌలా అనేఆయన ఇంగ్లీషు వారిపట్ల స్నేహభావంతోనే వుండేవాడు. ఆయన మంత్రి రాజ్యతంత్రనిపుణుడైన రాజా చందులాలా అనే బ్రాహ్మణుడు. ఇంగ్లీషుకుంఫిణీవారికి మిత్రుడుగా వుండేవాడు. అయితే నిజాంప్రభువుగారి సోదరుడికిమాత్రం ఇంగ్లీషువారంటే అసహ్యం. ఆయన కుంఫిణీవారికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తూవున్నట్లు ఇంగ్లీషువారికి తెలిసినందువల్ల ఆయనను హైదరాబాదులోనుంచి దూరప్రదేశానికి ప్రవాసంపంపించారు.

ఈ దేశపు మహమ్మదీయులలో స్వమతాభిమానం చాలా ఎక్కువ. పరమతసహిష్ణుత చాలా తక్కువ. తమకు యిష్టంలేని రాజ్యాంగవ్యవస్థపట్ల తమవారిలో విరోధభావం వ్యాపింపచెయ్యడానికి అవకాశంకోసం చూస్తూవుండడము మొదటినుంచీ వుంటూనేవున్నది. దేశీయులలో ఒకరితో ఒకరు రహస్యంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడానికి ఈ దేశంలో చాలా వకాశాలు వుంటూవున్నందువల్ల రహస్యాలోచనలకూ, కుట్రలకూ చాలా వీలుగా వుంటూవుండేది. రహస్యపు ఉత్తరప్రత్యుత్తరాలమార్గంగానూ, బజారు పుకారుల మూలంగానూ అనేకవార్తలు ఈ దేశంలో ఆనోటా ఆనోటా పడి చాలా త్వరగా వ్యాపిస్తూ వుండేవి.

## తురకల రక్షరేకులు, తావేదులు

ప్రపంచమంతటా మహమ్మదీయులకు తావేదులన్నా, రక్షరేకులన్నా చాలా ప్రీతి. ఈతాయత్తులలో కాగితాలపైనా, రక్షరేకులపైనా భగవంతుడి పేరో, లేకపోతే ఖురానులోనుంచి ఒకవాక్యమో వ్రాసి వుంటుంది. అయితే అందులోని అక్షరాలూ, మాటలూ, వాక్యాలూ పైకి కనబడే అర్థాన్నే కాక వేరే ఇంకొక అంతరార్థాన్ని కూడా స్ఫురింపచేస్తూవుండేటట్లు వ్రాయడానికి వీలున్నందువల్ల హిందువులపైననూ, వారి లాగనే కాఫరులైన ఫరంగీలపైననూ ద్వేషాన్ని పురికొల్పే 'జిహాద్' అనే మతయుద్ధాన్ని ప్రకటించడానికి ఉపయోగించేవారు.

## 'జిహాద్' అనే మతయుద్ధం

౧౮౩౮ లో ఇంగ్లీషువారు ఆఫ్ఘనిస్థానంమీదికి దండయాత్ర చెయ్యడానికి సైన్యాలు పంపినప్పుడు ఇలాంటి అర్థాలు స్ఫురించే తావేదులూ, రక్షరేకులూ దేశంలో చాలాచోట్ల కనబడ్డాయి. ఆసమయంలో హిందూదేశమంతటా వున్న మహమ్మదీయప్రజలలో రహస్యమైన ఉద్రేకం కలిగినట్లు కనబడింది. ఆయోధ్యరాష్ట్రంలోనుంచి అరబ్బీదూతలు బయలుదేరి దేశంలో నలుమూలలా తిరుగుబాటు చేయడానికి ప్రచారం చేశారు. ఆసమయంలో భగవంతుడి భయం ఇంగ్లీషువారికి వుండబట్టిగాని లేకపోతే హిందూదేశంలో వారి రాజ్యం భగ్నం అయ్యేదే. ఆఖరికి జాతివాళ్లు చాలామంది ఆహుతి అయ్యేవారే. ఈ కుట్రాలోచనలు జరిగినట్లు చాలా దాఖలా లున్నాయి.

ఇలాంటి అరబ్బీదూతలు కొంతమంది చెన్నపట్నందగ్గరనే పట్టుబడ్డారు. ఆసమయంలో వారిదగ్గిర దొరికిన రక్షరేకులలో పైకి కేవలమూ మహమ్మదీయ మతానికి సంబంధించిన ఖురానులోని సామాన్యపదా

లుగా కనబడే మాటలే చిత్రంగా కూర్చబడి, వాటిని కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే కాఫరులపైన జిహాద్ అనే మతయుద్ధానికి తురకలను పురికొలిపే అర్థం స్ఫురిస్తుంది. ఈమాటలను తురకంలోలాగనే కుడినుంచి యెడమకు చదవాలి. ముఖ్యంగా ఈకింది పట్టిక లోని గళ్లలో నాలుగైదు పంక్తులు చదివి చూడండి.

గురించీ, ఆవిడ చూపిన ఆదుర్దానుగురించీ అతనికి మనస్సులో కొంచెం అనుమానం తగిలి ఇందులో ఏదో విశేషం వున్నదని తలచి ఆరక్కురేకును హైదరా బాదులో అధికారుల కిచ్చాడు. దానిని వారు పరి శీలించగా అది నిజాంప్రభువుగారి సోదరుడు కర్నూలు నవాబుగారికి వ్రాసిన రహస్యపు వుత్తరం అని తేలింది.

| 6 | 5 | 4 | 3 | 2 | 1 |
|---|---|---|---|---|---|
| తొలగించు. | పీడను | మా ప్రజలకూ | మాకూ, | కరుణామయుడా, | ఓ దేవా (1) |
| నాశనం చెయ్యడు | మరెవ్వరినీ | గట్టి కోటగోడల మధ్య ఉన్న వారిని తప్ప | రక్షిస్తాడు. | సద్ధర్మలను | భగవంతుడు (2) |
| రక్షించు. | మమ్ములను | నీ సేవకులమైన | పంపి | నీ ప్రవక్తను | ఓ భగవంతుడా (3) |
| చెయ్యి. | తరిమి | దుష్పరిపాలకుల్ని | ఈ క్రూర నిరంకుశ | ఈ మహానగరాల నుండి | ఓ ప్రవక్తా (4) |
| నాశనం చెయ్యి. | వారిని | ఓభగవంతుడా | యుద్ధం చెయ్యండి. | నా స్త్రీలపైన | కాఫరులపైన (5) |

## కందనూరినవాబుకుట్ర

ఆఫ్ఘనిస్థానములో ఇంగ్లీషుసైన్యాలకు జయం కలుగుతుందో, అపజయమే కలుగుతుందో అనే సందిగ్ధావస్థలో వున్న సమయంలో, అనగా ౧౮౩౯-వ సంవత్సరం వేసంగిలో ఒక బీదతురకస్త్రీ హైదరా బాదునగరంలో ఒక సత్రంలో కలరా తగిలి చావడా నికి సిద్ధంగా వుండి, ఆసత్రంలోనే బసచేసిన ఒక పెద్ద మనిషిని దగ్గిరకి పిలిచి తానొక రహస్యం చెప్పాలో దలచినా ననిన్నీ, తన కోరిక చెల్లించవలసిం దనిన్నీ బతిమాలింది. పాపం, ముసలమ్మ అవసానసమయంలో అడుగుతూవుందికదా అని అతడు సరేనన్నాడు. అంతట ఆమె తన మెడలోనుంచి ఒక రక్కురేకు తీసి అతనిచేతిలో పెట్టి తాను చచ్చిపోగానే ఆరక్కురేకును తీసుకువెళ్లి మూసీనదిలో పారవెయ్యవలసిం దని ప్రార్థిం చింది. పాపం, ఆపెద్దమనిషి మొదట ఆవిడకోరిక చెల్లిద్దామనే అనుకున్నాడుగాని ఈ వింతకోరికను

## జనానాలో ఆయుధాగారం

దీనినిగురించి దర్యాప్తులు చేయగా ఇంగ్లీషు వారిపట్ల ఒక పెద్ద కుట్ర జరుగుతూవున్నట్లు బయలు పడింది. ఇంతేకాదు. కర్నూలుకోటలో కొంత ఆయుధసామగ్రిన్నీ, మందుగుండుసామానున్నూ చేర్చి వున్నట్లున్నూ తెలిసింది. అంతట వెంటనే ఒక ఇంగ్లీషు సైనికదళాన్ని కర్నూలుకు పంపి కోటను సోదాచేస్తా మని నవాబును అడిగారు. సరే చేసుకోండి అని అతడు ధైర్యంగా జవాబుచెప్పి తన సైనికులతోటీ, పరివారం తోటీ కోటవెలపల మైదానంలోకి వెళ్లాడు. అంతట ఆ కోటను సోదా చెయ్యడానికి నియమింపబడిన కమీషనర్లు కోటను, నవాబుగారి అంతఃపురాన్ని జాగ్ర త్తగా సోదా చేశారుగాని ఏమీ దొరకలేదు. నవాబు గారి జనానాకు అంటివున్న వుద్యానవనం పెద్ద గోడ ల మధ్య గదులుగదులుగా కేటాయింపు చేయబడి వున్నది. ఏమైనా వుంటే అక్కడే దొరుకుతుం దని

అనుకున్నారుగాని అక్కడ ఎంత వెదికినా అనుమానం కలిగేది ఏమీ కనబడలేదు. అయితే ఇదివరకు వచ్చిన ఆచోకీ సులభంగా తీసిపారవేయడానికి వీలైనదికాదు గనక ఈ జనానావుద్యానవనాన్ని మళ్లీ ఇంకోక మాటు ఇంకా జాగ్రత్తగా పరిశోధించడానికి నిశ్చయించారు. ఆ ప్రకారం నలుమూలలా శోధిస్తూ వుంటే అందరికీ ఆశ్చర్యం కలిగేటట్టుగా ఈ జనానా వుద్యానవనంలో ఒక రహస్యపు ఆయుధాగారం బయటపడింది. ఈ వుద్యానవనంయొక్క ఆవరణపు గోడలన్నీ మధ్య ఖాళీలతో రెండు వరసలుగా కట్టి పైన సామాన్యమైన కోటగోడలలాగ కనబడుతూ లోపల బోలుగా కట్టినవే. వాటిలోపలి ఖాళీలలోనూ, నేలసొరంగాలలోనూ ఆరు యేడు వందల ఫిరంగులూ, ఫిరంగిబళ్లూ, ఫిరంగిగుళ్లూ, తోటాలూ, తుపాకులూ, మందుగుండుసామానూ, ఫిరంగులు పోతపోయడానికి కావలసిన కొలిమిలూ భద్రపరచి వున్నాయి. ఇందులో చాలా ఫిరంగులు కొత్తగా తయారు చేసినవి. కొలిమిలుకూడా అప్పటికి కొద్దికాలం కిందటనే వుపయోగించినట్లు కనబడ్డాయి.

### కర్నూలునవాబుపదచ్యుతి

ఆఫ్ఘనిస్థానంయుద్ధంలో ఇంగ్లీషువాళ్లు ఓడిపోతారని అనుకుని దేశంలో వున్న మహమ్మదీయులందరూ ఏకమై తిరుగుబాటు చేయడానికి కుట్ర చేసినట్లూ, దానికి కర్నూలు ఒక కేంద్రస్థానమైనట్లూ తేలింది. "మన కళ్లయెదటనే ఇలాంటి గొప్పకుట్ర సాగుతూ వుండడమూ, దానికి కావలసిన సామగ్రి చేకూరడమూ ఎంత ఆశ్చర్యము!" అని దీనినిగురించి ఇంగ్లాండుకు వ్రాసిన ఆయన అన్నాడు.

కర్నూలునవాబు గులాం రసూలుఖానును పదభ్రష్టుణ్ని చేసి తిరుచినాపల్లికి రాజకీయఖైదీగా పంపారు. అక్కడ అతడు క్రైస్తవమతంలో ఆసక్తి చూపుతూ క్రైస్తవదేవాలయానికి వెళ్లగా ఒకతురక ఫకీరు ఆయనను ౧౮౪౦-వ సంవత్సరం జూలై ౧౨-వ తేదీన కత్తితో పొడిచి చంపాడు. (South Indian Sketches. A Short account of some missionary stations of Church Mission Society- By S. Tucker ; James Nisbet Co., 1848 ; pp 17-28)



# ఈ తోకచుక్క కాశ్యప శ్వేతకేతువేనా?

= శ్రీ గొబ్బూరు వెంకటానందరాఘవరావు =

●

సూర్యుడు అస్తమించి అవతలకు పోగానే—తెరతీస్తే బయటపడినట్టు - ఆకాశరంగం మీద గ్రహాలూ, నక్షత్రాలూ ఒక్కొక్కటీ ముత్యాల్లాగ - వజ్రపుపొళ్లలాగ - సానబట్టిన రత్నాలలాగ - ఉజ్వలంగా వెలుగుతున్న గేస్‌లైట్లలాగ మిలమిల లాడుతూ, తళతళలాడుతూ, జిగజిగమంటూ అద్భుతంగా మెరిసిపోతూ ఆశ్చర్యం కలిగిస్తూఉంటవి. ఆకాశరంగం ఎటు చూచినా వింతలే—విశేషాలే! ఆ విశేషా లన్నిటిలోనూ విశిష్టమైన విశేషము తోకచుక్క.

తోకచుక్కనుగూర్చి ఒక ఇంగ్లీషుకవి ఇలా ప్రశంసించాడు:

*"If there be aught throughout the*
*pearly deep*
*Of heavens, unfathomable Ocean wide*
*That doth effect Man's soul*
*With wonder and delight*
*Beyond the rest of vast creation's*
*wealth,*
*'Tis Thou, Mysterious Star! Oh Comet!"*

"విశాలవిశ్వవ్యాప్తిలో పరిస్ఫుటం అయ్యే సృష్టిసౌందర్యసంపదలకు పైగా నక్షత్రమండలములో, ఉడుమార్గపు నురుగువెల్లువలమధ్య అపారంగా వ్యాపించి ఉన్న గభీరవినీలరత్నాకరములో మిలమిల మెరిసే ముత్యాలకోవల లావణ్యపుంజములలో, మానవుని నేత్రములకూ, ఆత్మకూ నిరుపమానమైన ఆనందమునూ, ఆశ్చర్యమునూ ఒడగూర్చేదానవు నీవే సుమా! ఓ తోకచుక్కా! నీచరితము అతివిగూఢము!" అని చక్కగా వర్ణించాడు.

నిజం! వింత రూపమూ, విడ్డూరపు వైఖరీ! ఎక్కడనుంచి వస్తుందో, ఎక్కడకు పోతుందో! ఏమో!

నిరుడు ఒక తోకచుక్క వచ్చింది. దక్షిణ దిక్కున పొడచూపింది. ఉత్తరంగా నడిచింది. మేష రాశి చేరింది. ఆ తరువాత మాయమైపోయింది.

ఈ యేడు సుమారు రెండునెలలనుంచి ఈతోక చుక్క హడావుడి వినిపిస్తూంది. ఇటీవల స్పష్టంగా కనిపిస్తూంది.

మొదట సింహరాశికి ఉత్తరభాగమందు కనపడింది. పిమ్మట మార్చి ౧-వ తేదీనీ, తరవాతనూ కూడా సప్తర్షిమండలంలో ౩-౪-౫ చుక్కల మధ్య—ఇక్కడ పటములో చూపించినట్టు రాత్రి ౮-౯ గంటలప్పుడు కనబడుతున్నది. తరువాత రాత్రి అంతా కనబడుతున్నది. ఇందులో ౩ అంక వేసి చూపినది పులస్త్యుడు. ౪. అత్రి, ౫. అంగీరసుడు, ౬. వసిష్ఠ-అరుంధతులు(౬ ప్రక్కనున్న చిన్న చుక్క అరుంధతి),

౮. మరీచిఋషి. ఇందు ౩-౮ చుక్కలకు తూర్పుభాగమందు ౩-౫ చుక్కల మధ్య కనబడునదే తోకచుక్క; ౯ అంకెతో చూపబడినది. ౩-౮-౯ ఒక త్రిభుజము (Triangle) వలె కనబడును.




సప్తఋషుల పటము - ఇపుడు కనబడుచున్న తోకచుక్కతో

ధ్రు-ధ్రువనక్షత్రము. 1. క్రతుఋషి, 2. పులహుడు, (1-2 Pointers-ధ్రువ సూచకులు) 3. పులస్త్యుడు, 4. అత్రి, 5. అంగీరసుడు, 6. వసిష్ఠుడు-అరుంధతి, 7. మరీచి, 8. తో. శూలాగ్రమువంటి శిఖతో కనబడుతున్న ఇప్పటి తోకచుక్క.

యంత్రసహాయము ఏమీ లేకుండా మామూలుగా చూచినపుడు ఈ తోకచుక్క మన కళ్లకు పువ్వుమిచుక్కమబ్బుకంటె తక్కువ వెలుగుతో - సిబ్బిలాగున గుండ్రముగా-పొట్లపువ్వులాగ తెల్లతెల్లగా మధ్య ఆవగింజంత చిన్న చుక్కతోకూడా స్పష్టంగా కనబడుతున్నది. బైనాక్యులర్లు ( Binoculars ) పెట్టి చూస్తే వెండిపళ్లెంలాగ ధవళధవళంగా వర్తులంగా ఉన్న దృశ్యం మధ్య శూలపు మొనలాంటి చుక్క చక్కగా కనబడుతున్నది.

ఈ సందర్భాలు అన్నీ ఆలోచించి చూస్తే ఈ తోకచుక్క వాడు వరాహమిహిరుడు బృహత్సంహితలో కేతుచార మనే అధ్యాయంలో వర్ణించిన కాశ్యప కేతువే వా ఇది అని నాకు అనుమానం కలుగుతున్నది.

ఇటీవల విశేషంగా ఖగోళవేధ చేస్తున్న పరిశోధకులు ఒక్కొక్క ధూమకేతువుయొక్క రూపమూ, గతిమార్గాలూ సూక్ష్మంగా పరిశీలించి, దాని స్వభావం ఇట్టిదనీ, ఇన్నేళ్లకు ఒకమారు కనిపిస్తూ ఉంటుందనీ నిర్ణయించి తృప్తికరంగా ఋజావుచేసినపుడు, ఆతోకచుక్కకు ఆ పరిశోధకుడిపేరు పెట్టడం వైజ్ఞానికులకు రివాజాగా ఉంటున్నది. Halley's Comet - హాలీ తోకచుక్క; Beila's Comet - బీలాతోకచుక్క; Encke's Comet - ఎన్కీ తోకచుక్క; Donati's Comet - డోనటీ తోకచుక్క అని యిలాగ రెండుమూడు తోకచుక్కలకు వాటి పరిశోధకులపేర్లు జతచేసి గుర్తిస్తున్నాము. ఇప్పటికి తెలిసిన తోకచుక్కలు ఎనిమిదివందల లున్నవి.

అలాగే ప్రాచీనకాలంలో జ్యోతిషాచార్యులు (Astronomers) చక్కగా ఖగోళవేధ చేసి అనేక ధూమకేతువులను గుర్తించిరి. వాటివాటి కక్ష్యామార్గములు (Orbits) నిర్ణయించిరి; గతి విశేషములు జాగ్రతగాకని పెట్టిరి.

ఏ తోకచుక్క ఎప్పుడు ఎక్కడ ఎలాగ ఏరూపంతో సంచారంచేస్తుందో వివరంగా వర్ణించారు. గర్గ, పరాశర, అసిత, దేవలాదులగు మహాఋషులు తమగ్రంథములలో ఈతోకచుక్కలనుగూర్చి వివరాలు ఇచ్చి ఉన్నారు. ఆప్రాచీనగ్రంథము లిప్పుడు లేవు కాని ఆగ్రంథములనుండి వరాహమిహిరాచార్యులవారు కేతుచారవివరములు కొన్ని గ్రహించి బృహత్సంహితలో వ్రాసినారు. ఆ గ్రంథరాజమునకు భట్టోత్పలుడు టీక వ్రాసినాడు.

విజ్ఞానచంద్రికామండలిస్థాపకులు, పూజ్యపాదులు కీ. శే. కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావుపంతులుగారు తాము రచించిన హిందూమహాయుగములో సూత్రకాలము నాటి భారతదేశస్థితిని వర్ణించినారు. ఆనాటి భారతీయుల విజ్ఞానము (Culture), సర్వంకషకృషి ఎట్టిదో తెలుపుటకు వారు ఆ చరిత్రగ్రంథములోనే నాటి ఖగోళవిజ్ఞానమును ప్రశంసించుచు ఇట్లు వ్రాసినారు (చూ: హిందూమహాయుగము, నాలుగవ కూర్పు, ౧౯౧౦-వ సంవత్సరము. పుటలు ౮౭-౮౯):

"పైతామహ శ్చలకేతుః పంచవర్ష శతం ప్రోష్య ఉదితః—పైతామహకేతువు ౫౦౦ సంవత్సరములు తిరిగితిరిగి ఉదయించును. అథోద్దాలకః శ్వేతకేతు ర్దశోత్తరం వర్ష శతం ప్రోష్య—ఉద్దాలక శ్వేతకేతువు ౧౧౦ సంవత్సరములు పరిభ్రమించి ఉదయించును. (ఉపనిషత్తులలో వినబడు ఉద్దాలక శ్వేతకేతువు ఈ జ్యోతిషాచార్యుడేనా?)

దృశ్యం శూలాగ్రాకారాం శిఖాం దర్శయన్ బ్రహ్మనక్షత్ర ముపస్పృశ్య మనాక్ ధ్రువం బ్రహ్మరాశిం సప్తర్షీన్ సంస్పృశ్య...కాశ్యపః శ్వేతకేతుః పంచదశం వర్ష శతం ప్రోష్యైంద్ర్యాంప ద్మకేతో ర్వారాంతే నభ స్త్రిభాగ మాక్రమ్యాపసవ్యం నివృత్తోర్ధ్వప్రదక్షిణ జటాకారశిఖః స యావంతో మాసాన్ దృశ్యతే తావ ద్వర్షాణి సుభిక్ష మావహతి.—శూలాగ్రమువంటి శిఖను ధరించు కాశ్యపశ్వేతకేతువు ౧౫౦౦ సంవత్సరములు ప్రవాసము చేసి పద్మకేతు వనుతోకచుక్క వచ్చిపోయినతరువాత పూర్వదిక్కున నుదయించి, బ్రాహ్మ ధ్రువనక్షత్రమును, బ్రహ్మరాశిని, సప్తఋషులను స్పృశించి ఆకాశముయొక్క ౧/౩ వంతు భాగమును ఆక్రమించి అపసవ్యమార్గమున బోవును. అర్ధవర్తులాకారమైన జటలు గల యీధూమకేతువు ఎన్ని నెలలు కానవచ్చునో అన్ని సంవత్సరములు సుభిక్షకాల మగును.

అథ రశ్మికేతు ర్విభావసుజః ప్రోష్యశతమావర్తకేతో రుదిత శ్చారాంతే కృత్తికాసు ధూమశిఖః-నూరేండ్లుమట్టి ఆవర్తకేతువు వచ్చిపోయినతరువాత విభావసు జరశ్మికేతు వనునది కృత్తికానక్షత్రమునందు ఉదయించును. దానికి ధూమశిఖ కలదు."

ఇంకను ఉద్దాలక - కశ్యప మొదలగునవి ఋషుల నామములు. వారు ఆయాకేతువులనుగురించి చక్కగా కనుగొని లోకులకు తెలిపినందున ఆఋషుల నామములే ఆధూమకేతువులకు పెట్టిరి. ఈవిధముగా తోకచుక్కకు గురుతునామము, జ్యోతిషాచార్యులకు గౌరవము రెండును కలిగినవి. ఇట్లు పేరుపెట్టుట పూర్వాచారము.

పైని వివరించిన సంగతులనుబట్టి ఈ క్రొత్త తోకచుక్క వెనుక కశ్యపుడు గుర్తించిన తోకచుక్క అగునా, కాదా పరిశీలించవలసియున్నది.

కశ్యపకేతువు పద్మకేతు వనునది వచ్చిపోయిన తరువాత వచ్చును. నిరుడు వచ్చిపోయినది పద్మకేతువైతే కావచ్చును. దాని తరువాత ఇపుడు కనిపించుచున్నది ఈ తోకచుక్క.

కశ్యపకేతువు తూర్పున నుదయించును. ఈ క్రొత్తచుక్క తూర్పున ఉదయించుచున్నది.

కశ్యపకేతువు సప్తర్షులను, ధ్రువుడు మొదలగు మరికొన్ని నక్షత్రములను స్పృశించిన ట్లగపడును. ఈ తోకచుక్క ఇప్పుడు సప్తర్షి మండలములో నున్నట్లు కనబడుచున్నది. ఆకారముకూడ గుండ్రముగ, తెలతెల్లగ ఉన్నది. మధ్య శూలపుమొనవంటి చుక్క ఉన్నది.

మరొకటి. ఇప్పుడు లోకము ఎటు చూచినను అల్లకల్లోలమై భయంకరముగా ఉన్నది. ఈ 'గాలివాన' ఘోరపుదినములు గడచిపోయినతరువాత లోకము శాంతి పొంది సుభిక్షముగా ఉండవలెను. ఈ కేతువు ఎన్ని నెలలు కనబడునో అన్ని సంవత్సరములు సుభిక్షముగా ఉండునని కశ్యపుని అనుభవము. కాశ్యప శ్వేతకేతువు లక్షణములు దీనియందు కొన్ని కనబడుటచేత ఈ కేతువు కాశ్యపశ్వేతకేతువు కావచ్చునని అనుమానము కలుగుచున్నది. కాలము గడచుకొలది తక్కిన లక్షణములు పట్టుకో పట్టవో స్పష్టము కాగలదు. తక్కిన లక్షణములుకూడ సరిగా పట్టినయెడల ఇది కాశ్యపశ్వేతకేతువని నిర్ధారణ చేయవచ్చును.

(5-3-48)

---

# విశ్వనాథ పంచశతి

— శ్రీ విశ్వనాథ సత్యనారాయణ —

నూటయిరువదినంబరు నూలుదైన
రంగుచీరయే చాలును, రమణిమిన్న
తెల్లచీరను దాలిచి తెరువువెంటఁ
డెక్కుగాఁబోవుచుండె 'నూకిస్టా' యేమొ ! [౨౩౮]

క్రొత్తభార్య మగనికొఱకు గంజియు బువ్వ
కులుకునడలతోడఁ గొంచురాఁగ
దున్నుచున్న మగఁడు దూరానఁ బ్రియఁ గాంచి
మిగిలినట్టిచెక్క మిగులఁబెట్టె. [౨౩౯]

కాలేజీలోఁ బదుగురు
బాలికలను నామె యొకతె, పాపము, గోలాం
గూలము; తక్కినవారలు
కాలేయము లామెచదువు గట్టెక్కింపన్. [౨౪౦]

బడికి నేనుపోవఁ బ్రతిదినంబును నన్ను
వెంబడింతు వేల ? పిల్లవాఁడ !
బడికి నీవుపోదు, బడిదాఁక నేఁబోదు
నిన్నునడిగినానె, నన్నునడుగ ? [౨౪౧]

ప్రన్నతేన యేరుపడని చిన్నరిమొగ్గఁ
గదిపి పారిపోవు గండుతేటి
తోఁటమాలి దాని దోలింపఁ దిరిగినఁ
బ్రోడపూలుదాఁచె ముకుళములను. [౨౪౨]

పిల్లిపీఁచరకాయలు పేర్మి నూఁచ
బియ్యమును బాదుకొంచును బెద్దయన్న
దినదినమ్ము పొలమునుండి తెచ్చువంట
వట్టిచేతుల నింటికి వచ్చునేలా ? [౨౪౩]

ఆమెజడ దీర్ఘముగనుండ నతఁడు వలచి
తెలియఁ బెండ్లాడుదాఁక నిద్రించలేదు

పెండ్లి తరువాత నవరముల్ వీలిచితేఁగ
నింతి యాతని నిదురింపనీయ లేదు. [౨౪౪]

ఎన్నెన్ని దార్లో ? మూసిన
దన్నన్నియు నామె; కూఁతునానను; తనకుం
మున్నున్న విటులు చేసిన
పన్నగడలఁ ద్రొల్లిఁ దా నుపాధ్యాయకదా. [౨౪౫]

పలకయు బలపమ్ముం గొని
తలవంచుక వ్రాయుచున్న తనయుని తలయే
పలకపయిఁ గలదు; తెలిక
న్నులకొన తండ్రికాళ్లనుం గనుచుండెన్. [౨౪౬]


దేవుని పూజార్థముగాఁ
బూవులు తెచ్చితివి, నగముపూవులు వలపుం
దేవేరి కట్టిపెట్టితి
భావకవుల నగమునంత వట్టెను నీకున్. [౨౪౭]

నిజము : నీవన్నయట్లుగా నీదుకైత
వేదమే, వేదమందెంత వేధకలదు
కామయజ్ఞాని కభిచారహోమములకుఁ
దగిన యర్ధర్చలు, యజుస్సులుగను వెలుఁగు. [౨౪౮]

ప్రాణములకు లోపలి దగు
ప్రాణములో నున్న వలపుఁబైదలి యిట్టుల్
మేనునకును వెలుపలిదగు
మేనునఁ జరియించి వాని మిత్తికిఁ దెచ్చెన్. [౨౪౯]

అతఁడు భార్యవిటుని యందంబు, తెలివియుఁ,
జదువు చూఁచి యెంతొ సంతసించు,
జనులయందుఁ బుణ్యజనుల 'కేటాయింపు'
వినఁగ మున్నె చెప్పె వేమయోగి. [౨౫౦]

ఒక్క యొజ్జగన్నె రొక్కా! మందారంబు
దాని తాత : యనకు తావి మాట!
జగతి నెంతమంది : జాలి యుండదు కాని
పొంగుకోవమన్నఁ బుట్లకొలఁది. [౨౫౧]




# సంతానోత్పత్తి

= శ్రీ దువ్వూరి అనంత అచ్యుత సత్యనారాయణరావు =

ఈ ప్రపంచములో అనేకరకముల జీవులు కోటానకోట్లున్నవి. అందులో కొన్నిలక్షల జీవులు ప్రతిక్షణమూ మృత్యువువాత బడుతున్నవి. కొన్ని జీవులు ఈక్షణమందు మరణిస్తున్నవి; ఇంకకొన్ని మరొకక్షణంలో నాశనమౌతవి. కొన్నిటికంటె కొన్ని జీవులు ఎక్కువకాలము బ్రతుకవచ్చును. కాని ఏజీవియు శాశ్వతము కాదు. అయితే అప్పుడు ప్రపంచములో జీవ ముండదా? ఉంటుంది. జీవికి మరణించడ మొక్కటే ధర్మముకాదు; తన జాతికి చెందిన జీవులను పుట్టించే ధర్మముకూడ కలదు. ఈశక్తియే ప్రపంచములో నున్న జీవులు నశిస్తున్నను జీవము నశించకుండా ఉండుటకు కారణ మౌతున్నది. ఒక జీవివలన ఉద్భవించిన జీవులను దాని సంతాన మందుము. ప్రపంచములో జీవులు అనేకతరగతులకు చెందినవి. అన్నిరకముల జీవులును ఒకేవిధముగా సంతానము పొందవు. ఈ పునరుత్పత్తి (Reproduction), లేదా సంతానోత్పత్తి వేరువేరురకముల జీవులలో వేరువేరువిధములుగా జరుగుచున్నది. ఈ వేరువేరుమార్గములను పరిశీలింతము.

## అంగభేదముతో నిమిత్తములేకనే సంతానోత్పత్తి

లింగభేదము, కామముతో సంబంధము లేని పునరుత్పత్తినిగూర్చి ముందుగా ఆలోచింతము. మానవుని కంటికి అగోచరమైన చిన్నచిన్న క్రిము లెన్నియో ఉన్నవి. సూక్ష్మదర్శినిసహాయముతో మాత్రమే వానిని చూడగలము. అందులో ఎమోబా అనబడు ఒకరకము క్రిము లున్నవి. ఆక్రిములలో ఒక్కొక్కదానిలో ఒకే జీవకణ ముండునుకనుక అవి ఏకకణజీవు లనబడుచున్నవి. అవి నీటి దొరవులలో నుండును. సూక్ష్మదర్శినిసహాయముతో పరీక్షించినచో, అవి చలనము కలిగియున్నవని తెలియును. వాటికన్న సూక్ష్మమైన క్రిములను అవి ఆహారముగా తీసికొనును. ఈ ఆహారము తీసికొనుట చాలా విచిత్రముగా నుండును. ఒక ఎమోబా ఉపరితలముమీద ఏభాగమునకు ఆహారము తగిలినను ఆభాగమువద్ద అది తెరచుకొని ఆహారమును మ్రింగివేయును. కనుక దానికి శరీరమంతయు నోరే; ప్రత్యేకము నోరు లేదు. ఈ అతిసూక్ష్మక్రిములకు ప్రకృతిసిద్ధమైన ముసలితనపు చావు లేదు. కాని ఇవి ఇతరజీవులచే మ్రింగివేయబడుట, శీతోష్ణపరిస్థితుల మార్పుచే మరణించుట జరుగుచుండును. కనుక తమ జాతిని నిలబెట్టుటకు ఇవికూడ సంతానము పొందుట ఆవశ్యకమయినది. వీనిలో ప్రతిజీవియు సాగి, మధ్యకు తెగిపోయి, రెండుభాగము లగుచుండును. ఆరెండుభాగములును జీవము కలిగి రెండు జీవులక్రింద ప్రవర్తించును. ఈ క్రొత్తజీవులలో ఒక్కొక్కటి అను

కాలపరిస్థితులలో మరల రెండుభాగములగుచుండును. ఈలాగున వీని సంఖ్య వృద్ధియగును. ఈవిభజన జరుగుచున్నప్పుడు మొదటి జీవి కున్న ధర్మము లన్నియు దానినుండి తయారయిన జీవులకు రావలెను. విభజన అందు కనుగుణముగా ఉండవలెను. ఎమీబా అన్నది ఒక జీవకణముతో చేయబడినది. జీవకణము ప్రోటోప్లాజమ్ అనే ద్రవ్యముతో నిండియుండును. ఇందులో ఒక కేంద్రకం (Nucleus) ఉండును. ఈకేంద్రకంలో చిన్నచిన్న గింజలవంటి వుండును. వీనిని క్రొమేటిన్ గ్రాన్యూల్స్ (Chromatin granules) అంటారు. ఒక ఎమీబా రెండుభాగము లయినప్పుడు జీవకణములోని కేంద్రకము రెండుభాగము లవవలెను. అలాగున జరుగుచున్నప్పుడు ప్రతి క్రొమేటిన్ గ్రాన్యూలుకూడా రెండు సమానభాగము లయి, క్రొత్తగా వచ్చిన రెండు కణములలోను సర్దుకొనును. ఇలాగున ఎమీబా రెండు సమానభాగము లగును. మానవునికి అపరిమితసహాయము చేయగలిగినటువంటియు, అపరిమితప్రమాదము తేగలిగినటువంటియు బేక్టీరియాక్రిములుకూడ ఈలాగుననే వృద్ధి చెందుచుండును.

దరిదాపు ఒక సెంటిమీటరుపొడవు గలిగినటువంటి కొన్ని క్రిములు నీటి దొరవులలో కానవగును. ఈజీవులకు ఒక చివర తలయు, రెండవ చివర తోకయు ఉండును. ఇది మధ్యకు చీల్చుకొనిపోవును. ఇట్లు విభజన అయినతరువాత మొదటిభాగమునకు తోకయు, రెండవ భాగమునకు తలయు పెరుగును. ఈలాగున ఒక క్రిమి రెండైనది. మంచి నీటిలో నివసించే హైడ్రా అను జీవిలో ఇదియే ఇంకొకరకముగా నగును. దీని శరీరముమీద ఒకప్రక్కగా జీవకణములు పోగయి, ఒక మొగ్గవలె తయారగును. ఆమొగ్గ పెరుగుట పూర్తిఅయినతరువాత ఆహైడ్రా నుండి విడిపోయి, ఇంకొక హైడ్రాకింద తయారగును. కొన్ని చెట్లలోకూడ ఇటువంటి పునరుత్పత్తి చూడనగును. ఆ చెట్లకొమ్మలను కత్తిరించి పాతుటవలన తిరిగి చెట్లు మొలచుట అందరికిని తెలిసిన విషయమే. జంతువులలోను, మానవులలోను ఇటువంటి సంతానోత్పత్తి లేదుసరిగదా - శరీరములో ఒక చిన్నభాగము పోయినప్పుడు తిరిగి పుట్టించుకొను శక్తియైనను లేదు. కాని ఇటువంటి పునరుత్పత్తివిషయములో ఒక విశేషమును గుర్తించవలసియున్నది. పైన చెప్పిన క్రిములు లింగభేదముతో సంబంధము లేని సంతానమును కొన్ని తరములవరకు పొందినతరువాత, ఇంకను అదేవిధముగా చేయుటకు శక్తి లేనివగును. అప్పుడు అసమగభేదములు కల క్రిములు తయారై అవి ఒకదానితో ఒకటి కలియును. ఈ క్రిములు ఒకేకణముతో చేయబడినవికనుక ఒక ఆడక్రిమి, ఒక మగక్రిమి ఒకదానితో ఒకటి పూర్తిగా కలిసిపోవును. అలాగ కలియగా వచ్చిన క్రిమి మరల పూర్వపువానివలె విభజనవలన వృద్ధిపొందును. హైడ్రాలుకూడ కొంతకాలము శరీరముమీద మొలిచిన మొగ్గలవలన సంతానము పొందినతరువాత, ఒక్కొక్కప్పుడు అండకణములను, శుక్లకణములను తయారుచేయుచుండును. వాటి కలయికవలన వచ్చిన హైడ్రాలు మరల పూర్వపువానివలె లింగభేదముతో సంబంధము లేని సంతానమును పొందగలిగియుండును. ఈలాగున మధ్యమధ్య సంతానోత్పత్తివిధానము మార్పులు చెందుటకు కారణము దురూహ్యము.

సాధారణముగా జీవులు రెండు రూపములలో కానవగును. అవి స్త్రీ పురుష రూపములు. స్త్రీయొక్క అండాశయము (Ovary) లో అండకణములు (Female germ-cells) తయారగును. పురుషుని పుల్లింగబీజము (Testes) లో శుక్లకణములు (Sperm cells) తయారగును. ఈ అండశుక్లకణముల కలయికవలన క్రొత్త జీవు లుద్భవించును. చిన్నచిన్న జీవులలో ఈ మార్పులను జాగ్రత్తగా పరిశీలించుటవలన మానవులలోను, పైతరగతి జంతువులలోను సంతానోత్పత్తి జరుగు విధానమును ఊహించుటకు వీలయినది. ఈ అండశుక్లకణముల కలయిక కొన్ని జీవులలో స్త్రీయొక్క శరీరములో నగును. కొన్ని జీవులలో పై ప్రదేశములో నగును. సముద్రములో నివసించెడి అర్చిన్స్ (Sea-urchins) అను జీవుల విషయములో ఈ విధానమును పరిశీలింతము. ఆస్టార్, రిచర్డ్సు, హార్ట్సిగ్ అను శాస్త్రజ్ఞులు సుమారు దెబ్బది

సంవత్సరముల క్రింద ఈ విషయమును పరిశీలించినారు. పొదుగుట కనుకూల మైన ఋతువులలో ఈ ఆడ మగ జీవులు గుంపులు గుంపులుగా పోగయి, తమ అండ కణములను, శుక్లకణములను నీటిలోనికి వదలును. అండ కణములు ఎక్కువ ప్రోటోప్లాజమును కలిగియుండి పెద్దవిగాను, బరువుగాను ఉండును. శుక్లకణములు వాటికన్న చిన్నవిగాను, చురుకుగాను ఉండును. అండకణములు శుక్లకణములను ఆకర్షించెడి ఒక రకపు పదార్థమును నీటిలోనికి వదలును. కనుక కర్మవశాత్తు ఏదేని శుక్లకణము అండకణానికి దగ్గరగా వచ్చినపుడు దానిచే ఆకర్షింపబడును. శుక్ల కణము యొక్క తల అండకణములోని ప్రోటోప్లాజములోనికి చొచ్చుకొనిపోవును. తోక త్రోసివేయబడి నశించును. శుక్లకణము యొక్క కేంద్రకం, లేక తల ప్రోటోప్లాజములో చొచ్చుకొన్న తరువాత కొంత ఉబ్బి, అండకణము యొక్క కేంద్రకముతో కలియును. అప్పుడు రెండింటిలోని క్రొమేటిక్ గ్రాన్యూల్స్ ఒక దానితో నొకటి కలియును. దీనినే ఫలీకరణము (Fertilisation) అందురు. ఆలాగున ఫలీకరణము పొందిన గ్రుడ్డు అభివృద్ధి పొంది, కొత్త జీవిగా తయారగును. చాలరకముల చేపలుకూడ ఇలాగుననే పొదిగెడి కాలములో గుంపులుగా కూడి అండకణములను, శుక్లకణములను నీటిలోనికి వదలును. అందులో కొన్ని ఫలీకరణము పొందును. కొన్ని కలుసుకొనక నశించిపోవును. కప్పలలోకూడ సంతానోత్పత్తి ఈవిధముగనే అగును. కాని ఇవి పైవానివలె కణముల నంత నిర్లక్ష్యముగ వదలవు. ఆడ మగ కప్పలు కొన్ని రోజులు ప్రేమసయ్యాట లాడును. తదనంతరము ఆడకప్ప అండకణములను నీటిలోనికి వదలును. వెంటనే మగ కప్ప వానిపైని తన శుక్లకణములను వదలును. అందుచేత అండకణములు చాలవరకు ఫలీకరణము పొందును.

నీటిలో నివసించే జీవులకు ఇలాగున అండకణములు పైప్రదేశములో ఫలీకరణము పొందుటకు వీలున్నది. కాని నేలమీద నివసించెడి జీవులకు ఇది అసంభవము. శుక్లకణములు నేలపైన ఇంత విచ్చలవిడిగా సంచరించి అండకణములను కలుసుకొనలేవు. అందువలన నేలమీద నుండెడి జీవులకు అండశుక్లకణముల కలయిక స్త్రీశరీరములోననే జరుగును. శుక్లకణములను స్త్రీశరీరములోనికి పంపుటకు వింతవింత ఏర్పాట్లున్నవి. మగసాలిపురుగునకు ఒక చిన్న గొట్టము వంటి దుండును. అది గూడు నేసుకొని అందులో శుక్లమును వదలును. అప్పుడా శుక్లమును గొట్టముతో పీల్చి, గొట్టమును ఆడసాలిపురుగు మర్మావయవములోనికి జొనిపి, అచ్చట ఆ ద్రవమును వదలును. విచిత్రపద్ధతి! వేరువేరు కీటకములలో ఇటువంటి వింతపద్ధతు లెన్నో గలవు. కాని ప్రకృతిలో ఈ ఏర్పాటు లెంతరమ్యముగా నున్నను, ఆడమగజీవులకు కలుసుకొందమనెడి కోరిక లేనిచో ఇవి నిష్ప్రయోజనమే. కనుకనే మృగముల కన్నిటికిని తీవ్రమైన కామమున్నది. కాని ఈ కామము ఎల్లప్పుడును ఉండదు. కొన్ని కొన్ని కాలములలోనే ఈ తీవ్రవాంఛ రేకెత్తును. జంతువులకు తమజాతిని నిలబెట్టవలె ననెడి కోరికయు, బుద్ధియు లేకపోవచ్చును. కాని కలయిక కోర కున్న ఈ వాంఛమూలమున ఆపని జరుగుచున్నది. మానవునికి ఈ కామము అన్ని ఋతువులలోను, అన్ని వేళల యందును ప్రజ్వరిల్లుచున్నది. కాని అతడు బుద్ధిబలముచే ఈ కామమును తన అనుజ్ఞలలో ఉంచగలుగుతున్నాడు.

పైన చెప్పినట్లు స్త్రీశరీరములో శుక్లకణముల తోటి కలయికవలన ఫలీకరణ మందిన అండకణములు అచ్చటనే పూర్తిగా అభివృద్ధి పొందవచ్చును. లేక కొంత వృద్ధి పొందినతరువాత స్త్రీశరీరమునుండి బయటికి వచ్చి పూర్తిగా పెరగవచ్చును. పక్షులు, కోడిపెట్టల విషయములో ఫలీకరణము పొందిన అండకణములు పైన పెరుగును. అవియే గ్రుడ్లు. ఈ గ్రుడ్లను ఆడపక్షి పొదుగుటవలన అవి పరిపక్వము పొంది, జీవము పొందును. ఇతర మృగములలోను, మానవులలోను ఫలీకరణము పొందిన అండకణము స్త్రీ శరీరములోననే పూర్తిగా పెరిగి జీవిక్రింద తయారగును. ఆడమృగముల అండాశయములలో సాధారణముగా ఒక ప్రత్యేకఋతువునందు ఏడాదికొకమారు చాల అండకణములు తయారై శుక్లకణముల కలయికచే ఫలీకరణమును పొందును. కనుక పంది, కుక్క మొదలగు జంతువులలో ఒకేమారు ఒకటికంటె ఎక్కువ

పిల్లలను కనుట గలదు. కాని మానవ స్త్రీలలో మటుకు నాలుగు వారములకు ఒక అండకణముమాత్రము అండాశయములో తయారై, అండవాళము (Oviduct) ద్వారా ప్రయాణము చేయును. అలాగున ప్రయాణము చేయుచున్నప్పుడు శుక్లకణముయొక్క కలయికచే ఫలీకరణ మందినచో, గర్భాశయము (Uterus) లోనికి పోయి అచ్చట పెరుగును. ఫలీకరణ మందనిచో నశించును. అందుచేత ఒకేమారు సాధారణముగా ఒకే బిడ్డ పుట్టును. ప్రకృతివైచిత్ర్యము వలన ఒక్కొక్కప్పుడు ఒకేమారు రెండు అండకణములు తయారగుట, అవి రెండునుకూడ ఫలీకరణ మందుట, కవలపిల్లలు పుట్టుట జరుగుతున్నది. ఈలాగున రెండు అండకణములనుండి పుట్టిన కవలపిల్లలలో పోలిక అంత ఎక్కువగా ఉండకపోవచ్చును. ఇద్దరును ఒకే లింగము (Sex) కలిగియుండకపోవచ్చును. కాని ఒకే అండకణము ఫలీకరణ మందినతరువాత ఒక్కొక్కప్పుడు కొన్నిమార్పులవలన విభజింపబడుటచే కవలపిల్లలు పుట్టవచ్చును. అటువంటప్పుడు ఆ కవల పిల్లలిద్దరును ఒకేవిధముగా నుండి, ఒకేరకమైన రుచులు కలిగి ఒకరినుండి ఒకరిని పోల్చుకొనుట కష్టముగున ట్లుందురు.

## మగజీవి అవసరములేకనే సంతానము పొందు స్త్రీ జీవులు

సృష్టిలో లింగభేదము లేని జీవులు సంతానము పొందుట ఇదివరకు తెలిసికొన్నాము. లింగభేదముండియుకూడ మగజీవి అవసరములేకుండ సంతానము పొందు స్త్రీజీవు లున్న వని తెలిసికొనుట ఆశ్చర్యకరముగా నుండును. తెలగులాబిచెట్లమీదను, కొన్ని ఇతర మొక్కలమీదను ఒకరకము ఆడక్రిములు (Plant lice) ఉండును. వీటి అండకణములు శుక్లకణములతో కలయకనే ఎదిగి, క్రిములుగా మారగలవు. అలాగుననే నీటిలో నివసించెడి కొన్ని జీవులు (Water-fleas) కూడా సంతానము పొందును. అండకణములు వాటి శరీరములో నున్న సంచులవంటి వానిలోనికి వెళ్లి అక్కడ శుక్లకణముల సహాయము లేకుండనే ఎదిగి ఆడక్రిములక్రింద తయారగును. దీనిని కన్యాసంతానోత్పత్తి (Parthenogenesis) అందురు. క్రీస్తుప్రభువు కన్యయొక్క కుమారుడగుట ఇలాగునజే సంభవమేమో. సృష్టిలో మగజీవి అవసరము లేకుండనే పునరుత్పత్తి కొన్ని జీవులలో జరుగుచున్నప్పుడు తక్కినవానిలోకూడ అలాగుననే ఎందుకు జరుగకూడదని మనము ప్రశ్నించవచ్చును. కాని దానికి తగిన జవాబు లేదు. అది సృష్టిరహస్యము. కప్పలయొక్క అండకణములను ప్రకృతివిరుద్ధముగా, శుక్లకణముల సహాయము లేకుండ ఫలీకరణ మందించవచ్చునని శాస్త్రజ్ఞులు నిరూపించినారని ఈ సందర్భములో చెప్పవలసియున్నది. అలాగున ఫలీకరణ మందిన అండకణములు ఎదిగి సాధారణకప్పలక్రింద మారినవి. ఇంకొకవింత ఏమనగా మొక్కలమీద క్రిములు మొగ సహాయము లేకుండ సంతానము పొందగలిగినను, వసంతకాలములోమటుకు వాటి అండకణములు శుక్లకణముల కలయికవలననే ఎదుగును. ఆకాలములో మొగక్రిములు చూడనగును.

## ఒకజీవిలోనే ఆడమగతనములు రెండును

సృష్టిలోని అద్భుతవిచిత్రములలో నింకొకటి ఆడమగతనములు రెండును ఒకజీవిలోనే కలిసియుండుట. వానపాములు, నత్తగుల్లలు, కొన్నిరకముల చేపలును ఈ వింతను ప్రదర్శించుచున్నవి. కాని వీనిలో ఒక్కజీవియు తక్కినవానితో సంపర్కము లేకుండ సంతానము పొందు నని భ్రమపడరాదు. అటుల జరుగుట అరుదు. నత్తగుల్లలు రెండు కామకార్యము నాచరించుట మనము చూడవచ్చును. రెండును ఒకదాని నొకటి చుట్టుకొని ఒకదాని మర్మావయవము లోనికి ఇంకొకటి శుక్లకణములను వదలును. కనుక ఇవి ఒకేకాలమందు స్త్రీగను, పురుషునిగనుకూడ సంచరించుచున్నవి. కొన్నికొన్ని జీవులు కొంతకాలము స్త్రీత్వము, కొంతకాలము పురుషత్వము కలిగియున్నవి. మానవజాతిలోకూడ కొందరు వ్యక్తులలో ఆడమగతనములు కలిసియున్నవి కాని వారు పునరుత్పత్తికి పనికివచ్చుట లేదు.

ఈలాగున వివిధరకములుగా పునరుత్పత్తి జరుగుచున్నది. ఏకకణక్రిములు విభజనవలన వృద్ధిపొందు

తున్నవి. బహుకణజీవులగు హైడ్రా మొదలగునవికూడ కొన్ని ఇటువంటి శక్తి కలిగియున్నవి. కొన్నితరముల తరువాత ఇవి మరల లింగభేదమును కలిగి, ఆడమగ క్రిములు కలిసి, ఒకేరకమైన క్రిములుగా తయారై, అవి మరల విభజనవలన వృద్ధిపొందుట చాల ఆశ్చర్యకరముగా నున్నది. మొక్కలమీద నుండే క్రిములును, నీటిలో నుండే కొన్ని క్రిములును స్త్రీత్వము కలిగియుండియు, పురుషసహాయము లేకుండనే సంతానము పొందుచున్నవి, మధ్యమధ్య కొన్నికొన్ని కాలముల యందు పురుషత్వము కలిగిన క్రిములు ఉత్పత్తి యగుట, ఆస్త్రీక్రిములు వానితోటి సంపర్కమువలన ఆకాలములలో సంతానము పొందుటకూడ వింతగా నున్నది. అవి తమ కనుగుణమైన మార్గములలో పోక మధ్యమధ్య ఈ మార్గమునకు వచ్చుట చూడగా, పునరుత్పత్తికి, లింగభేదమునకు ఏదో ముఖ్యసంబంధ మున్నట్లు తోచుచున్నది తక్కిన జీవు లన్నిటిలోను ఈ లింగభేదము బాగుగా వృద్ధిపొందినది. కనుక పైతరగతులకు చెందిన జంతువులలోను, మానవజాతి లోను ఈపునరుత్పత్తిమార్గములు బాగుగా అభివృద్ధి చెందిన వనుకొనవచ్చును.

ఒకేజీవిలో ఆడమగతనములు కలిసియున్నప్పుడు కూడ అది దాని కదిరే సంతానమును పొందక, ఇంకొకదాని సహాయముతో పొందుచున్నది. దీనిని బట్టి చూడగా ఆత్మఫలీకరణము (Self-fertilisation) సృష్టివిరుద్ధ మనియు, అన్యఫలీకరణము (Cross - fertllisation) సృష్టిరహస్య మనియు తెలియుచున్నది. కొన్నిజీవులు ఆడ మగతనములు రెండును కలిగియుండగలిగినను ఒక్కొక్కమారు ఒకేలింగమును కలిగియుండును. రెండు లింగములను ఏకకాలమందు కలిగియుండవు. ఇది అన్యఫలీకరణముకొరకు తీసికొనిన రక్షణవలె కనిపించుచున్నది. తక్కిన జీవులలో లింగము పూర్తిగా విడిపోయినది. చెట్లలోకూడ అన్యపరాగ సంపర్కము (Cross - pollination) జరుగుట మనకు తెలిసియే యున్నది. దీనినిబట్టి చూడ అన్యఫలీకరణము పునరుత్పత్తికి ప్రధానసూత్ర మనియు (వ్యతిరేకములయిన దృష్టాంతములు కొద్దిగా ఉన్నను), అది పైతరగతులకు చెందిన జంతువులలోను, మానవులలోను బాగుగా అభివృద్ధి పొందిన దనియు తెలియుచున్నది.

ఈపై విషయముల నన్నిటిని పరిశీలించగా లింగభేదము, కామములతో సంబంధము లేని సంతానోత్పత్తి పురుషసంపర్కము లేని స్త్రీ సంతానోత్పత్తికి మొదటిమెట్టనియు, దానికి అభివృద్ధికింద లింగము సృష్టింపబడినదనియు అనుకొనవచ్చును. ఆడమగతనములు రెండును ఒకేజీవిలో ఉండుటకంటె రెండును వేరగుట అభివృద్ధి యని తెలుసుకొనవచ్చును. కనుక మానవ జాతిలోని పునరుత్పత్తిమార్గము క్రిందిజీవులలోని మార్గములనుండి తగిన మంచి మార్పులను పొందిన దనియు, ఉత్తమమైనదనియు తెలిసికొనవలసియున్నది. అనవసరముగా ఈ ఆడమగభేదములు, స్త్రీలను మగవారు బానిసలుగా చేసినారని వారి ఆలజడి, కామమువలన జరుగుచున్న అనర్థములు ఇవన్నియు మానవులలోకూడ లింగభేదము లేకపోతే ఉండకపోవునుగదా, ఎందుకు వచ్చిన దీలింగభేద మని మనము విచారించరాదు. మానవులలోని ఈ లింగభేదము ఒక ఉత్తమమైన అభివృద్ధి. మన అనర్థములను మనము బుద్ధిబలము, త్యాగబుద్ధి ఉపయోగించి సరిచేసుకొనవలెను కాని లింగభేదమును నిందించుట తెలివితక్కువ.

# మైనారిటీ సమస్య - సోవియట్ రష్యా

= శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు =

"మా దేశాన్ని మేమే పరిపాలించుకుంటాము. అన్ని అధికారాలూ మాకు ఇచ్చివేయండి. మా దేశాన్ని మేము రక్షించుకుంటాము. మా స్వాతంత్ర్యాన్ని మేము నిలుపుకోగలము. మమ్మల్ని వదలి మీరు ఇక దయచేయండి."

అని భారతీయు లంతా బ్రిటిష్ ప్రభుత్వానికి పదేపదే చెపుతూవచ్చారు. కాని—

"మీరంతా ఒకదారికి రండి. అందరూ కలియండి. మీలో మీలో ఉన్న తగాదాలను తీర్చుకోండి. ఒకరిమీద ఒకరికి నమ్మక కలిగేట్టుగా చేసుకోండి. అల్పసంఖ్యాకుల సమస్యలను సంతృప్తికరంగా పరిష్కరించుకోండి. ఆతరువాత ఒక్క క్షణం వుంటే వొట్టుపెట్టండి."

అంటున్నారు బ్రిటిష్ అధికారవర్గానికి చెందిన వారు అందరూ.

"వొక్క భారతదేశంనెత్తినే పొద్దుపొడిచిందా? ఏ దేశంలో లేవు—ఈతగాదాలు, ఈవిభేదాలూ? ఆ దేశీయులు ఆసమస్యల్ని పరిష్కరించుకోలేదూ? శాంతిని నెలకొల్పుకోలేదూ? సుఖంగా జీవించటం లేదూ? వారు తమ స్వాతంత్ర్యాన్ని అనుభవించటం లేదూ? తమ దేశాన్ని కాపాడుకోలేకుండా ఉన్నారా?"

అని తిరిగీ భారతీయులు అడిగితే—

"అలాగే మీ దేశాన్ని మీకే వొప్పగింత పెట్టి వెళ్తాం. మరీ—ఈ ప్రభుత్వభారాన్ని ఎవరి నెత్తిన పెట్టాలి? నిర్వహించేవారు ఎవరో మరి ముందుకు రండి. కాని మేము వెళ్లిన మరుక్షణంనుంచీ మీలో మీరు కీచులాడుకొని కన్నుకుచస్తారనే భయం లేకుండా చేయండి."

అని మళ్లీ మొదటికే వస్తున్నారు. ఇది సమాధానమా? కాదు.

ఆగస్టు ౮-వ తారీఖున బొంబాయిలో అఖిల భారతకాంగ్రెసుకమిటీసమావేశం జరుగుతూవుంది. గాంధీగారి 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించారు. బ్రిటిషువారు వెనుకటి సమాధానాలే చెపుతూవున్నారు. "భారతీయులలో ఒకరు ఏటికి లాగేవారు, ఒకరు వొడ్డుకు లాగేవారు. ఒకరిమీద ఒకరికి విశ్వాసం లేదు. ఈపళంగా బ్రిటిషువారు భారతదేశాన్ని వదలి వెళ్లిపోతే మతకలహాలకు హద్దుండదు. అధికసంఖ్యాకులు అల్పసంఖ్యాకులను ఆహుతిగొంటారు. అల్పసంఖ్యాకులను రక్షించవలసిన భారం బ్రిటిషుప్రభుత్వభుజస్కంధాలమీద వుంది"అని ప్రారంభించారు.

వీటన్నింటికీ సమాధానంగా పండిత జవహరలాల్ నెహ్రూగారు 'న్యూయార్కు టైమ్సు'పత్రికకు "భారతీయులు ఏకం కాగలరా?" అనే ప్రశ్నకు సమాధానం చెపుతూ ఒక దీర్ఘ వ్యాసము వ్రాసినారు.

భారతీయుల్లో భిన్నత్వం ఎక్కడుంది? ఈ విభేదాలు ఆదికాలంనుంచీ వచ్చినయ్యా? చారిత్రికంగా పరిశీలిస్తే ఇందుకు ఏమీ ఆధారాలు కనిపించలేదు. బ్రిటిషువారు భారతదేశపరిపాలనాభారం నెత్తినేసు కోటానికి ముందు ప్రజలు తన్నుకుచస్తూవుండేవారా? లేదు. ఓకోతి ఓరొట్టెముక్కను తానే తయారుచేసి రెండు పిల్లుల మధ్య పారేసి పంచుకోమని దూరంగా నిలబడి చూస్తూ కూర్చుంది. పిల్లులు అపంపకంలో తగాయిదాలు పడి మళ్లా కోతిపవోయాన్ని కోరాల్సిన పరిస్థితులు ఏర్పడినయ్. అసలు ఆకోతే లేకపోతే —

అంతేగాదు. జవహరలాల్ నెహ్రూగారు మరి కొన్ని ప్రత్యక్షనిదర్శనాలనుకూడా చూపినారు. రష్యాలో జార్ ప్రభుత్వం పోయింతరువాత అక్కడి వారందరూ ఏకంకాలేదా అని అడిగినారు. అయుధాలు లేకపోయినా, బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, పోలెండ్ మొదలైన దేశాల సాయుధసైనికదళాలను నాలుగుసంవత్సరాలపర్యంతం ఎదిరించలేదా? ఆఖరికి తమ సోషలిస్టుప్రభుత్వాన్ని నిలబెట్టుకోలేదా? తమ దేశాన్ని విదేశీయుల దురాక్రమణనుంచి రక్షించుకో లేదూ? జార్ కాలంలో వివిధతెగలమధ్య నున్న తగాదాలు, వైమనస్యాలూ ఈరోజున ఏవీ! ఇంత గడ్డు ప్రశ్నకుసోవియట్ ప్రభుత్వంఇట్టేసమాధానం చెప్పిందే! భారకరాని కొయ్య ఈఅల్పసంఖ్యాకసమస్య అను కుంటే చిటికలో పరిష్కరించిందే! స్వతంత్రభారత ప్రభుత్వంమాత్రం ఆమాదిరి ఎందుకు చేయలేదు?

ఇది జవహరలాల్ నెహ్రూగారు వేసిన ఎదురు ప్రశ్న.

అసలు మన దేశంలో చాలామంది ముస్లింలీగు కోరినట్లు అందరికీ స్వయంనిర్ణయాధికారం ఇచ్చివేస్తే కుచిక్కులు బహుతేలిగ్గా విడిపోతాయ్ అంటున్నారు. రష్యాలో బోల్షివిక్కులు అల్పసంఖ్యాక సమస్యను అలాగే పరిష్కరించుకున్నారు. మనమూ ఆపంథానే అనుసరించటం లాభదాయకం అంటున్నారు.

"స్వయం నిర్ణయాధికారం" — ఈనినాదం మనకు కొత్తగాదు. కాంగ్రెసు బ్రిటిషువారినుండి కోరుతూ ఉన్నదీ అదే. తమ దేశంలోని ప్రజలకూ అలాంటి అధికారాన్నే ఇచ్చివేస్తాం అని కూడా కాంగ్రెసు బొంబాయిలో తీర్మానించింది. ఇప్పటికి ౧౫ సంవత్సరాలక్రితం పండిత జవహరలాల్ నెహ్రూగారు కూడా సోవియట్ రష్యాలోని అల్పసంఖ్యాకవర్గాలను గురించి వ్రాస్తూ "సోవియట్ రష్యా ఈవర్గాలయెడల అనుసరించిన వైఖరినే మనమూ అనుసరించాలి" అన్నారు.

"రష్యాలో అనేకజాతులు ఉన్నాయి. ఓజాతికీ మరోజాతికీ ఏమీ సామ్యం లేదు. ఎవరి సంస్కృతి వారిదే. ఎవరి ఆచారవ్యవహారాలు వారివే. ఎవరి భాష వారిదే. అసలు రష్యాలో రష్య నులకంటే ఇతరజాతివారే ఎక్కువ. రష్యన్ భాష మాట్లాడేవారు నూటికి నలభైమున్గురుకంటే ఎక్కువ ఉండరు. సోవియట్ ప్రభుత్వం ఏర్పడకముందు ఈ వర్గాలు మూడువందల అరవై అయిదురోజులూ తన్ను కుంటూనే ఉండేవారు. జార్ ప్రభుత్వం ఓజాతికీ మరో జాతికీ మధ్య అలవిగాని అఘాతాలను ఏర్పరిచి తన అధికారాన్ని కాపాడుకుంటూ వచ్చింది. అయితే ౧౯౧౭ లో సోషలిస్టు విప్లవము విజయవంతమైంది. అంతఃకలహాలు అంతరించినాయి. ద్వేషాలు దగ్ధమైనాయి. పరస్పర అనురాగ విశ్వాసాలు పెంపొందినాయి. కులం ఏది అయినా, జాతి ఏది అయినా, అంతా ఒకే ప్రజగా మెలుగుతూ వున్నారు. బోల్షివిక్కులు ఈమహాకార్యాన్ని ఎలా సాధించగలిగారు? వీరియెడల బోల్షివిక్కులు అవలంబించిన వైఖరి యేమిటి? ఈప్రశ్నలకు జవాబులు తెలుసుకోటం అవసరం, ఉపయోగకరం, లాభదాయకం కూడా."

కనుక సోవియట్ రష్యాలోని అల్పసంఖ్యాక వర్గముల చరిత్రను ఆమూలాగ్రంగా తెలుసుకోటం -ముఖ్యంగా ఈరోజుల్లో- చాలా అవసరం. జార్ కాలములో వీరి స్థితి ఎలా ఉండేదీ, సోషలిస్టు రిపబ్లిక్ ఏర్పడింతరువాత ఎలా మారిపోయిందీ పరిశీలిద్దాం.

రష్యాలో రష్యన్ భాష మాట్లాడని తెగలు దాదాపు నూటవలభై వున్నాయి. వీటిలో లక్షకు

పైగా జనసంఖ్య కలిగి, కొంచెం ప్రధానమైనవి ఓ పాతికదాకా ఉంటాయి. పదిలక్షల జనాభా గల జాతీయమైనారిటీలు ఓ ఇరవై వుంటాయి. వీటన్నింటిలోకీ పెద్ద జాతీయ మైనారిటీ యుక్రేనియన్ మైనారిటీ. మూడుకోట్లకు మించి ఉన్నారు. ౮౦ లక్షలమంది పోల్సు, ౩౦ లక్షలమంది యూదులు ఉన్నారు. జారిష్టురష్యాలో వీరందరి స్థితి ఒకే మాదిరిగా ఉండేది. కనుకనే ఆనాటిరష్యాను వర్ణిస్తూ లెనిన్ 'ప్రిజన్ ఆఫ్ నేషన్స్' అన్నాడు. ఈ ఒక్క మాటతో జార్ కాలంలో మైనారిటీలస్థితి ఎలా ఉండేదో చక్కగా తెలిసిపోతుంది.

ఒక్క రష్యనులను మాత్రమే స్వదేశీయులుగా, స్వజాతీయులుగా ప్రభుత్వం పరిగణిస్తూవుండేది. ప్రభుత్వదృష్టిలో మిగిలినవారందరూ పరదేశీయులే. వారు నివసించే ప్రాంతాలు రష్యన్ సామ్రాజ్యానికి చెందిన వలసరాజ్యాలు. వలసరాజ్యాలలో ప్రజలు అనుభవించే కష్టాలన్నింటినీ వీరూ అనుభవించేవారు. ప్రభువులు భేదోపాయములను వుపయోగించి ఆయాప్రాంతీయులు తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోటానికి చేసిన ప్రయత్నాలూ, సలిపిన పోరాటాలూ భగ్నమయ్యేలాగా చేసింది. యూదులమీదకు రష్యనులను పురికొల్పింది; అజార్ బైజానియనులను ఆర్మీనియనులమీదకు ఎగదోసింది. యుక్రేనియన్సుకూ, పోల్సుకూ భేదాలు కల్పించింది. అయినా ప్రజల్లో స్వాతంత్ర్యపిపాస నశించలేదు. దాహం తగ్గలేదు. వాంఛలు నశించలేదు. కాకేసస్ప్రాంతీయులు తమ జాతీయస్వాతంత్ర్యాన్ని సంపాదించుకోటానికి జార్ ప్రభుత్వంతో దారుణయుద్ధాలను చేసినారు. అన్నింటిలోనూ పరాజయాన్నే పొందినారు. జీవితం దుర్భరమైంది. సుక్షేత్రాలన్నింటినీ వదిలి పర్వతాల్లోకి పోయినారు. కడుపు కాలుతున్నా ప్రభువుల బాధల నుండి తప్పించుకొని జీవించవచ్చు ననుకున్నారు. అలానే సెంట్రల్ ఏషియాలోని అనేకజిల్లాల ప్రజలు తమ పొలాలను, ఇండ్లనుకూడా వదిలేసి కొండలకు పోయి కొండజాతులజీవితాన్ని గడుపుకుంటూవచ్చారు. వీ రంతాయులూ తమ స్వేచ్ఛకోసరం, స్వాతంత్ర్యంకోసరం చాలా కష్టపడినారు. ఎన్నో కష్టాలను అనుభవించినారు. ఆఖరుకు జార్ రాజ్యంనుంచి వెళ్లిపోతే గాని స్వాతంత్ర్యపుగాలిని పీల్చి దేహమును పోషించుకోలేకపోయినారు. పూరు వదలివెళ్లిపోయినా వుద్యమాన్ని విరమింపలేదు. జార్ ఉన్నంతకాలమూ జాతీయస్వాతంత్ర్యపోరాటములు సాగుతూనేవచ్చినవి. రష్యాలో శాంతి అనేది లేకుండాపోయింది.

జార్ క్రైస్తవుడు. ప్రజల నందర్నీ క్రైస్తవులుగా మార్చటానికి విశ్వప్రయత్నాలు చేశాడు. ప్రభుత్వశాఖల్లో ఉద్యోగం సంపాదించుకోవాలీ అంటే మతం పుచ్చుకోక తప్పదు. మతస్వాతంత్ర్యం మచ్చుకైనా లేదు. యూదులనూ, మహమ్మదీయులనూ మతపాఠశాలలు నడుపుకోవచ్చు నని చెప్పినారు కాని వారికి స్వేచ్ఛ అనేది లేదు. పాఠశాలల్లో క్రైస్తవమతప్రబోధం అగ్రస్థానం వహించింది. క్రిందటి రెండుశతాబ్దాలలోనూ భారతదేశంలో క్రైస్తవమతవ్యాప్తికి ఎలాంటి ప్రయత్నాలు జరిగినవో ఆ రోజుల్లో రష్యాలోనూ అలాగే గిజాజరియి.

ప్రజలను అజ్ఞానాంధకారంలో బంధించక పోతే తాము పదికాలాలపాటు పరిపాలన చేయటం సాధ్యం కాదని జార్వంశీయుల అభిప్రాయం. కనుకనే అంత దేశంలోని పాఠశాలల సంఖ్య చేతివేళ్లమీద ఎంచటానికి వీలు అయింది. ఉన్న పాఠశాలలనుకూడా మూయించివేసింది ప్రభుత్వం. ౧౮౩౧ లో ఒక్క శాసనంతో దేశంలో ఉన్న పోలిష్పాఠశాల లన్నింటినీ మూయించివేసింది. జాతీయభాషలలో గ్రంథ ప్రచురణ నిషిద్ధం కాకపోయినా ఫలితం అంతగానే ఉంది. అనేకజాతులకు లిపి లేదు. భాష, లిపి రెండూ ఉన్నవారికి విద్యాభ్యాసానికి సౌకర్యాలు శూన్యం. జాతీయభాషల్లో విద్యాభ్యాసం కూడదని శాసించింది. కిర్ఘిజియా అనే రాష్ట్రంలో చదువనూ, వ్రాయనూ నేర్చినవారు రెండువందలమందికంటే ఎక్కువ లేరంటే ఆశ్చర్యంగా ఉంటుంది.

అన్యజాతులలో ప్రతిభావంతులు బయలుదేరుతున్నారని జార్ప్రభుత్వం పసిగట్టిందో, ఇక వారు కనిపించరని తెలుసుకోవచ్చు. యుక్రేనియన్, జార్జి

యన్, ఆర్మీనియన్ ప్రజల సంస్కృతి, కళ, నాగరికత చిహ్నాలన్నింటినీ గోతిలో పెట్టించి గోరీ కట్టించారు. యుక్రేనియన్సు తమ జాతీయనాటకరంగాన్ని ఏర్పాటుచేసుకుంటాం అని కోరితే వల్లకాదన్నారు. ప్రజల గీతాలను పాడితే జార్జియాలో మరణదండన విధించేవారు. యూదులు, యుజ్ బెక్సు, అజెర్ బైజానియన్సు మొదలైనవారికి ప్రభుత్వోద్యోగాలు ఎన్నడూ అందుబాటులో లేవు. కొందరిని ఉద్యోగాలకు అనర్హులని శాసనరీత్యా ప్రకటించింది ప్రభుత్వం. ఇలాంటి స్థితిలోనే ఉన్నారు రష్యనులు కాని అన్యజాతులవారందరూ.

అక్టోబరు ౧౯౧౭లో విప్లవం జయప్రదమైంది. బోల్షివిక్కులు ప్రభుత్వస్థానాలను ఆక్రమించినారు. కెరెన్ స్కీ తాత్కాలిక ప్రభుత్వం పతనమైంది. నవంబరు ౧౫-వ తేది. బోల్షివిక్కు నాయకులు లెనిన్, స్టాలిన్ లు చేరి "ప్రజల హక్కులు" అంటూ ఒక ప్రకటన చేసినారు. సోవియట్ ప్రభుత్వం అనుసరించే జాతీయవిధానాన్ని ఈ నాయకులు ఈ ప్రకటనలో స్పష్టంచేశారు. నాలుగే సూత్రాలమీద ఈ విధానం అంతా ఆధారపడి వుంది.

(౧) రష్యాలోని ప్రజలందరూ సర్వస్వతంత్రులు; సమానులు.

(౨) రష్యన్ ప్రజలందరికీ స్వయంనిర్ణయాధికారం ఉంది. తాము సోవియట్ యూనియనునుంచి వెళ్లి వేరే రాజ్యాన్నికూడా వారు స్థాపించుకోవచ్చును.

(3) ఏజాతికీ ప్రత్యేకహక్కులూ, రక్షణలూ ఉండవు. ఇదివరకు ఉన్న ప్రత్యేకహక్కులు అన్నీ ఈరోజునో రద్దు అవుతున్నాయి.

(౪) రష్యాలో ఉన్న నేషనల్ మైనారిటీలకూ, ఒకే ప్రాంతంలో ఇరుగుపొరుగుగా ఉంటూన్న ప్రజలకూ స్వతంత్రఅభివృద్ధికి ఇహమీదట పూర్తి అవకాశాలు ఉంటాయి.

బానిసత్వంనుంచి బయటపడటానికీ, దాస్య శృంఖలాలను తెంచేసుకోటానికీ సోవియట్ ప్రభుత్వం చక్కని మార్గాన్ని సూచించిందని అందరూ గ్రహించారు. కాని ౧౯౨౨ వరకూ ఈ మైనారిటీల సమస్య కొంత వెనుకబడింది. వెనుకబడిందే అనిమాత్రం ఈ అల్ప సంఖ్యాక వర్గాలు విచారించలేదు. వీటన్నింటికంటే ముఖ్యమైనసమస్య అఖిలరష్యాను ఎదుర్కొనసాగింది. ౧౯౧౮లో ఐరోపాయుద్ధంముగిసింది. కాని ఆతరువాత దాదాపు నాలుగుసంవత్సరాలవరకూ రష్యా, అమెరికా, ఫ్రాన్సు, ఇంగ్లండు, పోలెండు దేశాల సేనల నుండి తమ దేశాన్ని రక్షించుకోటానికి భీకరసంగ్రామాన్ని సాగించవలసివచ్చింది. నిరాయుధులైన ప్రజలు సాయుధులైన సైనికదళములను ఎదుర్కొనవలసివచ్చింది. రష్యాలో నివసించే ప్రజలందరికీ సంబంధించిన సంగ్రామం అది. విజయులైతేనే జీవించటం. లేకుంటే తిరిగి జార్ పరం అవుతుంది రష్యా. మళ్లా దారుణబాధలను అనుభవించవలసివస్తుంది. కనుక తిరిగి జార్ ను రష్యన్ సింహాసనంమీద కూర్చోపెట్టటానికి జరిగే ప్రయత్నాలను సఫలంకాకుండా చేయుటం, ప్రయత్నించేవారిని ప్రతిఘటించటం తమ విధి అని ప్రతిరష్యన్ పౌరుడూ గ్రహించినాడు.

దేశరక్షణకార్యములలో స్వపరభేదాలు అంతరించాయి. ఆవిధంగా అందరిమధ్యా ఐక్యత కుదిరింది. యుద్ధం ముగిసినవెంటనే ౧౯౨౨ లో సోవియట్ యూనియన్ కాంగ్రెసు మాస్కోలో సమావేశమైంది. ౧౯౧౭ లో లెనిన్, స్టాలిన్ లు "ప్రజల హక్కులు" విషయమై చేసిన ప్రకటనను ఆమోదించారు. సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల సంఘాన్ని ఏర్పరచటానికి కూడా ఏకగ్రీవంగా తీర్మానించారు. అన్ని రిపబ్లిక్కులూ ఈ సంఘంలో చేరాలనే నిర్బంధం ఏమీ లేదనీ, చేరిన రిపబ్లిక్కులు ఎప్పుడు కావాలంటే అప్పుడు యూనియనునుంచి విడిపోవచ్చునని కూడా అప్పుడే స్పష్టంగా బోల్షివిక్కు నాయకులు ప్రకటించారు. తదనుగుణంగా తీర్మానంకూడా జరిగింది. రాజకీయ అసమానత్వం, ఆర్థిక బానిసత్వం అంతరించేసరికి జాతీయమైన వైమనస్యాలు తలెత్తటానికి అవసరం లేకుండా పోయింది.

"స్వతంత్ర సోషలిస్టు రిపబ్లిక్కులు సోవియట్ యూనియనులో చేరిపోవటానికి మూడే ముఖ్యకారణ

కాలు కనిపిస్తూ ఉన్నాయి. యుద్ధం ముగిసేసరికి రష్యా అంతా పూర్తిగా చితికిపోయింది. అందరూ చేరి సమష్టిగా ప్రయత్నం చేస్తేగానీ, ఆర్థికస్థితి బాగుపడేలా కనిపించలేదు. అంతర్జాతీయస్థితి ఇంకా ఆందోళనకారకంగానే ఉంది. ఏనిమిషంలోనైనా తిరిగి జార్ పక్షీయులు సోషలిస్టురష్యాపై దండెత్తవచ్చు. అంతర్జాతీయధనికవర్గదాడులను ప్రతిఘటించాలంటే జాతీయ సంయుక్తపోరాటం అవసరంగా అందరికీ అవుపించింది. కనుక అన్ని రిపబ్లిక్కులూ సోవియట్ యూనియనులో చేరిపోయినవి" అని 'సోవియట్ ఆఫ్ ది నేషనాలిటీస్' ఉపాధ్యక్షులైన విన్యాజ్ అప్లసోవా 'జాతీయసమస్యాపరిష్కారం' అన్న వ్యాసంలో ప్రకటించినారు. 'రష్యాలో సాయునతోక్యం' అనే గ్రంథంలో కోట్సు కూడా ఇదేయభిప్రాయాన్ని వెల్లడించినారు.

ఫిన్నో- కరీలియా, ఎస్టోనియా, లాట్వియా, లిథూనియాలు చేరకముందుసోవియట్ యూనియనులో పదకొండు స్వతంత్ర రిపబ్లిక్కులు ఉన్నాయి. ఈ రిపబ్లిక్కులలో ఉన్నప్రజలందరూ రాజకీయ,సాంఘిక, ఆర్థికవ్యవహారాలలో సమానహక్కులే కలిగి ఉన్నారు. జాతిజనాభాను అనుసరించి వారికి ప్రత్యేకహక్కులంటూ, రక్షణలు అంటూ ఏవీ లేవు. ౧౯౩౬ లో తయారైన కొత్త రాజ్యాంగచట్టంలోని ౧౨౩-వ సెక్షనులో ఈవిషయాన్ని సోవియట్ ప్రభుత్వం స్పష్టంగా నిర్వచించింది.

"ఏజాతికి చెందినా సరే, రష్యాలోని ప్రతి పౌరుడికీ సాంఘిక, రాజకీయ, ఆర్థిక, తదితరము లన్నింటిలోనూ ఒకే హక్కు ఉంది. అందరికీ సమాన హక్కులే ఉన్నాయి. దీన్ని ఏశాసనమూ కాదన లేదు.

"ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ, ఈ హక్కులభంగపరిచే ప్రయత్నాలనుగానీ, కొందరికి ప్రత్యేకహక్కులను తమజాతి,మతములనాధారం చేసుకొని, సంపాదింపజరిగేప్రయత్నాలుగానీసహింపబడవు. అలాంటిప్రయత్నాలు చేసేవారు శిక్షార్హులు. ఒకజాతిని బహిష్కరించటానికి గాని, ఇతర జాతులకు ఆ జాతిపై అయిష్టతను, వైమనస్యాన్ని, ద్వేష్యభావాన్ని కల్గించేందుకుగాని ఎవరూ ప్రయత్నంచేయరాదు. అట్టిప్రయత్నాలను చేసేవారు కూడా శిక్షార్హులు."

యూనియనులోని అన్నిరిపబ్లిక్కులకూ, అన్ని విషయాలలోనూ సమాన అధికారాలు, సమాన హక్కులు ఉన్నాయి. ప్రతిరిపబ్లిక్కుకూ ప్రత్యేక, స్వంతరాజ్యాంగచట్టం ఉంది. అయితే ఈ రాజ్యాంగ చట్టంలో యు. ఎస్. ఎస్. ఆర్. రాజ్యాంగ చట్టంలో ఉన్న ప్రధానలక్షణాలు అన్నీ ఉంటాయి. కాని రాజ్యాంగ చట్టాన్ని మార్చే హక్కు ఒక్క సుప్రీం సోవియటుకుమాత్రమే ఉంది. యూనియన్ రిపబ్లిక్కులు రాజ్యాంగ చట్టాన్ని మార్చుకోటానికి ఎక్కడా అవకాశం లేదు. అంతేగాదు. ఈ యూనియన్ రిపబ్లిక్కుల నిర్ణయాలు గానీ, శాసనాలు గానీ యు. యస్. యస్. ఆర్. చట్టానికి, శాసనాలకూ విరుద్ధంగా గానీ, భిన్నంగాగానీ ఉండేపక్షంలో ప్రెసిడియం, అలాంటి నిర్ణయాలను రద్దుచేయగలదు. ప్రెసిడియంవల్ల ఏ యూనియన్ రిపబ్లిక్కుకైనా అన్యాయం జరిగి ఉండే సందర్భాలలో సుప్రీం సోవియటును సమావేశపరచవలసిం దని ప్రెసిడియం కోరవచ్చును. అంతట ఆ సమావేశం జరిగి తీరాలి. ఆ సమావేశంలో ప్రెసిడియం నిర్ణయం పైయూనియన్ రిపబ్లిక్కు అపీలు చేసుకోవచ్చు. సోవియట్ యూనియన్ రాజ్యాంగ విధానాన్ని మనసులో వుంచుకునే వివిధరిపబ్లిక్కులు తమ రాజ్యాంగ విధానాన్ని తయారుచేసుకుంటూఉంటవి. సోవియట్ యూనియనునుంచి విడిపోవటానికి ఎప్పటికీ హక్కుంది ప్రతిరిపబ్లిక్కుకూ. ఈయూనియన్ రిపబ్లిక్కుపొలిమేరలను అచ్చటి ప్రజల అనుమతిలేకుండా మార్చటానికి వీలులేదు.

ఇచట సోవియట్ రాజ్యాంగ విధానమును కొంచెం వివరంగా తెలుసుకోటం అవసరం. రష్యాలోని రిపబ్లిక్కులన్నీ స్వతంత్రరిపబ్లిక్కులు అయినా యూనియన్ పార్లమెంటుద్వారా ఒకదానితోదానికి సంబంధం ఏర్పడిఉంది. ఈపార్లమెంటులో రెండు ఛేంబర్సు ఉన్నయ్. ఒకటి సోవియట్ ఆఫ్ ది యూనియన్, రెండవది సోవియట్ ఆఫ్ ది నేషనాలిటీస్.

యూనియన్ సోవియటుకు సభ్యుల ఎన్నికలు బ్రిటిషుపార్లమెంటులోని కామన్సుసభకు సభ్యుల ఎన్నికలు జరిగినట్లే జరుగుతవి. అంటే వైశాల్యాన్ని గమనించి నియోజకవర్గాలను నిర్ణయిస్తారు. సోవియట్ ఆఫ్ ది నేషనాలిటీస్ మాదిరి సభ ప్రపంచంలో మరే ఇతర ప్రజాస్వామ్యంలోనూ లేదు. అమెరికాలోని సెనెట్ సభకు, రష్యాలోని నేషనాలిటీస్ యూనియనుకు కొంత సామ్యం ఉండనవచ్చు. యూనియనులో ఉన్నటువంటి అన్ని రాజ్యాలకూ సమానప్రాతినిధ్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో అమెరికాలో సెనెట్ సభ, రష్యాలో నేషనాలిటీస్ సభ ఏర్పాటుఅయింది. రిపబ్లిక్ విస్తీర్ణంతో గానీ, జనాభాతో గానీ సంబంధం లేకనే ప్రతిరిపబ్లిక్కూ నేషనాలిటీస్ సభకు ఇరవైఅయిదుమంది ప్రతినిధులను ఎన్నుకోవచ్చును. అసలు రష్యాలో—అంటే రష్యన్ సోవియట్ ఫెడరేటెడ్ రిపబ్లిక్కులోపదికోట్లజనాభా ఉంది. అయినా ఈరిపబ్లిక్కూ పాతికమంది ప్రతినిధులనే ఎన్నుకోవాలి. టాడ్జికిస్తాన్ రిపబ్లిక్కులో ౧౫ లక్షలమందే ఉన్నారు. అయినా ఈరిపబ్లిక్కూ నేషనాలిటీస్ సభకు పాతికమంది ప్రతినిధులనే పంపుతుంది.

స్వతంత్రయూనియన్ రిపబ్లిక్కులు పదకొండూగాక మరికొన్ని నిర్వచింపబడిన ప్రాంతాలు ఉన్నాయి. జనాభా, తదితరవిషయాలను అనుసరించి వీటిని "ఆటానమస్ రిపబ్లిక్కు, ఆటానమస్ రీజియన్సు, నేషనల్ ఏరియాస్" అంటూ వ్యవహరిస్తూ ఉన్నారు. ఇవికూడా, అవి ఉన్న రిపబ్లిక్కు పంపే పాతికమంది ప్రతినిధులనుగాక వేరుగా నేషనాలిటీస్ సోవియటుకు ప్రతినిధులను పంపుకోవచ్చు. యూనియన్ రిపబ్లిక్కులు అనుభవిస్తూ ఉన్నంత సంపూర్ణస్వాతంత్ర్యాన్ని అనుభవించకపోయినా ఒక విధమైన స్వపరిపాలనాధికారం కలిగేఉన్నాయి. ఆటానమస్ రిపబ్లిక్కులు పదకొండుమందిని, ఆటానమస్ రీజియన్సు అయిదుగుర్ని, నేషనల్ ఏరియాస్ ఒక్కరిని నేషనాలిటీస్ సభకు ప్రతినిధులుగా పంపుకూ ఉంటవి.

ఒకే రిపబ్లిక్కులో అనేక మతాలవారు, జాతులవారూ ఉండవచ్చు. అలాంటివారికి తమ సంస్కృతిని, విద్యను, నాగరికతనూ అభివృద్ధి చేసుకోటానికి రిపబ్లిక్కులో లభించే అవకాశాలకంటే ఎక్కువ లభించేందుకు, వారు నివసించే ప్రాంతాలను, ఆటానమస్ రీజియన్సుగానూ, ఆటానమస్ రిపబ్లిక్కుగానూ, నేషనల్ ఏరియాస్ గానూ విభజిస్తారు. స్థానిక వ్యవహారాలలో వీటికి సంపూర్ణ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఉంటుంది. యూనియన్ రిపబ్లిక్కుకు సంబంధించిన వ్యవహారాల్లో వీటికి పెత్తనం ఉండదు. కాని యూనియన్ ప్రభుత్వంవల్ల అన్యాయం జరిగితే, తమ ప్రతినిధుల ద్వారా సుప్రీం సోవియటుకు అపీలు చేసుకోవచ్చు. యు. యస్. యస్. ఆర్. కూ, యూనియన్ రిపబ్లిక్కుకూ ఎలాంటి సంబంధాలు ఉంటాయో, యూనియన్ రిపబ్లిక్కుకూ అందున్న ఆటానమస్ రిపబ్లిక్కులకూ అలాంటి సంబంధాలే ఉంటాయి.

సుప్రీంసోవియట్ సభ్యులందరూ కలిసి ప్రెసీడియం అంటూ ౩౨ గురు సభ్యులుగలఒక కమిటీని ఎన్నుకుంటారు. ఈ ప్రెసీడియం ప్రభుత్వోద్యోగులను-పీపుల్సుకమిసార్సును నియమిస్తుంది. ఈ నియామకం ఎన్నికలద్వారానే జరుగుతుంటది. ఇతర దేశాల్లోని కాబినెట్ మంత్రుల ఉద్యోగాలమాదిరివే ఇవన్నీ.

ఈ ప్రెసీడియం సర్వాధికారాలు కలిగిఉన్నది. యు. యస్. యస్. ఆర్ రాజకీయాలమీదనేగాక, ఇతరయూనియన్ రిపబ్లిక్కుల వ్యవహారాల్లోనూ జోక్యం కల్పించుకోవచ్చు. యు. యస్. యస్. ఆర్. పీపిల్సు కమిసార్సుమీదా, యూనియన్ రిపబ్లిక్కులకు చెందిన కమిసార్సుమీదా కూడా ఈ కమిటీకి అధికారం ఉంది. వీరిలో ఎవరి నిర్ణయాన్నయినాసరే సోవియట్ యూనియన్ శాసనాలకు, రాజ్యాంగవిధానానికి విరుద్ధంగా ఉందని వారు తలిస్తే వెంటనే ఆ ఉత్తరువులను, నిర్ణయాలను రద్దుచేయవచ్చు. సుప్రీంసోవియటును రద్దుచేసి తిరిగి ఎన్నికలను జరిపే అధికారంకూడా ప్రెసీడియముకు ఉంది. చట్టప్రకారం ప్రతి నాలుగుసంవత్సరాలకూ సుప్రీంసోవియట్ ఎన్నికలు జరుగుతూవుంటాయి. కనీసం ప్రతి

ఆరుమాసాలకూ ఒకదఫా సుప్రీంసోవియట్ సమావేశమౌతూఉండాలి.

ఇతరయూనియన్ రిపబ్లిక్ పార్లమెంటుకూడా సుప్రీంసోవియటును అనుసరించే ఉంటుంది. అయితే సుప్రీంసోవియటులో ఉన్నట్లు రెండు ఛేంబర్సు ఉండవు. సోవియట్ ఆఫ్ నేషనాలిటీస్ అని రాష్ట్రాల్లో ఉండదు. కేంద్రంలోని సుప్రీంసోవియట్ ఎన్నుకున్నట్లే యూనియన్ రిపబ్లిక్కులోని సుప్రీంసోవియట్ ఒక ప్రెసిడియంను ఎన్నుకుంటుంది. ఈ ప్రెసిడియం ఆ యూనియన్ రిపబ్లిక్కుకు సంబంధించిన వ్యవహారాలను నిర్వహించటానికి పీపుల్సుకమీసార్సును నియమిస్తుంది. ఈ సందర్భంలో ఒక్క ప్రధానవిషయాన్ని గమనించాలి. యూనియన్ రిపబ్లిక్కులోని ప్రెసిడియంరక్షణ,విదేశవ్యవహారాలకు ప్రత్యేకంగా కమీసార్సును నియమించటానికి వీలులేదు. అంటే యూనియన్ రిపబ్లిక్కులలో డిఫెన్సు, విదేశశాఖలకు వేరుగా, స్వతంత్రంగా కమీసార్సు ఉండరు. ప్రతియూనియనుకూ స్వయంనిర్ణయాధికారం ఉండి, సంపూర్ణస్వాతంత్ర్యం ఉన్నప్పటికీ ప్రధానమైన విదేశాంగ, స్వరక్షణ శాఖలు సుప్రీం సోవియట్ పెత్తనంక్రిందనే ఉంటయ్. అంతేగాదు — రాజ్యాంగనిర్మాణంలోకూడా అఖిలరష్యాసోవియట్ రిపబ్లిక్సు యూనియనుకూ, ఇతర యూనియన్ రిపబ్లిక్కుల రాజ్యాంగనిర్మాణానికీ చాలా దగ్గర సామ్యం ఉంటుంది. అన్ని రిపబ్లిక్కులూ సోషలిస్టుదృక్పథంతోనే అన్నివ్యవహారాలనూ సాగిస్తూ ఉండాలి. అందుకు భిన్నంగా, ప్రధానసూత్రాలకు వ్యతిరేకంగా, శత్రువర్గాలతో చేరి వ్యవహారాలు నిర్వహిస్తూ ఉన్నట్లు ఏరిపబ్లిక్కుమీదనైనా అనుమానం కలిగితే ఫిన్నోకరీలియన్ రిపబ్లిక్కును ఆక్రమించి సోవియట్ యూనియనులో చేర్చుకున్నట్లు చేర్చుకొని, వ్యవహారాలను నడుపుతుంది సుప్రీం సోవియట్.

ఇచట ఫెడరల్ యూనియన్, యూనియన్ రిపబ్లిక్కులమధ్య అధికార పంపకం ఎలా ఉంటుందో గమనించటం ఓపికంగా చాలా అవసరం. ఈపంపకం దాదాపుగా యునైటెడ్ స్టేట్సు ఆఫ్ అమెరికాలో జరిగినట్లే రష్యాలోనూ జరుగుతూవుంది. ఫెడరల్ యూనియనుచే నిర్ణయింపబడే ముఖ్య విషయాలు ఇవి: యుద్ధము, శాంతి,విదేశవ్యవహారాలు, క్రొత్త రిపబ్లిక్కులను యూనియనులో చేర్చుకోవటం, విదేశ వాణిజ్యం, స్వరక్షణ, జాతీ యార్థిక ప్రణాళికలు, బాంకులపరిపాలన, వ్యవసాయిక పారిశ్రామిక సంస్థలు, పౌరసత్వపు హక్కులకు సంబంధించిన శాసనాలు మొదలైనవి. ఇవి గాక ఖనిజ సంపద వినియోగం, ప్రజారోగ్యం, కార్మిక శాసనాలు ఇత్యాది విషయాలలో యూనియన్ రిపబ్లిక్కు గమనించవలసిన ముఖ్యవిషయాలను కూడా యు. యస్. యస్. ఆర్. నిర్ణయించవచ్చు. సాధారణంగా నిర్ణయిస్తూ ఉంటుంది.

సోవియట్ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించటంలో ఒకే ఆదర్శాన్ని, లక్ష్యాన్ని పెట్టుకు పనిచేసింది. దేశంలో ఎక్కడైనా సరే ఓవర్గం, ఓ జాతి వెనుకబడిఉంటే అందువల్ల మొత్తం రష్యా అభివృద్ధికి అంతరాయాలు కలుగుతుందని సోవియట్ ప్రభుత్వపునమ్మకం. ఆయాజాతులు అభివృద్ధి పొంది, వారి సంస్కృతి బాగుపడి ఆ జాతి పురోగమించాలి అంటే వారికి స్వరాష్ట్రం ఒకటి ఏర్పాటుచేయాలి. వారి రాజకీయవ్యవహారాలు,విద్యావ్యాసంగాలను వారి భాషలోనే నడపాలి. వీటన్నింటికీ ఒక రిపబ్లిక్ నిర్మాణం అవసరం. ఆ రిపబ్లిక్కు ఆర్థికంగా స్వయం పోషకం కాకుంటే కేంద్రప్రభుత్వం సహాయం చేస్తుంది. అన్నివిధాలా ఇతరజాతులతో సమాన స్థానంలోకి ఆజాతిని తీసుకురావటానికి అవసరమైన పనులన్నింటినీ చేస్తుంది. సోవియట్ప్రభుత్వం ఏర్పడింతరువాతనే అనేక భాషలకు లిపి అంటూ ఒకటి ఏర్పడింది. ఈనాడు రష్యాలో ౭౦ భాషల్లో పుస్తకాలు, పత్రికలు అచ్చుఅవుతూ ఉన్నయ్. అన్ని భాషల్లోనూ ప్రాథమికపాఠశాలలు ఉన్నాయ్. జాతీయభాషల్లోనే విద్యాభ్యాసం చేస్తూఉన్నారు. అల్పసంఖ్యాకవర్గాలన్నీకూడా అద్భుతంగా అభివృద్ధిచెందినయ్. కేంద్రప్రభుత్వంలో వారందరికీ పూర్తి విశ్వాసం ఏర్పడింది. కనుకనే ఏరిపబ్లిక్కూకూడా యూనియనునుంచి విడిపోవటానికి సంకల్పించదు.

ఈ సందర్భంలో మరో విషయాన్ని కూడా మనం గమనించాలి. అసలు ఏ యూనియన్ రిపబ్లిక్కు అయినా విడిపోవటానికి సంకల్పిస్తుందా? ఆచరణలో, నిత్యకృత్యాల్లో ఈ విడిపోయే హక్కుకు ఎంత ప్రాధాన్యం ఉంది? ఇది అనుమానాస్పదమైన విషయం.

"*Leaders of the dominent Communist Party including Stalin have publicly expressed the view that the Federation of Socialist Republics is but a transition stage towards complete unity and that the right of secession must be interpreted in the light of the need for strengthening the U. S. S. R.*"

ఈ వ్యాసాన్ని ముగించటానికి పూర్వం ఈ సమస్యాపరిష్కారంమీద రష్యాప్రధాని స్టాలిన్ అభిప్రాయాన్ని తెలుసుకోటం ఉచితం.


"వివిధజాతుల మధ్య వైషమ్యాలను కల్పించే పూంజీదారుల వర్గం అంతరించటం, జాతీయావేశాలను రెకెత్తించి, పరస్పర అవిశ్వాసాన్ని పురికొల్పే పీడన పద్ధతి పోవటం, సంపూర్ణ అంతర్జాతీయ దృక్పథం కలిగి, బానిసత్వాన్ని ఏరూపంలోనైనాసరే రూపుమాపి చేయటానికి కంకణం కట్టుకున్న శ్రామికవర్గంచేతుల్లో అధికారం ఉంటం, ఆర్థికసాంఘికజీవిత అవసరాలలో ఒకరికొకరు తోడుకావటం పరస్పరంగా సహాయం చేసుకోటానికి అలవాటుపడటం, అన్నింటికంటె ముఖ్యంగా రష్యన్ ప్రజల సంస్కృతి జాతీయరూపం కలిగి సామ్యవాదతత్వంతో కూడుకొని ఉంటం — ఇవీ, ఇలాంటివింకా ఇతరములు అన్నీ చేరి రష్యన్ ప్రజల మానసిక ప్రవృత్తిలోనూ, జీవితదృక్పథంలోనూ కూడా విప్లవకరమైన మార్పును కలిగించినవి. ఒకరొకరిమధ్య పూర్వం ఉండే అవిశ్వాసం తొలగిపోయింది. స్నేహభావం ఏర్పడింది. ఈవిధంగా ఒకే ఫెడరేటెడ్ స్టేటులో యథార్థమైన సహకారం. శాశ్వతమైన మైత్రి ప్రజల్లో ఏర్పడింది."

ఈ ప్రకటనను ముగిస్తూ రష్యన్ ప్రధాని ఇలాగ చెప్పారు:

"దీని ఫలితంగా ఇప్పుడు మనకు సంపూర్ణ స్వరూపాన్ని పొంది అనేక జాతులతో కూడుకొనిన సామ్యవాదరాజ్యం ఏర్పడింది. ఎన్నో పరీక్షలకు నిలబడింది. ప్రపంచంలో ఏదేశమైనా అసూయపడేలాగా ఉన్నతస్థానాన్ని అలంకరించి ఉంది."

కనుకనే పండిత జవహరలాల్ నెహ్రూగారు 'సోవియట్ రష్యా' అనే గ్రంథంలో ఇలా గన్నారు:

"ఇంతవరకూ సోవియట్ రష్యా సాధించిన ఫలితాలను గమనిస్తే జాతీయసమస్యను అతిచులాగ్గానే పరిష్కరించవచ్చు అనే ఆశ కలుగుతూఉంది. బ్రిటిషువారు శతాబ్దన్నర పరిపాలించారు మన దేశాన్ని. ఈవిషయంలో వారి విధానం చాలా అసంతృప్తికరంగా ఉంది. [అసలు రహస్యం ఉందిగా మరి,-ఈ సమస్య పరిష్కారం కావటం బ్రిటిష్ ప్రభుత్వానికి సుతరామూ ఇష్టంలేదుగా."



ప్రభ—అవునమ్మా.

రుచీ—పాపము, దూతగా వచ్చినవాని నటుల కుట్రపన్ని చంపదలచుట రాజనీతికి విరుద్ధము కాదటే ?

ప్రభ—పరమ శత్రువుచేతిలో చిక్కినప్పుడు ఇక రాజనీతి నెవరు చూచెదరమ్మా. అతడు కేతవరపు కోట పట్టుకొనినప్పుడు మనవారి నెంతమందిని తన పొట్ట పెట్టుకొనలేదు! మీ బావ రాచిరాజు తమ్ముడు ఆయుద్ధములోనే కదా చనిపోయినాడు! అందుకు కసి తీర్చుకొనవలెనని మీ బావ, లక్ష్మీపతిరాజు కలిసి పన్నిన కుతంత్ర మిది.

రుచీ—నాతండ్రిగారుకూడ ఉన్నారా ఈ కుట్రలో ?

ప్రభ—ఆసంగతి నాకు సరిగా తెలియదు; కాని మీతండ్రిగారి కీవిషయము తెలియదనే నా ఉద్దేశము.

(ఇంతలో ఒక సైనికుడు చరచర నడచివచ్చి వెనుకనున్న ఒక రక్షణభటునితో ఏదియో తొందరగా చెప్పి తను లక్ష్మీపతిరాజామందిరమువైపు నడచి పోవును. ఆ రక్షణభటుడు లతికను పిలిచి ఏదియో చెప్పును.)

లతిక—(గబగబ మెట్లు దిగి, నీటిమట్టమునకు వచ్చి) అమ్మా రుచీదేవీ, లక్ష్మీపతిరాజామందిరములో ఏదో అల్లరి జరుగుచున్నట్లు ఉన్నది- రాజకుమార్తెను వెంటనే రాజమహాలు చేర్పవలసిందని ముకుందపాత్రుడు ఇప్పుడే చెప్పి వెళ్లినాడు.

(రుచీదేవి, ప్రభ తత్తరపడుచు, నీటినుండి బయటకువచ్చి, త్వరగా దుస్తులు మార్చుకొని లతికతో కూడ చరచర నడచి రాజమహాలు చేరుకొందురు. లతిక రుచీదేవిఆజ్ఞపై మహాలునందే యుండిపోవును. రక్షణభటులు తొందరగా లక్ష్మీపతిరాజామందిరమువైపు నడచిపోవుదురు. రుచీదేవి, ప్రభ వారి ఉద్యానవాటిలో వెన్నెలలో నడచుచు మాటాడుకొనుచుందురు)

రుచీ—వీరుల కాస్థానమయిన 'వీరవటి' దుర్గములో నేటికి ఎంతటి ఘోరకార్యము జరుగుచున్నది! 'వీరవటి' చండి గజపతి రాజవంశమును రక్షించుగాక!

ప్రభ—(రుచీదేవిని చూచుచుమిన్నకుండును)

రుచీ—ప్రభా, రాయలనుగూర్చి నీయభిప్రాయ మేమి ?

ప్రభ—మన సైనికులపాలిటి యముడని.

రుచీ—అరిభయంకరుడని ఆయనబిరుదావళిలోనే ఉన్నది.

ప్రభ—ఆయనకు బిరుదులకు కొరతయున్నట్లు లేదు. 'మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయరగండ, అరిరాయవిభుడ'

రుచీ—ఎక్కడ వింటివే ?

ప్రభ—ఇంకా వున్నాయమ్మా: 'అరిరాయ భుజుడ, అష్టదిక్కు రాయమనోభయంకర—!'

రుచీ—అబ్బో !

ప్రభ—'పూర్వపశ్చిమ దక్షిణసముద్రాధీశ్వర!'

రుచీ—ఆయనబిరుదాలనుబట్టి చూడ, అతడొక మహావీరు డని తోచుచున్నది.

ప్రభ—ఎంతవీరుడైన నేమి? నేటితో ఆయువు సరికదా !

రుచీ—ఏమో మనవారు పొరబడియుండకూడదా ? అతడు రాయలు కాక నిజముగా రాయల దూతయే అయిన ?

(ఇంతలో ఒకపురుషుడు తొందరగా పరుగెత్తుకొనివచ్చి, గోడగెంతి ఉద్యానవనము ప్రవేశించి, యిటునటు చూచి దగ్గరగా నున్న కుటీరమువైపు తూలుచుపోవును. రుచీదేవి, ప్రభ నివ్వెరపోయి ఒకరి నొకరు చూచుకొందురు. ఆవెంటనే సైనికుల పద ధ్వనులు వినిపించును. ఒక సైనికుడు కత్తి పట్టుకొని గోడ యెక్కి నలుమూలల పరికించుచు లోన ఇద్దరు స్త్రీలను గాంచి, గోడ గెంతి వారిని సమీపించును.)

ప్రభ—(మెల్లగా) మీ బావ రాచిరాజు !

రాచిరాజు—(కొంచెము దూరములో ఆగి) ప్రభా! ఇంకను రాజకుమార్తె ఇచ్చటనే ఉన్నదా ! ఒక శత్రు సైనికుడు ఇప్పుడే ఈవైపునకు తప్పించుకొని వచ్చినాడు. మరి మీరిరువురు వెంటనే మహాలులోనికి పోవుట మంచిది. కాని మీ కెవ్వరును ఈ మార్గముగా పారిపోయినట్లు అలికిడి కాలేదా ?

ప్రభ—(ఏదో చెప్పబోవునంతలో—)

రుచీ—ప్రభా, ఇప్పుడు ఈవంకనుంచి నదీతీరము వైపు పారిపోయినయాతడే వీరు వెదకుచున్న శత్రుసైనికు డయియుండునా ?— కాని సంధిప్రసంగముల మధ్య ఈ శత్రు సైనికాన్వేషణ మేమి ?

(రాచిరాజు ఈమె రెండవ వాక్యము చెవిని పెట్టక "నదీతీరము వైపునకా?" అనుచు కత్తి ఝుళిపించుచు శరవేగమున గోడ గెంతి మిగతా పరివారముతో అదృశ్యుడగును.)

ప్రభ—(నిశ్చేష్టయై రుచీదేవివంక చూచును.)

రుచీ—(ఒక్క నిముస మూరకుండి) ప్రభా! అదగ్గరగోడ కున్న కత్తి నిటు తెమ్మా. ఆకుటీరములో దాగినవానిని పరామర్శింపవలసియున్నది.

ప్రభ—(కళవళపడుచు) అమ్మా, శత్రుసైనికుడు కాబోలును. ప్రమాదము రావచ్చును.

రుచీ—అతని చేతిలో ఆయుధ మున్నటుల లేదు. అయినను పేరెక్కిన గజపతివంశపు క్షత్రియ కన్యను నాకు ప్రమాద మేమి?

రుచీ—(ప్రభ విత్తరపోయి చూచుచుండ, స్వయముగా వాల్గదుగులు వైచి గోడ కమర్చియున్న ఒక ఖడ్గమునందుకొని) ప్రభా, నా వెనుక రమ్మా. మన శాత్రవమిత్రుని దర్శింతువుగాని.

(ఇరువురును మెల్లగా నడచుచు కుటీరమును సమీపింతురు. ద్వారమువద్దనే క్షత్రియోచితాలంకారములతో నొక పురుషుడు నేలపై సొమ్మసిలిపడియుండును. అతని తలలోని రెండుమూడు గాయములనుండి రక్తము స్రవించుచుండును.)

రుచీ—(సంభ్రమముగా, కత్తి నొకమూల నుంచి) ప్రభా! ఇతడెవడో పాపము సొమ్మసిలియున్నాడు. వేగము కొంచెము చల్లనీటిని తెమ్మా.

ప్రభ—(వెడలిపోవును)

రుచీ—(పురుషుని మోముపై నున్న రక్తమును తన చీరచెరగుతో తుడిచి, అతని మోమును పరీక్షించుచుండును.)

(ప్రభ నీటితో ప్రవేశించును. ఇరువురును పడియున్న పురుషునికి శైత్యోపచారములు చేతురు. కొంతవడి కాతనికి తెలివివచ్చి, లేచి, చెంతనున్న యిర్వురు స్త్రీలను ఆశ్చర్యముతో చూచును.)

పురు—నే నెక్కడ నున్నాను?

(మాటలవలన అతడు రాయలదళములోనివాడని యిర్వురు యువతులు క్షణములో గ్రహింతురు.)

రుచీ—తమకు భయము లేదు. సురక్షితముగా నున్నారు.

పురు—కాని - వనదేవతలవలె వచ్చిన మీ రెవ్వరు?

ప్రభ—తమ రెవరో ముందు తెలుసుకొనగోరుచున్నాము.

పురు—(కొంచెము ఆలోచించి, యిటునటు చూచి) నా వెంట ఎవ్వరును రాలేదా?

రుచీ—లేదు. కాని మీ రెవ్వరు? మీకు వచ్చిన ఆపద యేమి?

పురు—(తనలో మాటాడుకొనువానివలె) ఆపద! అవును అప్పాజీమాటలను లక్ష్యపెట్టనందులకు మంచిపరాభవమే జరిగినది.

రుచీ—తమరు రాయలదళములోనివారని ఊహించుచున్నాము.

పురు—అవును. (అని కొంతసేపూరకొని) ఔరా! గజపతి యెంతటి ద్రోహమును తలపెట్టినాడు.

రుచీ—(నయనములు విస్ఫారితములగును.)

ప్రభ—తమరు...విజయనగరాధీశులయిన —

పురు—(అర్ధోక్తిలో) రాయలసేనానిని. గజపతితో సంధిషరతులు మాటాడుటకై రాయలు పంపగా వచ్చిన దూతను...నన్ను రహస్యముగా కుదముట్టింప సాహసించుట సింహముతో చెలగాటమునకు దిగినట్లే అయినది. రెండులక్షల సైన్యములతో అవలితీరమందున్న రాయలనుండి గజపతిని ఎవరు రక్షింపగలరో చూచెదముగాక.

రుచీ, ప్రభ—(ఇరువురు నొకరినొకరు చూచుకొనుచున్నారు.)

ప్రభ—(గాంభీర్యముగ) తమరు శత్రుమధ్యమునందుండి శత్రువులను దూషించుచున్నారు.

రుచీ—తమ రిప్పుడు ప్రమాదావస్థలో నున్నట్లు కూడ మరచినట్లున్నారు.

పురు—అవును. నాకుపచారము చేసిన మీకు ధన్యవాదములు. కాని మీ రెవ్వరో —

రుచీ—(నిర్లక్ష్యముగా) శత్రుసైనికులనుండి తప్పించుకొని పారిపోవుచున్న ఒక మహావీర సేనానిని రక్షింపవచ్చిన మే మెవ్వరిమయిన నేమి కాని —

పురు—(కొంచెము రక్తిమతో) కుమారీ! చేత ఖడ్గ ముండిన, ఈ రా—రాయలసేనాని మీ సైనికులకు వెన్నుచూపునంత భీరువు కాడని తెలిసికొనుము. మోసము చేసి మా ఆయుధములు ముందుగా సంగ్రహించి, రాజమర్యాదను పాటింపక దూతగా వచ్చిన మా పరివారముపై పడిన మీ సైనికుల వీరత్వము కొని

యాడవలెనదే. (అని మూల నున్న కత్తి చూచి, చప్పున లేచి దానిని గ్రహించి) ఇదే మీ సైనికులను వెన్నంటి పోవుచున్నాను. నాకు సెలవు. (పోబోవును.)

రుచీ—(కత్తరముతో) అయ్యా, నీ వొక్కడవు అంతమందితో పోరుట దుర్లభము. తలపై బలమైన గాయములు తగిలిన ట్లున్నవి.

పురు—ఆభయము మీ కనవసరము...గజపతిని తగినరీతి శిక్షింపనిదే—

రుచీ—(గంభీరముగా) సేనానీ! అన్యాయముగా గజపతులను తూలనాడకుము. ఆయన ఈ విషయమం దేమియు నెరుగడు.

పురు—ఆయనకోటలో ఆయన కెరుకలేకుండ ఏ అకార్యమయిన జరుగగలదని ఊహించుట కష్టముగా నున్నది.

రుచీ—ఆయన ముమ్మాటికి నెరుంగడు. ఇదంతయు మీ రాయలచే మున్ను ప్రేటుతినిన మా సామంతరాజులు కొందరు చేరి జరిపిన కుట్ర. అదీగాక దూతగా వచ్చిన నీవే రాయలవని వారు భ్రమపడి—

పురు—ఓహో! నన్నే రాయలనుకొని తుద ముట్టింప సమకట్టిరా? కాని ఆవలిదెసనున్న సేనావాహిని ఊరుకొను ననియే తలచిరా? (పురుషుని దృష్టి అకస్మాత్తుగా రుచీదేవిచీర చెఱగున నున్న రక్తపు డాగులపై పడును. ఆతడు తన తల తడుముకొని చూచుకొనును) ఇదేమి కుమారీ, ఒక భీరువుని రక్తముతో నీ చీర చెరగు కళంకితముగా చేసికొంటి వేమి!

ప్రభ—అయ్యా, మీరు ఆలసింపక వేగమిందుండి వెడలిపోవుట మంచిది. మా సైనికులు మరల ఏ సమయమున కైనను తిరిగి రావచ్చును.

పురు—మీ సైనికులా?

ప్రభ—అవును. మీ వెనుకనే మిమ్ము వెదకుకొనుచు వచ్చిన మా సైనికులనుండి మా రాజకుమారి మిమ్ములను రక్షిం-(నాలుక కరచుకొనుచున్నది.)

పురు—రాజకుమారి!!!

ప్రభ—(గోపన మింక యనవసరమని) అవును. శ్రీ ప్రతాపరుద్ర గజపతి మహారాజులుంగారి ద్వితీయ కుమార్తె శ్రీ—(రుచీదేవి కనుసంజ్ఞ చూసి ఆగిపోవును.)

పురు—(ఆశ్చర్యముతో రుచీదేవిని తిలకించుచు) క్షమింపుము, రాజకుమారీ, నిన్నెరుగక మీ తండ్రిని —

రుచీ—దానికేమిగాని, సేనానీ, నా దొక్క కోర్కె.

పురు—శిరసావహించుచున్నాను.

రుచీ—గతము తలంపక మీ రాయల కెటులయిన నచ్చచెప్పి రక్తపాతము గాకుండ, రెండు రాజ్యములకు సంధి పొసగునట్లు చూడగల్గిన నీకు నా ధన్యవాదములు.

పురు—(నవ్వుచు) అది మీ గజపతి చేతిలోనే ఉన్నది...(కొంచె మాగి) నేను రాయలవద్దనుండి తెచ్చిన సందేశము మీ రెరుగుదు రనుకొందును.

ప్రభ—ఎరుగుదుము. అది మీ రాయల ప్రతిభను చాటుచున్నది. ఇట్లెన్ని దేశములను జయించి ఎందరు రాజకుమార్తెలను—?

రుచీ—ప్రభా, ఆ ప్రసంగము మన కప్రస్తుతము. (అని సేనానివంక తిరిగి) సేనానీ, నీ వామె పల్కులు సరకుగొన బనిలేదు. నీవు చాల అలసియున్నావు. నా మందిరములో ఒకింత విశ్రమించి ఆ గాయములకు తగిన చికిత్స చేసికొనిపోవచ్చును.

ప్రభ—(చెవులు రిక్కించి విని) అమ్మా, మన సైనికులు తిరిగివచ్చుచున్న ట్లున్నది.

రుచీ—(కత్తరముతో) అయ్యా, ఈమె వెంట వెంటనే లోనికి పోవుట శ్రేయస్కరము. ప్రభా, ఈయనను సవ్వడిచేయక నాగదిలోనికి తోడ్కొని పోయి, గాయములకు తగు చికిత్స చేయుచుండుము. నే నిప్పుడే వచ్చెదను.

పురు—(కత్తి తీసి రుచీదేవివంక చూచుచు ఏదియో అనబోవుచుండ)

రుచీ—(వినయముగా) అయ్యా!

పురు—(కొంచె మిటునటు చూచి ప్రభవెంట నడచును.)

(ఇద్దరు నిష్క్రమింతురు)

రుచీ—(కుటీరములోని కేగి సైనికుల పదధ్వనులను జాగ్రత్తగా వినుచుండును.)

రాచిరాజు ఒకసారి గోడవద్దకువచ్చి ఉద్యానవాటిలో నెవ్వరును కాన్పింపకపోగా మరల పరివారముతో వచ్చిన త్రోవపట్టును.)

రుచీ—(ఒక్క నిముస మాగి మెల్లగా కుటీరము వీడి మహలు ప్రవేశించి మేడమీది తన గది చేరుకొనును.)

పురు—రాజకుమారీ, మీ ఉపచారములకు నే నెంతయో కృతజ్ఞుడను. నా కింక సెలవొసంగుము.

రుచీ—అలసియున్నావు. కొంచెము ద్రాక్ష పళ్లను భుజించిపోవుదువు గాని. అదీగాక నీ వాదుస్తులతో పోయిన మా సైనికుల కంటపడవచ్చును. అందుచే వేషము మార్చిన మంచిది. (అని ప్రభవంక జూచి) ప్రభా, కింది కేగి మన రక్షకభటుల దుస్తు లొకజత జాగ్రత్తగా గొనితెమ్ము.

(ప్రభ నిష్క్రమించును)

పురు—(రుచీదేవిని సంభ్రమముతో తిలకించుచు) కుమారీ, నేను నీ కెంతయో ఋణపడియున్నాను.

రుచీ—(ఆయనవంక తిరిగి) సేనానీ, మీ రాయలు ఉదాత్తపురుషు డని వినియుంటిని. ఆయన నెటులయిన సంధికి ఒప్పించుట నీవంతు.

పురు—ప్రయత్నింతును. కాని మీ గజపతి మా రాయల కోర్కెను మన్నించిన మా రాయ లెంతటి యదృష్టవంతుడు!

## రెండవయంకము—మొదటిరంగము

[రుచీదేవిమందిరము. గజపతి, శచీదేవి, రుచీదేవి, ప్రభ]

గజ—అమ్మా రుచీదేవీ, ఈగండమును నీవు తప్ప మరెవ్వరును తప్పింపలేరు.

రుచీ—కాని, తండ్రీ, ఇదంతయు మనవారి కుతంత్రఫలిత మేకదా!

గజ—అవును. కానిగడచిపోయినదానినిగురించి విచారించి లాభము లేదు. రాయలు గొప్ప సేనాసముద్రముతో విడసియున్నాడు. మనవారు యుద్ధము చేసి అతనిని జయించుట అసాధ్యమని తోచుచున్నది.

శచీ—తండ్రీ, రుచిని బలియిచ్చుటతప్ప వేరు మార్గము లేదా?

గజ—అమ్మా, రాయలు సామాన్యుడు కాడు. సామ్రాజ్యచక్రవర్తి. అతనితో సఖ్యముగా నుండుట మన కన్నివిధముల క్షేమదాయకము కాదా? ఇంకను రుచియభిప్రాయ మెటులున్నదో!

రుచీ—తండ్రీ, నాకు గడువు కావలయును.

గజ—అటులనే తల్లీ. నీవు ఈరాత్రి ఆలోచించుకొని రేపటికి నీ నిశ్చితాభిప్రాయము తెలియ చేయవచ్చును. నీ వివాహమునకు ఇష్టపడిన నాకును ఇష్టమే. లేకున్న గజపతిసైన్యములు ఆఖరి మొగపురుగువరకు పోరియే చత్తురుగాక. నే పోవుచున్నాను. (నిష్క్రి)

రుచీ—అక్కా, ఇప్పు డేది కర్తవ్యము?

శచీ—(ఆలోచించుచు) మీ నాన్న చెప్పిన మార్గముతప్ప నాకు మరేదియు కాన్పించుట లేదు.

రుచీ—ఏమది?

శచీ—(శంకించుచు) నీవియ్యకొందువో లేదో గాని, నాది సలహా యిది. తండ్రిగారికి నీయంగీకార మెరుకచేసి, వివాహపు మొదటిరాత్రి—రాయలను నాశనముచే—

రుచీ—ఆఁ! అక్కా ఇప్పటికే గజపతుల కీర్తికి తీరని మచ్చ వాటిల్లినది. మరల మాయోపాయమా?

శచీ—వేరుపాయము లేనప్పుడు మాయోపాయమే గత్యంతరము. ఆలోచించుకొనుము. మనరాజ్య క్షేమము నీధైర్యముపై ఆధారపడియున్న దని మరువకుము. నే పోవుచున్నాను. (నిష్క్రమించును)

రుచీ—ప్రభా! వేరుపాయము లేదటే!

ప్రభ—అమ్మా, దేశక్షేమముకొరకు నీసౌఖ్యమును బలియొసగుట నాకు సమ్మతముగాకున్నది. వివాహమాడినవానిని చేతులార ఏ స్త్రీ చంప సాహసించును! మీతండ్రి చెప్పినటుల అతడు సామ్రాజ్యస్థాపకుడుగాని సామాన్యుడు కాడు. పిదప నీయిష్టము.

రుచీ—ఒకసారి రాయలను చూచినగాని ఇది యుక్తమని నిర్ణయింపజాలను.

ప్రభ—అటులయిన అమ్మా, అటునుంచి నరుకు కొనిరమ్మన్నటుల, ప్రథమమున వివాహమున కంగీకరించుటే యుత్తమముగా నున్నది. తర్వాతిమార్గము దైవము తోపింపకపోడు.

రుచీ—(కొంచెమాలోచించి) సరియే, ప్రభా, తండ్రిగారికి నాసమ్మతిని తెల్పుము.

## రెండవ యంకము—రెండవ రంగము

[రుచీదేవి, ప్రభ]

రుచీ—ప్రభా, రాత్రి దగ్గరపడుచున్నకొలది నాకు భయమగుచున్నది.

ప్రభ—కాని నీకోరిక తీరినది కాదు. రాయ లెటువంటివాడో ఇప్పటివరకు నీవు చూచుట కయినది కాదు కదా!

రుచీ—అవును. బాకునకు వివాహము చేయు నాచారము వారు పాటింతు రనుకొనలేదు.

శచీదేవి—(ప్రవేశించి) రుచీ, నే చెప్పిన వాక్యములు జ్ఞప్తియం దుంచుకొనుము. ప్రభా, ఆకత్తివడ్డాణ్ణము సిద్ధముగా నున్నదా!

ప్రభ—(తలవూపును.)

శచీ—రుచీ! అది తగిలించుకొనుట మరచి పోకుము. వానితో అష్టే ప్రసంగము చేయక వెంటనే గుదముట్టింపవలెను. ఆలసించిన ప్రమాదము రాగలదు. నీ సహాయమునకై మీ బావ, లక్ష్మీపతిరాజు సిద్ధముగా నుందురు. నీపని ముగించి, వారిని మెల్లగా పిలచిన శరీరమును గొనిపోయి నదిలో బడవేయుట వారివంతు. నీధైర్యముపైన మన రాజ్యక్షేమము ఆధారపడియున్నదని మరల హెచ్చరించుచున్నాను. (అని ఒకసారి ఆమెచుబుకమును స్పృశించి నిష్క్రమించును.)

రుచీ—ప్రభా! ఏమి చేయుచుందువు?

ప్రభ—అమ్మా, నాకేమియు పాలుపోకున్నది.

## రెండవయంకము-మూడవ రంగము

[గదిలో రాయలు మంచముపై శయనించియుందును. స్త్రీ జనము రుచీదేవిని లోనికి తోసి బయటకు వత్తురు. రుచీదేవి ఒక్కనిముష ముండి తలుపు బిగించి మెల్లగా అడుగు లిడుకొని మంచమును సమీపించును.

రాయలు ఆమెరాకను గమనించి లేచి కూర్చొనును. ఇద్దరు ఒకరినొకరు చూచుకొందురు.]

రుచీ—(నిశ్చేష్టురాలయి) త...మ...రా?

రాయలు—(నవ్వి) ఆనాడు రాయల దూతపై నుండిన కరుణ నేడు రాయలపై లేకపోయినది!

రుచీ—(మనస్సున ఆలోచనలు గిఱ్ఱున తిరుగుచుండ నిశ్శబ్దముగా నిలువబడియుండును.)

రాయలు—(తటాలున ఆమెనడుముపట్టి, వడ్డాణ్ణమునందు అమర్చబడిన కత్తిని ధరాలున లాగి తల పంకించుచు)"వొడ్డాణ్ణమునందు గుప్తముగ దాచిన కత్తి!"..."వృథాయైన?"

రుచీ—(కళ్లనీళ్లతో ఆతని పాదముల బడి) క్షమార్హురాలను...ఇది నా స్వంతబుద్ధి కాదు....ఆనాటి రాయలదూతయే రాయలని తెలిసిన యింత వరకు వచ్చియుండదు.

రాయలు—(నిందార్హముగా)పైనున్న మీ బావ రాచిరాజున కేమి సమాధానము చెప్పెదవు?

రుచీ—(దిగ్గున లేచి) రాచిరాజా! అతడే మా గజపతివంశమున కావరించిన చెదపురుగు!! అతని ఆలోచనలే మాకొంపలు తీసినవి. ఇక వారెవ్వరి పలుకైనగూడ పాటింపదలచుకొనలేదు.

రాయలు—వారి కెదురుతిరుగుట ప్రమాదమేమో ఆలోచించుకొనుము. ఇదిగో నీ కత్తి. ఇదిగో నా గుండియలు. మీ రాజ్యక్షేమమునకు కంటకముగా నున్న రాయలను తొలగించి మీవారి కానందము గూర్పుము. (కత్తి నామె కందిచ్చును.)

రుచీ—(ఆతని గుండియలపై బడి) నాథా! నన్నింకను పరీక్షించుచున్నటులున్నది. అవసరమయిన ఈ గజపతిపుత్రి మావారి కెదురుగా నిలువబడి ఈ కృపాణముతో భర్తకు తోడుగా నిలుచుటకు వెనుదీయదు!

రాయలు—(మందహాసము మోమున చిగురించును.)

రుచీ—(మూలనున్న తెరవెనుక ఏదియో కదలిన ట్లనుట గాంచి, క్షణములో రానున్న ఆపద గుర్తించి, మెరపు మెరసినట్లు రాయలచేతినుండి కత్తిని గైకొని తెరవంక గురిపెట్టి విసరును.)

రాయలు—(నిశ్చేష్టు డగును.)

(తెరవెనుక హాహాకారములు వినిపించును. రుచీదేవి దగ్గరకు వెళ్లి తెర తొలగించును.)

రుచీ—బాలచంద్రుడు!

బాల—(చేతిలోని కత్తి వదలివైచి గిలగిల కొట్టుకొనుచు) తల్లీ! క్షమింపుము...బుద్ధిహీ...నుడను.. మీ అక్క... శచీదేవి ఆజ్ఞ...

రుచీ—శచీదేవి ఆజ్ఞ? ఏమని?

బాల—నీవు...అధైర్య...పడెదవేమో యని...

రుచీ—(తలపంకించుచు) అర్థమయినది. మీరందరు మా గజపతివంశమున చెడపుట్టినవారు.(అని ఆతని దేహమునుండి కత్తి నూడలాగును. బాలచంద్రమహాపాత్రుని ప్రాణవాయువులు అనంతవాయువులలో కలసి పోవును.)

రాయలు—ఎంతటిగుండెనుగడుచినది! (ప్రేమాతిశయమున ఆమెను దగ్గరకు లాగుకొని)రుచీ, నీవు నిజముగా సుక్షత్రియ రాజపుత్రికవు!

రుచీ — కాని, నాథా! సైవ మరికొందరు కాచుకొనివున్నారు.

రాయలు — ఆవిషయము మా అప్పాజీకి వదలి వేయాము. ఈమందిరము చుట్టును మా సైన్యము ఉన్నది. రాచిరాజు లక్ష్మీపతిరాజు ఈవరకే బంధింపబడినారు.

రుచీ — (ఆతని గుండియలపై తలనిడుకొని) మీరజేయులు!

రాయలు — (నవ్వుచు) కాని ఆనాడు నీవు నా ఉద్యానవనముపై పు రాకుండ నుండిన...?

రుచీ — అంతయూ దైవనిర్దిష్టము.

రాయలు — నాయదృష్టము కూడను!

---

# వసంతాగమము

= శ్రీ జో. జనార్దనశాస్త్రి =

కాలపురుషు శిశిరకర కరస్పర్శచే
ప్రకృతిరమణి రాగపల్లవముల
మదిని వలపు దెలుప, "నిదె వసంతోత్సవ"
మనుచుఁ బాడె కోయిలాటవెలఁది.

అలరుటంపగముల నవ్వారి సృష్టించి,
చిగురుబాకు త్రుప్పు చికిలిచేసి
పలుకుటుక్కరింత గల మేల్ వజీరుండు
దుండగములు సలుప దండు వెడలె.

పడుచుఁగన్నెమావి భావిఫలోదయ
ప్రాప్తమునకు నోచు భాగ్యశాలి
అల సరాగమాధవాలోకనములకు
వలపుఁ జిలుకు పుష్పవతిగ మాఱె.

ముఖమునకు వన్నె దెచ్చు
పరిమళద్రవ్యముతో కూడిన సబ్బు!





## డిల్ బహార్ సబ్బు

(రిజిష్టర్డు)

కేవలము సాధారణమైన సబ్బుకాదు. చర్మమును ఎక్కువ పరిశుభ్రపరచుట తోపాటు మృదుత్వమును, సౌందర్యమును చేకూర్చును. చర్మమునకు కోమలత్వమును కలుగజేయు విలువగల పదార్థము లిందుచేర్చబడుటచే ఈ పనిసాధ్యమగుచున్నది. డిల్ బహార్ సబ్బువాడిన ఎక్కువ నురుగువచ్చును. అందుచే చాలదినములు వినియోగపడును. అనుకూలమైన సువాసన. 3 బిళ్లలుండు పెట్టెఖరీదు 14 అణాలు. వి. పి. చార్జి అదనము. ఇదేమాదిరి గుణమున్న సబ్బులు:—కామినియా సాండల్ సబ్బు, కామినియా హీన, ఇండియన్ బ్యూటీ, 3 బిళ్లలుండు పెట్టె ఖరీదు. 14 అ. వి. పి. చార్జి అదనము రెండుఅణాబిళ్లలు పంపుచు ఉచితముగా పంపబడు సాంపుల్సుకు వ్రాయుడు.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీ, బొంబాయి, 3.




డా॥ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి
& సన్సు, రాజమండ్రి.

## ప్రకటన

ఔషధములను తయారు చేయు దినుసులన్నిటికిని ధరలు విపరీతముగ పెరిగిపోయినవి. అందుచే మేముకూడ కొన్ని మందులకు ధరలను కొద్దిగ హెచ్చింపవలసి వచ్చినది. మరియు జనరలుగ ఇచ్చుచున్న రెండు అణాలు కమీషనును కూడ తగ్గించడమైనది. గాన ఈవిషయము అందరకును తెలియపర్చడమైనది.

ఇట్లు,
డాక్టర్ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.



# విమర్శనము

## నవరసగంగాధరము

ఇది శ్రీ జగన్నాథపండితరాయల రసగంగాధరంలో ప్రథమానవానికి శ్రీ జమ్ములమడక మాధవ రామశర్మగారి అనువాదం. గుంటూరు నవ్యసాహిత్య పరిషత్తువారు దీనిని ప్రకటించారు. వీరు ఈ గొప్ప గ్రంథాన్ని తెలుగులోకి మార్పించి ప్రకటించినందులకు తెలుగువారి కృతజ్ఞతను చూరగొంటూ రనడంలో ఎంతమాత్రమూ సందేహం లేదు.

దీనికి మొదట శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు పదకొండుపుటల పీఠిక వ్రాశారు. ఇందులో "శేష. శ్రీకృష్ణులున్నూ కొండభట్టున్నూ తెలుగువారై యుంటారు, శేషంవారు తెలుగువారు, కొండభట్టు కొండయ్య ఇత్యాదులు తెలుగుపేర్లు. కాగా కొండుభట్టుకు పితృవ్యుడైన భట్టోజీ తెలుగువాడు" ఈ మొదలయిన వింత విషయాలు విమర్శకులు ఆలోచింపవలసినవి ఉన్నై.

**రసగంగాధరం :**

పండితరాయలు భరతముని దగ్గిరనుంచీ అప్పయ దీక్షితులవారివరకూ ఉన్న ఆలంకారికుల సిద్ధాంతాల నన్నిటినీ అవలోడించి-ముఖ్యంగా మమ్మటుని మతాన్ని చులకించి సాహిత్యారామానికి ఘంటాపథం వేశాడు. ఇదే రసగంగాధరం. ఇందులో చాలాచోట్ల అప్పటికి ప్రమాణభూతమైన మమ్మటుని మాటలకు పైమాటలు ఉన్నై:—

౧. అర్థవిశేషంతో కూడిన శబ్దం కావ్యం.

౨. శక్తి ఒక్కటే కావ్యానికి హేతువు.

౩. ఉత్తమోత్తమం, ఉత్తమం, మధ్యమం, అధమం అని కావ్యం నాలుగురకాలు.

౪. చిద్విశిష్టమయిన రత్యాదికమే రసము, లేక రత్యాదియుక్తమయిన చిత్తే రసము.

౫. మాధుర్యము, ఓజము, ప్రసాదము అని గుణాలు మూడు. ఇవి రసధర్మాలే కాక శబ్దార్థాది ధర్మాలు కూడానూ. గుణత్వాలంకారత్వాలు దేనిలో రూఢిగా ఉంటవో ఇప్పటికి ఇంకా నిశ్చితం కాలేదు. వీట్ల సంఖ్యకూడా తేల లేదు...ఇత్యాది.

ఈ సిద్ధాంతాలను ఇల్లా ఉండనీండి.

లోగడ ఆనందవర్ధనుడున్నూ, మమ్మటుడూ నున్నూ భట్టనాయకుని మతమునూనున్నూ, లొల్లటుని మతమునూనున్నూ, శంకుకుని మతమునూనున్నూ చూపగా మనము చూచికొన్నాము. పండితరాయలు ఈ అందరి మతములను వ్యాఖ్యానించడమే కాకుండా చాలా నవీనమతాలను చూపించి "ఇప్పటికీ ఈ విషయములో ఇంకా పరిశీలన జరుగుతూ వున్నది" అని దార్శనికుని సమబుద్ధితో భావకులకు ఈ విచార ధారను జన్నివిడిచాడు.

ఈగ్రంథంలో స్థాయులనుగురించిన్నీ, భావాన్ని గురించిన్నీ, రసాభాస భావాభాసాదులనుగురించిన్నీ సమగ్రమయిన విచారణ ఉన్నది. పండితరాయలు ఏవిషయాన్ని గ్రహించినా ఆ విషయాన్ని ఇతరదర్శనాలకు సరిచేసి లక్షింపక విడిచిన తావు లేదు. ఈ రీతిగా ఇప్పటికి సాహిత్యశాస్త్రంలో దీన్ని మించిన గ్రంథం మరొకటి లేదు.

**నవరసగంగాధరం :**

పండితులకుగూడా అతిగహనంగా వున్న ఈ రసగంగాధరాన్ని నవరసగంగాధరంగా అనువదించిన శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారు మూలంలోని విషయాలను ఎక్కువతక్కువలు లేకుండానూ, మరి సరిగ్గానూ తెలిగించడానికి ప్రయత్నం చేశారు. వీరి ప్రయత్నం సఫలమయిం దని చెప్పడానికి సంతోషిస్తూ వున్నాను.

"విద్యార్థులకూ మిత్రులకూ పాఠాలు చెప్పేటప్పుడు అవలంబించిన ఉపపాదనశైలిని నేను దీనిలో నిబంధించాను"అని వీరు విజ్ఞప్తి చేశారు. "వీని భాస వేఱు"అని నన్నయ్య అన్నట్లు మాధవరామశర్మగారి శైలి వేరు. 'వేరు' అనగా శిష్టమూ, ప్రౌఢమూ అని నాఅభిప్రాయం.

వీరు ఇందలి శ్లోకాలకు పద్యాలు వ్రాయలేదు. "పండితరాజ విమర్శవైభవమును ఆస్వాదించడానికి పండితరాజశ్లోకాలే తగిన వని నాతలంపు"అని వీరు ఈ శ్లోకాలకు చక్కగా తాత్పర్యం విపులీకరించి మంచి పని చేశారు.

వీరి యీ అనువాదదీపంవల్ల మూలంలోని ప్రతి అరణ్యకోణమూ చూచిరావడానికి అవకాశం ఏర్పడింది. 'కాసటబీసట' చదువు పోయింది.

దర్శనాలకు తాత ఐన తాతా సుబ్బారాయశాస్త్రిలవారిదగ్గర వీరు ఈగ్రంథాన్ని చదువుకొని బాగా మననం చేసి తెలిగించి తెలుగుభాషకు మహోపకారం చేశారు. మహామహోపాధ్యాయుల సూక్ష్మదృష్టికూడా ఇంతు ప్రసరించి (చూ: ౨౮౮-౯ పుట) విమర్శకులకు ఉపదేశక మవుతూ వున్నది.

ఇందులో అచ్చుతప్పులు బహు జాగ్రత్తగా దిద్దబడి ఉన్నవి. అయినా ఒకటిరెండుచోట్ల మిగిలిపోయినయ్. శాస్త్రగ్రంథాల్లో ఇటువంటి అచ్చుతప్పులు కూడా ప్రమాదం కలిగిస్తవి కాబట్టి ఈతూరిముద్రణంలో అవి ఉండవ వని ఆశిస్తున్నాను.

లోగడ శ్రీ వేదం వేంకటరాయశాస్త్రులవారు చంద్రాలోకసాహిత్యదర్పణాలనూ, శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రులవారు దశరూపకాన్నీ, శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కావ్యాదర్శధ్వనికారికలనూ తెలిగించి మన కిచ్చారు. ఇపుడు శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారు వక్రోక్తి - రసగంగాధరాలను తెలిగించి ఆంధ్రసరస్వతికి అలంకారశ్రీని సమృద్ధి చేశారు. ఇక వీరి ద్వితీయావనంకోసం సాహిత్యోపాసకులు కనిపెట్టుకొని ఉంటారు.

వేలూరి శివరామశాస్త్రి.

---

## The Early Muslim Expansion in South India

డాక్టరు నేలటూరి వెంకట రమణయ్యగారు, ఎం. ఎ., పి. హెచ్ డి. రచించినది. మద్రాసు యూనివర్సిటీవారిచే ప్రకటితము, ౧౯౪౨. రాయల్ ౮ పుటల సైజు. పీఠికతో కలిపి ౨౨౦ పుటలు.

డాక్టరు శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు ప్రసిద్ధులయిన ఇతిహాసపరిశోధకులు. మద్రాసుయూనివర్సిటీయందు ఇతిహాసపరిశోధనశాఖయందు 'రీడరు' పదవియం దుండి కృషి చేయుచున్నారు. వీరికి సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలలో నేకాక పారసీ భాషయందు గూడ మంచిజ్ఞానము గలదు. వీరు పారసీభాషయందు వ్రాయబడిన ముస్లిం ఐతిహాసికుల రచనలను ఆంగ్ల భాషానువాదములద్వారా చదివి తెలుసుకొనుటతో తనివి జెందక, మాతృకలను, మూలాధారములను స్వయముగా జదివి తమ కున్న ఐతిహాసికసంస్కారముతో వాటికి అర్థము చెప్పి, అన్వయము చెప్పి వ్యాఖ్యానము చేయుగల శక్తిని సంపాదించుకొన్నారు. వీరు పరిశోధన చేయుచున్న విజయనగర మహాయుగము యొక్క చరిత్రకు పారసీభాషాజ్ఞానము సంస్కృతాంధ్రములం తెంత గావలయునో యంత యావశ్యకము. శ్రీ వెంకటరమణయ్యగా రింతవఱకు రచించిన వాటిలో విజయనగరసామ్రాజ్యచరిత్రకు సంబంధించిన గ్రంథములు (1. Origin of the city and the Empire of Vijayanagara. 2. Studies and the History of the Third Dynasty of Vijayanagar.) పాఠకలోకమున కిదివఱకే సుపరి

చితము లయినవి. ఇపుడు వీరు గావించిన నూతన రచన వెనుకటి గ్రంథములవలెనే మిక్కిలి యుపయోగకరమును, విశేషించి అమూల్యము నైనది.

ఇప్పటి కిరువదియేండ్లక్రిందట శ్రీ వెంకటరమణయ్యగారు వ్రాసిన కాలపు ఇతిహాసమునే వారికి లభించిన ఆధారములనుబట్టి డాక్టరు ఎస్. కృష్ణస్వామి అయ్యంగారు 'సౌత్ ఇండియా అండ్ హర్ మహమ్మడన్ ఇన్వేడర్స్' అను గ్రంథమును ఆంగ్లమునందు రచించిరి. వారి గ్రంథమునందు చోళ, పాండ్య, హొయిసలరాజ్యములకు ప్రాధాన్యము చూపబడినది. అదియునుగాక మహమ్మదీయచరిత్రకారులు వ్రాసిన వానిని, మూలగ్రంథములను పారసీభాషలో చదివి పరిశోధింపక ఆంగ్లానువాదములపై ఆధారపడి ఇతిహాసమును అల్లిరి. శ్రీ వెంకటరమణయ్యగారుమాత్రము అట్లుగాక పారసీభాషలోని మూలగ్రంథములను స్వయముగా జదివి ఇతిహాసమును వెల్వరించినారు. ఇంతియే గాదు - అయ్యంగారి రచనవాటికి రెండుమూడు పారసీగ్రంథములు వెలువడలేదు. వాటిలో ముఖ్యమైనది ఈసామీ౯కవి రచించిన 'ఫూతుః ఉస్ సలాటీన్' అను కావ్యము. దానితరువాతిది జియాఉద్దీన్ బరనీ రచించిన గ్రంథము. ఇవిగాక ఆంధ్రభాషలోని 'వెలుగోటివారి వంశావళి,' చాటుపద్యములు, రెడ్లనాటి శిలా, తామ్రశాసనములు మొదలయినవి డాక్టరు అయ్యంగారు ఎరుగరు. వారి దృష్టికి కాకతీయులు, తరువాత రెడ్లు గావించిన మహత్కార్యములు ఎక్కలేదు. ఇటీవలన లభించిన అన్నింటిని సమగ్రముగా, మూలభాషలందు పరిశోధించి, విమర్శించి శ్రీ వెంకటరమణయ్యగారు గ్రంథమును వ్రాసినారు. కావున వెంకటరమణయ్యగారి గ్రంథమునకు గల ప్రాశస్త్యము అయ్యంగారి రచనకు లేదు. అదియునుగాక ఇతిహాసరచనకు తీవగల్గియుండదగు శాస్త్రదృష్టి వెంకటరమణయ్యగారి గ్రంథమునందు హెచ్చుగా గలదు. వీరిరచనలందు దురభిమానముగాని, అభిమానముగాని కన్పడదు.

డాక్టరు వెంకటరమణయ్యగారి గ్రంథము ఎనిమిది అధ్యాయములుగా నున్నది. మొదటి అధ్యాయమునందు పదమూడవ శతాబ్దాంతకాలమునాటికి ఆసేతువింధ్యగిరిపర్యంతము గల దక్షిణమునందు వర్ధిల్లుచుండిన దేవగిరి, ఓరుంగల్లు, ద్వారసముద్రము, మధురా రాజ్యముల వృత్తాంతము సంగ్రహముగా వర్ణింపబడెను. రెండుమూడు అధ్యాయములందు విజిగీషాపరులైన అల్లాఉద్దీన్ ఖల్జీ ఖుట్బుఉద్దీన్ ముబారక్ షా ఖల్జీచక్రవర్తుల దక్షిణరాజ్యములపై సలిపిన భీకర దండయాత్రలు, మహమ్మదీయరాజ్యస్థాపనప్రయత్నములు, హిందూరాజుల దుర్బలస్థితి యిత్యాదులు వర్ణింపబడినవి. నాలుగైదు అధ్యాయములందు తుఘ్లఖ్ సుల్తానులు ఘయాజుద్దీన్, మహమ్మద్ బిన్ తుఘ్లఖ్ లు దేవగిరి, ఓరుంగల్లు సామ్రాజ్యములు విధ్వస్తము గావించిన వృత్తాంతము తెలుపబడినది. ఆరవఅధ్యాయమందు మహమ్మదీయసామ్రాజ్యస్థాపన మే పద్ధతుల మీద జరిగెనో ఆ యితిహాసము వర్ణింపబడినది. ఏడవ యధ్యాయమునందు ఆంధ్రదేశమున తురుష్క పరిపాలనము నిర్మూలము గావించుటకు జరిగిన మహాప్రయత్నములు, ఆంధ్రజాతియొక్క తేజశ్శక్తులు, ప్రజ్ఞాప్రతిభలు విశదీకరింపబడెను. ఏతత్ఫలితముగ నేర్పడిన నూతనరాజ్యముల వృత్తాంతము ఎనిమిదవ యధ్యాయమందు వివరింపబడెను.

విజయనగరసామ్రాజ్య స్థాపనమునకు ముందుగా ఒక ఏబది సంవత్సరములకాలములోపల, అనగా క్రీ. శ. ౧౨౯౬ మొదలుకొని ౧౩౪౬ వఱకు గల కాలమున, ఆసేతునర్మదాపర్యంతము గల దక్షిణదేశరాజ్యములయొక్క ఇతిహాసము ఈ గ్రంథమునందు చక్కగా వర్ణింపబడినది. ఈ ఏబది సంవత్సరముల కాలము ఒకవిధముగ విచిత్రమైన సంధికాలము, ఒకవిధముగ భీభత్సకరమైన విపరీతదుస్సాధ్యకాలము. దక్షిణహిందూస్థానమునకు, జైన, బ్రాహ్మణ, శైవ, వైష్ణవధర్మములకును ఈకాలము మంటలు గ్రక్కు అగ్నిపర్వతమువలె మహావిపత్కరమయ్యెను. ప్రాచీనధర్మము లన్నియు ప్రాచీనరాజవంశములతోపాటు నొక్కసారిగ కూలిపోయెను. మహారాష్ట్రము నేలుచుండిన సేవణరాజవంశము, సకలాంధ్రభూమిని సామ్రాజ్యవైభవముతో పాలించిన కాకతీయరాజవంశము, కర్ణాటతులువదేశములను ఏలిన హొయిసలరాజకుటుంబము, సేతుకాంచీపర్యంతభూమియందంతటను దర్పముతో

విజృంభించి రక్షించిన పంచపాండ్యులను ఒకరితరువాత నొకరు, తుపాను చెలరేగినట్లు చెలరేగిన తురుష్క పరాక్రమాగ్ని జ్వాలలకు నిలువజాలక శలభము వలె మ్రగ్గిపోయెను. ముందు ఖల్జీ రాజవంశము, తరువాత తుఘ్లుఖ్ తురుష్క రాజవంశముల విక్రమ ధాటికి దేవగిరి (దౌలతాబాదు), ఓరుంగల్లు (వరంగల్లు), ద్వారసముద్రము, మధురా రాజ్యములు నాశము బొందెను. ప్రాచీన రాజవంశములు అంతవఱకు తమలో తాము వైరములు సాగించుకొనుచు, దుర్బలులై యుండి, తమతమ జైన, శైవ, వైష్ణవ, బ్రాహ్మణ ధర్మములపట్ల దురభిమానములు గల్గి పరధర్మ సహనముపయితము జూపలేకపోవుటచేత మిక్కిలి దుర్బలులై ఏకమత్యము లేకుండిరి. ఉన్నట్లుండి తటాలున పైబడిన పెద్దపులివలె తురుష్క మహమ్మదీయశత్రుసైన్యముల పరాక్రమమునకు అతిలీలగా గురియై ఆహుతులై నశించిపోయిరి. ఆ వృత్తాంతము నంతయు వెంకటరమణయ్యగారు ఈ గ్రంథమునందు కడు చక్కగా విశదీకరించిరి. దక్షిణ హిందూస్థాన చరిత్రయందు, ఈ ఏబదిసంవత్సరముల కాలము భీకరమైన సంధియుగమని వర్ణించి, ప్రతియొక్క విషయమునకుకూడ ఆధారమును జూపిరి. అట్లనుటలో వారు వ్రాసిన పెక్కు విషయములందు అభిప్రాయభేదము లుండుటకు అవకాశములు లేవని చెప్పుటకు వీలులేదు. ఐతిహాసికుడు నిర్ణయించుకొన్న దృక్పథమునుబట్టి చరిత్రాధార విషయములు వ్యాఖ్యానము చేయబడుచుండును. ఈగ్రంథరచనయందు వెంకటరమణయ్యగారు ముస్లించరిత్రకారులు రచించిన గ్రంథములను ప్రధానములుగా గైకొనుటచేత గాబోలు మహమ్మదీయుల దృష్టితో ప్రతివిషయమును విమర్శించుచు ఎవరో పాశ్చాత్యపండితుడు వ్రాసినట్లు తమ వ్రాతయందు ఒక విధమయిన విచిత్రచిత్తవృత్తిని వెల్లడిచేసిరి. న్యాయదృష్టితో, న్యాయమైన సానుభూతితో, దక్షిణహిందూస్థానవాసివలె శ్రీ వెంకటరమణయ్యగారు ఈచరిత్రను రచియింపజాలరైరి. ఐతిహాసికుడు నిష్పక్షపాతబుద్ధితో, కేవల సాక్షీభూతుడై ఇతిహాసమును దెలుపవలయును. వెంకటరమణయ్యగారు ఎచ్చటనుగూడ నాల్గు మహాసామ్రాజ్యములు ఒక్క ఏబదిసంవత్సరముల కాలములో పెద్ద గాలివానతుపానులో మహావృక్షములట్లు కూకటివ్రేళ్లతో ఏ కారణమున కూలిపోయినవో ఆ కారణములను వివరముగా దెలుపలేదు. ఒక్క త్రుటిలో ప్రాచీనయుగము దక్షిణహిందూస్థాన క్షేత్రమునందు పటాపంచలైపోయెను. ఒక్క క్షణములో నొక క్రొత్త మహమ్మదీయ మహాయుగము తటాలున తెల్లవారినట్లు ప్రారంభమయ్యెను. ఇందులకు కారణములను వెంకటరమణయ్యగారు తెలిపియుండవలయును.

ఈ గ్రంథమునందు వెంకటరమణయ్యగారుదాహరించిన పారసీకపద్య గద్యలకు ఆంగ్లానువాదమును చేర్చియుండిన బాగుండెడిది. పారసీభాషలో తెలుపబడిన యంశములు పాఠకులకు తెలియవలెనన్న ఇప్పుడు వీలులేదు. అందు ముఖ్యము 'ఈసామీ' వ్రాసిన విషయములపై వెంకటరమణయ్యగారు చేసిన వ్యాఖ్యకొక్క పారసీభాషరాని దాక్షిణాత్యులకు శరణ్యము ఇంకొకటి లేదు. అట్లే అక్కడక్కడ వారు మాకంజీదొరగారు సేకరించిన కైఫీయతులను ఆధారములుగా జూపించినపుడు ఆకైఫీయతులలోని ముఖ్యాంశములను పూర్తిగా ఎత్తివ్రాసి, పిమ్మట ఆంధ్రమాతృకలకు ఆంగ్లానువాదమును చేర్చి, రెండింటిని ఫుటునోట్సులో పూర్తిగా నిచ్చియుండవలయును.

వెంకటరమణయ్యగారి రచన కడు మనోహరమై ఒక నవలవలె, ఒకకథవలె పాఠకుని ముందుకు లాగుకొనిపోవుచుండును. ఈగ్రంథము ఆంధ్రదేశచరిత్రకు మిక్కిలి యుపయోగసాధనమై యున్నది. గాఢాంధకారమున నున్న ఈమధ్యయుగచారిత్రమును తెలుసుకొనుటకు త్రోవచూపిన వెంకటరమణయ్యగారు సంకల్పసిద్ధులు. ఈగ్రంథమంతటిలో మిక్కిలి చక్కగా, ఐతిహాసికుని కావశ్యకమయిన విమర్శకదృష్టితో వ్రాయబడినది—కడపటిది 'లిఖరేమను' అను ఏడవఅధ్యాయము. రెడ్లనాటి తామ్రపట్టికలో కన్పట్టు—

(౧) తస్మిన్ ప్రతాపరుద్రే
స్వస్థానం స్వేచ్ఛయైవ యాతవతి,
అథ సా భూర్యవనమయీ
జాతైవాతులో మహామహోమహినా,

(౨) వరాహవ ద్వారిధివారిమగ్నాం
ధరా మశేషాం యవనోదరస్థామ్,
సముద్ధరన్ ప్రోలయనాయకేంద్ర
స్తతః ప్రతిష్ఠాపయతిస్మ తద్వత్.

(౩) పవనజవనవాజివ్రాతరంగోత్తరంగే
యవనబలమహోర్థ్వా భూతధాత్రీంనిమగ్నామ్,
విపులవిజయధామా యస్సముద్ధృత్య చక్రే
నిజభుజమణిభూషాం వీరనారాయణాంకః.

ఇత్యాదిశ్లోకములను వెంకటరమణయ్యగారు చక్కగా విమర్శించి వ్యాఖ్యానముచేసినారు. తురుష్కులధాటికి మగటిమితో ఎదురై నిలిచి, దక్షతతో బ్రాహ్మణ శైవధర్మములను, తమ స్వాతంత్ర్యమును, తద్వారా ఆసేతుగోదావరీపర్యంత దేశస్వాతంత్ర్యమును రక్షించుటకొరకు రెడ్డిభూపాలురును, విజయనగర రాజవంశములను, ఆంధ్రజాతియు సలిపిన అద్వితీయ దేశసేవ, జూపిన జాతిగౌరవము, దేశాభిమానము, ధర్మాభిరతి అన్నియు కడుచక్కగా వర్ణింపబడినవి.

ఈగ్రంథమువంటి గ్రంథము నొకదానిని శ్రీ వెంకటరమణయ్యగారు ఆంధ్రభాషలో రచియింప వలయును. అది దీనికంటె ఎక్కువ విపులముగా నుండవచ్చును. తురుష్కుల పేరులు సరిగా నుచ్చరించుటకై గుర్తులు గల అక్షరములను వాడిన వెంకటరమణయ్యగారు— సత్యాన్వేషణయందును, దానిని ప్రకటించుటయందును దీక్ష గల శ్రీ వెంకటరమణయ్యగారు ఇంకముందైనను 'ఆంధ్ర' అన్న పదము వాడక యథార్థమైన 'అంధ్ర'పదమును వాడుదురుగాక యని కోరుచున్నాను.

ఈకాలమున 'సౌత్ ఇండియా' అన్నమాటలకు ఆసేతునర్మదాపర్యంతము గల దక్షిణహిందూస్థానము అని అర్థము లేదు. ఎప్పుడును కూడ నుండలేదని నా నమ్మకము. 'సౌత్ ఇండియా' అన్న మాట మద్రాసుకు దక్షిణమున నున్న తమిళ్ నాడుకే రూఢియైనట్లున్నది. కావుననే కొందరు ఐతిహాసికులు ఆసేతు వింధ్యాద్రిపర్యంతము గల దక్షిణహిందూస్థానమును తెలుపవలసినపుడు 'సదరన్ ఇండియా' అని వాడుచున్నారు. ఆపదమే యుక్తమని తోచుచున్నది. శ్రీ వెంకటరమణయ్యగారు ఈవ్యవహారస్థితిని పురస్కరించుకొని Early Muslim Expansion in southern India అని తమ గ్రంథమునకు నామకరణము చేసియుండిన యుక్తముగా నుండెడిది.

ఈమాత్రపు స్వల్పప్రమాదములను పాటిచేయక విశాలదృష్టితో చూచినవారికీగ్రంథమునందు ప్రాశస్త్యము ఎక్కువ కన్పట్టును. ఇట్టి అపూర్వగ్రంథము శ్రీ వెంకటరమణయ్యగారి అశేష శేముషీపాండిత్య ప్రభావమునకు సాక్షిగా నున్న దన్నచో అతిశయోక్తి కాజాలదు.

భావరాజు వెంకటకృష్ణరావు

---

## ౧. పంజాబుఉత్తరమందలి వ్యవసాయపు పీఠభూముల అరుగుదలా, తత్ప్రతీకారము

(Erosion in the Cultivated Uplands of the North Punjab and its Cure)

## ౨. హోషియార్పూరు పర్వతభూములవిశీర్ణత, తత్కారణములు, తత్ప్రతీకారములు

(The Hoshiarpur Chos-Their Cause and Cure)

రచయిత: హెచ్. ఎమ్. గ్లోవరుగారు, ఐ. ఎఫ్. ఎస్., పంజాబు అడవుల ప్రధానరక్షకుడు. ప్రచురణ: గవర్నమెంటుప్రెస్సు, లాహోరు.

ఈపుస్తకములందలి భాష ఇంగ్లీషు. పంజాబు ఉత్తరప్రాంతమున - ముఖ్యముగా జీలం, రావల్పిండి, అటక్ జిల్లాలలోని వ్యవసాయ యోగ్యములైన పీఠ భూములు, అక్కడక్కడ కొన్ని పరిమిత ప్రదేశములందు తప్ప మిగిలిన వందలకొలదిమైళ్ల వైశాల్యము కల భూములన్నియు నింతవరకూ ఉపేక్షితములై శీతాతప వర్షముల తాకిడికి లోనయిన కయ్యలూ, కాలువలూ, దిబ్బలూ, మెట్టలూ, లోయలుగా నేర్పడి ఎందుకునూ పనికిరాకుండ నున్నవి. ఇటులే హోషియార్పూరు

కొండల నెత్తాలన్నీ పశువులమందలూ, గొఱ్ఱెలూ, మేకలూ స్వేచ్ఛగా మేయుటకువిడిచిపెట్టబడుచుండుట వలన గడ్డిగాదా, మొక్కలూ, వృక్షకములూ నాశనము లగుటయేకాక జంతువుల గిట్టల నిరంతరఘర్షణము మూలమున నేలయంతయూ విశీర్ణమైపోవ వర్షములు కురియుటతోడనే కొండలమీది ఇసుక కొట్టుకొనివచ్చి కొండల యడుగుననుండు పంటచేలలను గప్పివేయ నవి వ్యవసాయయోగ్యములు కాకుండపోయినవి. గ్లోవరు గారు వీటి నన్నింటినీ పరీక్షించి పీకభూములకు అక్కడక్కడ అవసరమైనచోట్ల అడ్డకట్టలు కట్టి, పొలాలకు పెట్టుగోడల నమర్చియు, పర్వతభూములమీద స్వేచ్ఛగా జంతువులమందలను మేయుటకు వదలరాదని శాసించియూ వీటినన్నింటినీ మరల సస్యసంభరితము లయ్యేలాగున చేయుటకు కొన్ని విధానములను సూచించియున్నారు. మన ఆంధ్రదేశమందును ఇట్టి పరిస్థితులు గల భూము లెచటనైన నేర్పడియున్నయెడల అట్టివాని కిందు సూచించిన విధానము లవలంబించినచో నవియూ మరల వ్యవసాయయోగ్యములు కావచ్చును.

పంజాబులోని ఉన్నతభూములు అరిగిపోయి నప్పుడుండిన స్థితియూ, ప్రతీకారపద్ధతు లవలంబించిన వెనుక ఎట్లు మార్పుదలనందినదియూ కనుపరచుటకు చిత్రపటము లనేకము లిందు చేర్చబడియున్నవి.

## గ్రంథ స్వీకారము:

### రేణుక విజయము

గ్రంథకర్త: శిరోమణి సన్నిధానము సూర్య నారాయణశాస్త్రిగారు. ప్రకాశకులు: శివధర్మగ్రంథ మాల, శ్రీ మఠిక నాగయ్యధర్మనిలయము, సికిందరాబాదు, దక్కను. వెల ఒకరూపాయి.

### విరిపిండి గోపాలశతకము

రచయిత: ఆసూరి మరింగంటి రామానుజాచార్యులుగారు. ప్రకాశకులు: ఆంధ్రవాఙ్మయ సేవా సమితి, బూర్గంపాడు, వయా కొత్తగూడెం (యస్. యస్. ఆర్.) వెల నాలుగణాలు.

### దేశం

గీతికలు: రచయిత: విద్వాన్ పైడిపాటి సుబ్బ రామశాస్త్రిగారు, కాయపురము, ఉయ్యూరుపోస్టు. వెల పావలా.

### కృష్ణరాయ నాటకావళి

రచయిత: కోటగిరి వెంకటకృష్ణారావుగారు, జమీందారు, గంపలగూడెము. నాలుగునాటకముల చక్కని సంపుటము. వెల తెలియదు.

### వడ్లగింజలు ✓

కర్త: శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, కలాభివర్ధనీ పరిషత్తు, రాజమహేంద్రవరము. ఖరీదు ౬ అణాలు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.


ఇండియాలల్లా అత్యుత్తమము
LIPTONS
LIPTONS
WHITE LABEL
TEA
LIPTONS
TEA GIRL
లిప్టన్స్
జాకూజా ★ వైట్ లేబిల్
టీగరల్ రకములు

LTK-62-T6